ఆంధ్రపత్రిక


సచిత్ర వారపత్రిక

15-6-49 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4అణాలు






రాజ్యాంగ పరిషత్సభ్యుల గౌరవార్థమై న్యూఢిల్లీలో 3-వ తేదీనాడు భారతప్రధాని నెహ్రూగారు జరిపిన సభలో ఒక అంగముగా నడచిన వినోదకాలక్షేపమునందు సభ్యులు. కాశ్మీరు గాయకుల జంత్రవాద్య సంగీతమును వినుచున్నారు.



జాతీయ సిక్కు నాయకుడు బాబా ఖరక్ సింగు 82-వ జన్మదినోత్సవం సందర్భంలో న్యూఢిల్లీలో జరిగిన సభలో ప్రధానామాత్యుడు నెహ్రూ ఆయనకు వెండి పతాకము బహూకరించినప్పటి దృశ్యం.


వార్తాచిత్రాలు




ఎనిమిది, పన్నెండు దళములకు చెందిన నాలుగు డకోటా విమానదళములు భారతదేశ తూర్పుభాగంలో ప్రదర్శన సంచారమునకు వెళ్లినవి. బయలుదేరుటకుముందు వైమానికులు వాటిలో ఒకదానిని పరీక్ష చేయుచున్నారు.



కామన్వెల్తుతో గల సంబంధాలకు బ్రిటిష్ పార్లమెంటు ఉప కార్యదర్శి డాక్టర్ వాకర్, ఢిల్లీ వచ్చినప్పుడు ఆర్చిబాల్డు నైతో సంభాషిస్తున్నారు. ఇండియా కామన్వెల్తులో ఉండటానికి ఈ సంప్రదింపులు అన్నీ దోహదంచేశాయి.



ఢిల్లీలో బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఫ్రాంకు రాబర్ట్సు చిత్రంలో; రాబర్ట్సుదంపతులు, సర్ ఆర్చిబాల్డు నై ఉన్నారు.



ఈ నెల నాలుగున ఉపప్రధాని సర్దార్ పటేల్ డేరాడూనులో యుద్ధశాస్త్ర విద్యాలయ ప్రారంభోత్సవము జరిపినపుడు వారికి గౌరవ సైనికవందన ఇవ్వబడెను



"కనడాలో" బ్రిటిష్ వ్యవసాయిక నిపుణులసంఘము వ్యవసాయ పరిశీలనలు సాగిస్తూ పర్యటిస్తున్నప్పటి చిత్రం.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

పరుల కేయది యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా

పొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము **41**

సంచిక **39**


Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర జ్యేష్ఠ బహుళ పంచమి బుధవారము



అభినేత్రి వరలక్ష్మి

(శ్రీ రాజరాజేశ్వరీ ఫిలిం కంపెనీవారి 'నవజీవనం'లో)



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ జూన్ నెల 15-వ తేది బుధవారము

ఆసియా ప్రాధాన్యం

జర్మనీ సమస్యను పరిష్కరించుటకు, బెర్లిన్ దిగ్బంధనమును తొలగించుటకు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు, రష్యా విదేశాంగ మంత్రులు గడచిన మూడు వారములుగ పారిస్‌లో జరుపుచున్న సంప్రతింపులు ఫలింపగల అవకాశములు క్షణక్షణమునకు తగ్గుచున్నవి. ప్రస్తుతము అనివార్యముగ కన్పించుచున్న తృతీయ సంగ్రామముదృష్ట్యా జర్మనీ, యూరప్ గాక ఆసియా, ప్రాచ్య ప్రపంచమే యెక్కువ ప్రాధాన్యతను వహింపగల దని, ప్రపంచ శాంతిస్థాపనకు గాని, సంగ్రామ నివారణకు గాని, ఆసియాఖండమే ప్రముఖపాత్రను నిర్వహింపవలసి యుండు నని స్పష్టమగుచున్నది. ఐక్యరాజ్యసమితి కార్యదర్శి ట్రిగ్వేలీ లేక్‌సక్సెస్‌లో ప్రసంగించుచు వివరించినట్లు యావత్ప్రపంచము ప్రాక్-పశ్చిమ సంఘర్షణలో పూర్తిగ నిమగ్నమై యున్నందున, ఇతర ప్రాంతములందు జరుగుచున్న సంఘటనల ప్రాముఖ్యము గుర్తింపబడుట లేదు. సంగ్రామకారకులు యూరపుఖండమునందే యున్నను, సంగ్రామ రంగముమాత్ర మీ పర్యాయము పూర్వార్ధగోళమునకు మారుననుట నిస్సందేహము.

రష్యా పశ్చిమ ప్రపంచముపై గాక, తన కమ్యూనిస్టు వ్యవస్థ స్థాపనకు, ప్రాచ్యదేశముల పైననే ఆధారపడియున్నది. చైనాయందలి కమ్యూనిస్టు ప్రభుత్వమునకును మాస్కో అధికారులకును అభిప్రాయభేదము లున్నవని, ఇటీవల ప్రచారమైన వార్తలు పూర్తిగ యథార్థము లని విశ్వసింపరాదు. బ్రిటన్, అమెరికా ప్రభుత్వముల విధానము, పెట్టుబడిదారుల వైఖరి విస్పష్టమైన గాని మావోసేటుంగ్ ప్రభుత్వ మీ విషయమున ఒక నిర్ణయమునకు రాదు. కమ్యూనిస్టు చైనాను బ్రిటన్, అమెరికా ప్రభుత్వములు గుర్తించుటవలన ఈ సమస్య పరిష్కారము గాదు. పశ్చిమ చైనా రాష్ట్రములను కమ్యూనిస్టులనుండి దక్కించుకొని, జాతీయ ప్రభుత్వమును స్థిరపరచుకొనుటకు జరుగుచున్న ప్రయత్నములకు అమెరికాసహాయము లేకపోయినను, అట్టి ప్రయత్నముల యెడ అమెరికా అధికారుల సానుభూతి కలదని చైనా తాత్కాలిక అధ్యక్షుని ప్రతినిధి డాక్టర్ కాన్ ఇటీవల వెల్లడించియుండెను.

చైనా కమ్యూనిస్టులకు ఈ వైఖరి సంతృప్తికరముగ నుండజాలదు. చైనాలో ఏక ప్రభుత్వమునే గుర్తింపవలెనని, అట్టి ప్రభుత్వము తమదే నని కమ్యూనిస్టులు పట్టుబట్టవచ్చును. అగ్ర రాజ్య పంచకములో కమ్యూనిస్టు చైనా అయిదవరాజ్యమని అంగీకరింపవలసినదిగ వీరు కోరవచ్చును. ఇందుకు అమెరికా, బ్రిటన్‌లు అంగీకరించునని చెప్పుటకు వీలులేదు. బ్రిటన్ హాంగ్‌కాంగ్‌ను రక్షించుకొనుటకే నిశ్చయించుకొనెను. హాంగ్‌కాంగ్ పై కమ్యూనిస్టులు వెంటనే దాడి ప్రారంభింపక పోయినను, యీ బ్రిటిష్ వలసను వారు గుర్తింపజాలరు. అదను చూచుకొని, దేశమున తమ అధికారమును స్థిరపర్చుకొని, ప్రతికూల శక్తులను పూర్తిగ నిర్మూలించి, యావత్తు చైనాపైనను తమ ఆధిపత్యమును నెలకొల్పుకొనిన అనంతరము కమ్యూనిస్టు ప్రభుత్వము హాంగ్‌కాంగ్‌పై తమ అధికారమును విసర్జింపవలెనని బ్రిటన్‌కు శ్రీముఖమును పంపవచ్చును.

వీటినన్నింటిని గమనించిన బెర్లిన్ ప్రతిష్టంభన, జర్మనీసమస్య యుద్ధమునకు దారితీయునవిగ కన్పించినను, అసలు సంఘర్షణ ఈ ప్రాంతమునందే ప్రారంభము కాగలదనుట నిర్వివాదము. కనుకనే ప్రాచ్యఖండమునందలి ప్రజాస్వామిక రాజ్యములన్నియు సంఘటితమై రానున్న సంఘర్షణను యెదుర్కొనుటకు సిద్ధము కావలసియున్నది. ప్రాచ్యదేశము లందలి ప్రజాస్వామికము లన్నియు, క్రొత్తగ ఏర్పడి, తమ స్వాతంత్ర్యమును నిలుపుకొనుటకవసరమైన చర్యలలో నిమగ్నమై యున్నవి. ఇతర దేశముల సహాయ సహకారము లున్న గాని ఈ దేశములు బలపడి బాహ్యశత్రువుల నెదుర్కొనగల శక్తిని పొందజాలవు.

బ్రిటన్ సంకల్పించినను, అట్టి సహాయమును చేయగల స్థితి, సామర్థ్యము ప్రస్తుత మా దేశమునకు లేదు. అమెరికా యిప్పటికిని యూరపుఖండముపైననే ఎక్కువ ఆశలు పెట్టుకొనియున్నది. వెనుకబడిన దేశములకు సహాయము చేయు విషయమై అమెరికా అధ్యక్షుడు గత వారము వెల్లడించిన యభిప్రాయములు వారి పూర్వ ప్రకటనలకు భిన్నముగ లేవు. వెంటనే అమెరికా తన వైఖరిని మార్చుకొని ఆసియాయందలి వెనుకపడిన రాజ్యములకు ఎక్కువ సహాయము చేయ నుద్యమించినను, ఇంతలో ఫలితము లేవియు కన్పింపవు. ప్రజాస్వామిక విధానమును, స్వాతంత్ర్యమును రక్షించుకొనవలసిన బాధ్యత పూర్తిగ ఆసియా రాజ్యములపైననే గలదు. ఈ బాధ్యతా నిర్వహణమున కామన్వెల్తు ఆసియా రాజ్యములకు కొంతవరకు తోడ్పడగలదు. అమెరికా ప్రభుత్వముకూడ తన దృష్టిని యూరపునుండి ప్రాచ్య దేశముల వైపు మరల్చవలసి యుండును. ఈ సంవత్సరాంతమున భారత ప్రధాన మంత్రి పండిట్ నెహ్రూ అమెరికా అధ్యక్షునితో సంప్రతింపులు జరుపనున్నారు. ఆ సంప్రతింపుల ఫలితముగ అమెరికా ప్రాచ్య ప్రపంచ ప్రాధాన్యతను గుర్తింపగలదని ఆశింపవచ్చును.

చైనా

షాంఘై పతనముతో, చైనా అంతర్యుద్ధమునందు ప్రధానాధ్యాయము ముగిసినది. అందువల్లనే పశ్చిమరాజ్యములు కమ్యూనిస్టు చైనాను గుర్తించుట గూర్చి ఆలోచించుట ప్రారంభించిరి.

కాని చైనా పూర్తిగ కమ్యూనిస్టు స్వాధీనమగువరకు, వారి వైఖరి సందిగ్ధముగనే యుండునని బోధపడుచున్నది. జాతీయప్రభుత్వము ఇంకనూ నిలబడి పోరాటము సాగించగలదని పశ్చిమ రాజ్యములకు ఆశయున్నట్లు వ్యక్తమగుచున్నది. చైనా అధ్యక్షుని ప్రతినిధి అమెరికా విదేశశాఖ తాత్కాలిక కార్యదర్శి జేమ్సు వెబ్బుకు పశ్చిమ రాష్ట్రముల సంరక్షణ విషయమై ఒక పథకమును సమర్పించినట్లును, ఈ విషయమునుగురించి, అధ్యక్షుడు ట్రూమన్‌నుకూడ చూడబోవుచున్నట్లు వార్త వచ్చినది.

జాతీయప్రభుత్వమునకు సహాయము చేయుటవల్ల ప్రయోజన ముండునని అమెరికాగాని, తదితర పశ్చిమ రాజ్యములుగాని నమ్మునను నది అనుమానము. అమెరికా ప్రస్తుతము యూరపునందే ఎక్కువ ఉత్సాహము చూపుచున్నది. ఇతర ప్రాంతములందు పూర్వానుభవమునుబట్టి పశ్చిమ రాష్ట్రములందు చైనా జాతీయ ప్రభుత్వము నిలబడగల దని నమ్మకము ఒకపట్టున చిక్కదు. ప్రతి అంగుళము కొరకు పోరాడుదు మని చైనా ప్రధాని కొద్దిరోజుల క్రితము ప్రకటించి యుండెను. ఏరీవిధమైన ప్రకటనలు చేయుచుండగనే దక్షిణ చైనాలో జాతీయప్రభుత్వము కాంటన్‌ను ఖాళీ చేయుచున్నట్లు వార్త వచ్చినది. కాంటనునుండే ప్రథమమున చాంగైషేక్ తన విజయయాత్ర ప్రారంభించెను. ఈ సంఘటన చైనాప్రభుత్వ శక్తి యెడ ఎక్కువ ఉత్సాహము కలిగించు ననునది అనుమానాస్పదము.

కమ్యూనిస్టు చైనా యెడ ఇతర దేశములతోపాటు భారతదేశము తన వైఖరిని నిర్ణయించుకొనవలసి యున్నది. నాంకింగ్ కమ్యూనిస్టుల వశమైనపుడు కమ్యూనిస్టు ప్రాంతములందు వారి ప్రభుత్వమును భారత ప్రభుత్వము గుర్తించునని వార్త రాగా అది అసత్యమని తెలియజేయబడెను. బహుశః భారత ప్రభుత్వముకూడ ఇంకను స్థితిని చూడవలెనని భావించుచుండవచ్చును. కాని కొద్దికాలములో ఏదో ఒక నిర్ణయమునకు రావలసి యున్నది. భారతదేశము స్వతంత్రము కాకమునుపు ఆసియా స్వాతంత్ర్యోద్యమమునకు చైనా చిహ్నముగను ప్రోత్సాహశక్తిగను నుండెడిది. ఇపుడా స్థానము భారతదేశమునకు ప్రాప్తించినది. అంతర్జాతీయ సంస్థలందు, ముఖ్యముగా భద్రతా మండలి యందు ప్రస్తుతము చైనా ప్రభుత్వము వ్యవహరించుట అసందర్భముగా నుండక మానదు. ఆగ్నేయాసియా దేశములకు భద్రతా మండలిలో ప్రాతినిధ్యము లేదని, అందువల్ల భారతదేశమునకు స్థాన ముండవలెనని, వెనుక వాదింపబడెను. అగ్రరాజ్యముల ఎత్తులను గమనించి, భారతదేశము గత పర్యాయము పోటీ చేయ నిశ్చయించియూ విరమించెను. ఇపుడు చైనా ప్రస్తుత స్థితిని గమనించి ఆ స్థానమును భారతదేశమునకు రావలెనని కోరుటలో అసందర్భము, అన్యాయము నేమాత్రమూ లేదు.

నవల :

నాకబలి

వి.డి. ప్రసాదరావు

1

రాఘవరావుకు నిద్ర మెలుకువవచ్చింది. అసలు నిద్రపోయాననే అతననుకోలేదు. కన్ను తెరిచాడు. తన ప్రక్కనే తన చేతిదండమీద తల ఆన్చుకుని ఆమె కన్ను రెప్పార్చకుండా తనను చూస్తూంది. స్వప్నస్థితి ఏమో అన్న భ్రమ క్షణికంగా కల్గింది. ఆమె మొగంలో చిరునవ్వు వికసించుకొని సంతోషం ప్రకటిస్తూన్న నవ్వుగా పగలబడింది. "కలలో ఉన్నావా!" అంటూ మొగమంతా స్పృశిస్తూ, కైదండ కృంతాన్న కీలించింది.

స్వప్నమన్న భ్రమకు మూలాధారంగా ఉన్న జాగృతి పొడచూపబోయి తల ఎత్తలేక అల్లే అణిగిపోయింది. ఆమెకంఠసీమనున్న అతని చేయి పొంగి చెక్కిలిని చెక్కిలికి అదిమించింది. మళ్లీ కాలజ్ఞాన మట్టే స్తంభించిపోయింది

* * *

వక్షస్థలం మీదికి పైట చెరగు లాగుకొంటూ, ఆ చేతిలోనే చెరగుతో అతని మొగమంతా తుడుస్తూంది. ఆమె ముంగురులు అతని మొగమ్మీద గంతులేస్తున్నాయి. చిరునవ్వుతో ముదురు ముద్దు పెట్టుకొంటూ—

"పాపం, అలిసిపోయావ్ గదూ!" అంటూ వెన్ను చెరగున తుడుస్తూన్నట్లు నిమురుతూంది.

మాటలో మార్దవం ఉంది ఆప్యాయత ఉంది. అన్నీ ఉన్నాయి. కాని మాట వినబడటమే ఆ రసస్థితికి భంగకరమయింది. తల అరవిడిచిన ఆమెకేశపాశం ఒకటి తన పెదవులలో చిక్కుకొని చీరుచీదరింపు కల్గించింది. కొద్దిగా తప్పించుకొంటూ సీత్కారంతో పెదవులను కేశవిముక్తం చేసుకొన్నాడు.

నాటకరంగంలో స్త్రీపాత్రధారిని చూసి చక్కొన్నట్టుగా కోపపు కెక్కు మొగం పెడుతూ, చిరునవ్వు చిందించుకొంటూనే—

"ఏం అప్పుడే అసహ్యమేస్తున్నానా!" అంది.

ఆ ప్రశ్నార్థకం, అభంగిమకూకూడా, ఔచిత్య హీనంగానే కనబడ్డాయి. కాని మనస్సు జాగ్రత్తే అందుకొంది.

"ఈ జన్మకులేదు" అంటూ ఆ కేశసౌందర్యాన్నంతా చుంబిస్తున్న మిషతో సన్నగా పట్టు సడలించుకొంటూ కూర్చోబోయాడు.

"టైమెంతయింది?"

"ఇప్పుడు జ్ఞాపకం వచ్చిందా అబ్బాయిగారికి? ఇదేనా యేమిటి కాలేజికి వెళ్లటం?" పకపక నవ్వుతూంది.

"ఇంత నిర్భయంగా గట్టిగా నవ్వుతుందేం? పైకి ఎవరికన్నా వినబడితే?" పైకి చిరునవ్వు నవ్వాడు. "అవును, యిదే కాలేజీ. నువ్వే గురువు. రెండుగంట లయిందా?"

"మూడు దాటతోంది—" సన్నగా నవ్వుతూంది. అన్నిటికీ నవ్వే ఆమెలో సంతోషం తనువంతటా తెరలుతెరలుగా ఉబుకుతూనే ఉంది. అతనిలో ఆ తరగల చీలికవలికలుకూడా అంతరించాయి. అక్కడినుంచి బయటపడాలని ఆత్రం ప్రారంభమవుతూంది.

ఆమె లేచి జుట్టు ముడివేసుకొంటూంది.

"ఐదునిమిషాల్లో కాఫీ చేసి తెస్తాను, కాస్త ఆగు."

"వద్దుప్రభా! చాల ఆలస్య మయిపోయింది. సాయంత్రం అవుతూంది-నే నిక్కడుండగానే.."

మాట పూర్తికాలేదు. ఆమె పూర్తికానీయలేదు. ఇందాకటి నవ్వే!— నిజసంస్కృతి

2

మరీచీ కుహనాసంస్కృతిని వెన్నాడిన ఆ యిందాకటి భగిందమమే.

"ఇంత త్వరగా ఇంటికి రారులే".

మనసులో హఠాత్తుగా గొంగళిపురుగు పాకినట్టయి వెన్ను జలదరించింది. చీదరింపు మొగంలోకి రానీకుండానే, ఆమె అంటే ఉన్న ఆకర్షణబలంతో మనస్సులో గొంగళిపురుగును దులిపేసుకొన్నాడు

"ఉండేం! ఇప్పుడే వచ్చేస్తా." కూర్చున్న అతన్ని భుజాలుపట్టుకొని వెనకకు వ్రాలదోస్తూ, చిరునవ్వును చిరుపాటగా మార్చుకొంటూ, చిందుగా గది దాటి వెళ్లింది.

* *

సన్నగా పాట వినబడుతూంది.

ఆలోచిస్తూ అల్లాగే పడుకొన్నాడు.

వీధితలుపు బాదిన చప్పుడయింది.

అదాటుగా లేచాడు. కాళ్లు వణికిపోతున్నాయి. ఒళ్లు తెలియకుండానే వంటింట్లోకి వెళ్లా వచ్చి పడ్డాడో, అతనికి తెలియదు

ఆమెబిత్తరపోయి కాళ్లు వణుకుతూ, చేతిలో డబ్బాచేతిలోనే వణికిపోతూ నిలబడింది.

ఆ డబ్బా క్రిందపడి చప్పుడౌతుందేమో! ఏ చప్పుడౌతుందన్నా ఒళ్లు కంపమెత్తిపోతోంది. ఆమెమొగంలో నెత్తురుచుక్క లేదు. తనకు ధైర్యం ఈయగలస్థితిలో లేదు

దగ్గరకు వెళ్లి ఆమె చేతిలో డబ్బా నెమ్మదిగా వణుకుతున్న చేతులతోనే క్రిందపెట్టాడు. ఆమె భయంతో అతన్ని కౌగిలించుకొని వణికిపోతోంది. ఆ నిస్సహాయస్థితికి, తన నింత నిస్సహాయస్థితిలోకి తెచ్చినందుకు ఆమెమీద కోపం ప్రజ్వలిస్తూంది చెవిలో పెదవులు పెట్టి "ఎవరో చూచి, రా" అన్నాడు. వణుకుతూన్న పెదవుల్లోంచి బలవంతంగా బైటపడవలసివచ్చేటప్పటికిరహస్యం మాటకూడా కరుకుగానే వస్తోంది.

నుంగుగా ఆమె స్థాయిచిక్కించుకుంది–"చేతితో చూపెట్టా. వెనకస్నానాలగదిలో నిలు"అని, ఆమెముందుకు వెళ్లి, "ఎవరూ!" అంటూ మేడమెట్లుదిగుతుంది

స్నానాలగది తలుపుగడియకూడా సరిగ్గా లేదు. భయంతో చీకాకు ఎక్కువవుతూంది చుట్టూ చూశాడు. అంతకరకూ పరిసరాలన్నీ పరిచూసుకొని తన బుద్ధిహీనతకు తన్ను తిట్టుకొన్నాడు.

పిట్టగోడ నానుకొని ప్రక్కయింటి ఇంటి కప్పు వెనుకభాగా లున్నాయి. ఆతలి మేడగోడకు ఇటు కిటికీలు లేవు. నిలుపుగోడ అడ్డుగా నిలిచినట్లుంది. ఇళ్లకప్పులు రహస్యానికి రక్షగానే ఉన్నాయి. ఇళ్ల కప్పుమీదికి చెట్టుకొమ్మ వ్రాలుతోంది. ఆ చెట్టుమొదలు నాలుగు గోడల మధ్య విడిగా ఉన్న దొడ్లోకి ఉంది. ఆ దొడ్డి గోడకుప్రక్కనే సన్నగల్లీ.

దొడ్డి గోడలమధ్యగల్లీ అవటంవల్ల సంచారం ఉన్నట్టు లేదు. కాని పట్టపగలు పట్టు దిగివస్తూంటే ఎవరూ చూడనంత అదృష్టం ఉంటుందా? మేడపిట్టగోడదిగి గోడదరునే పెంకుటికప్పు చాగుకొని ఇరుక్కొని కూర్చున్నాడు. ఇంతటి దుస్థితి గల్గించినందుకు ఆమెనే తిట్టుకొంటున్నాడు. తను వెళ్లొన్నప్పుడు వెళ్లనిస్తే ఈ దౌర్భాగ్యం పట్టకపోయేది. గదిలో తన వస్తువు లేమైనా ఉన్నాయో తోచటం లేదు. ముందు ఇంకేం ఆపద ఉందో-మనస్సు ఎన్ని కీడులను ఆలోచించగలదో అన్ని కీడులను కళ్లముందర కట్టిస్తూంది. ఇన్నిమాట్లుగా తనను అణగద్రొక్కినందుకు అంతరాత్మ పగదీర్చుకొంటూన్నట్లుంది.

ఇంత కృష్టనూ, హాస్యాస్పదమూ, అపాయకరమూ అయిన పరిస్థితిలోకి తను ఎల్లా వచ్చాడు! తన చేజేత చేసుకొన్నదేనా? ఆమె ఎవరో తను ఎరగడే!

మొదటిసారి ఈ ఊరువస్తూంటే రైలులో చూసిన కుటుంబీకురాలిని ఆనాడే మర్చిపోయాడు. ఆనాడు ఏ ఆకర్షణా లేని రూపమే ఈనాడు తనకీ స్థితిని తెచ్చిందా! మళ్లీ ఈ వ్యక్తి తన జీవితంలోకి తన ప్రయత్నం మీదే వచ్చిందా? ఈమె ఆమేనన్న స్పృహైతనకు ఉండేదికాదు. ఆమెఅంతట ఆమే గుర్తించుకొని బయలుపెట్టింది. ప్రోత్సాహం ప్రోద్బలమూ అంతా ఆమెదే అనుకొనేందుకు ఇప్పుడు అంతకన్నా నిదర్శనం ఏం కావాలి?

దశాశ్వమేధస్నానఘట్టంలో, నూతనవ్యక్తిని చూసినప్పుడు, అసంస్కృతాలు అనుభవహీనాలూ అయిన తన కోర్కెలే తనను ప్రోత్సహించాయి.

ఆనాడామె, అనురక్తగాగాని అభిముఖగాగాని ఎంతమాత్రం కన్పడలేదు. అంతా తన ప్రోత్సాహమే, తనప్రోద్బలమే అనుకొన్నాడిప్పుడు. ఆ నిరాదరణ అంతా దీపం మిడుతను ఆకర్షించుకొనే విధానంలోని ప్రకరణమేనా!

విశ్వేశ్వరాలయంలో తన దృష్టి విశ్వేశ్వరుడిమీద లేదు. స్త్రీపుం విభేదం లేని ఆ జనసమ్మర్దంలో, పైకి ఎరుగనట్లు కనిపిస్తూనే ఆమెపక్కకి చొచ్చుకొని వెళ్లాడు, ఆ సమ్మర్దంలో తన స్పర్శ తగిలిన ఎరుకకూడా ఆమె బయలుపెట్టలేదు.

ఆ తిరువాత తను వెంటాడి సాధించినదంతా తన ప్రజ్ఞగానే అనుకొన్నాడు. ఆమె ఏనాడూ గోరంతైనా తనకు ప్రోత్సాహమిచ్చినట్లే తెలిసేది కాదు యాదృచ్ఛికంగా కలిసివచ్చిన అనేకవిశేషాలను, తను నిర్మాణాత్మకంగా ఆలోచించి అనుసంధించుకొన్న ప్రజ్ఞాఘట్టాలే అని పొంగిపోయాడు.

ఇప్పుడవన్నీ అస్తవ్యస్తంగా కనబడుతున్నాయి. ఆమె బలవంతంగా తనను ముక్కుకుతాడేసి లాక్కువచ్చినట్లనుకున్నాడు. విధి ఆమెకు తోడయినట్లయింది. ఇద్దరూ కలిసి తనను అమాయికపు యజ్ఞపశువుగా చేశారు. ఆమెమీద తనకు కోర్కె ఏమిటి, తనకన్నా ఎంత? పెద్దది. అదీకాక పరానుభవరూపేత. ఛీ, ఛీ, తను ఈస్థితిలో ఎందుకు పడ్డాడు. ఈ ఘట్టంలోనుంచి బయలుపడగల్గితే?. మళ్ళీ వణుకుతున్నాడు. కాశీవచ్చినప్పటినుంచి చాలా తెలిసికొన్నాననుకొన్నాడు. మనస్సు, బుద్ధి, జ్ఞానము, గరువతనముపోకడ, ఆరిందాతనము అన్నీవచ్చేశాయి అనుకొన్నాడు. విశ్వవిద్యాలయ విద్యార్థిత్వము, మూఢం అనుకొన్న సర్వభావాలను వదల్చేసింది అనుకున్నాడు అధునాతనుడనయానను కొన్నాడు. ఆశ్లేయం లేదు పౌరుషేయంలేదు—ఆస్తిక్యం లేదు-నీతి, ధర్మాలు, కేవలం జీవితసౌలభ్యానికి అనుసరింపవలసిన ఐచ్ఛికసూత్రాలు. వాట్లవల్ల ఔవరి, జీవితాన్ని సంకుచితంచేసుకొని కుళ్లి కుళ్లి ఏడవకూడదు. ఈ భావన అంతా జ్ఞానబద్ధంగా తనలోజీర్ణించిపోయిందనుకొన్నాడు.

ఇల్లు గడపదాటిన మొదలుగా "జీవిత వ్యవహారమూ", "జీవిత విధానమూ" అంతా అనుభవైక్యం అయిపోయిందనుకొన్నాడు. తోటి విద్యార్థులతో వాదాల కుపయోగించిన జ్ఞానము-తనలో జీర్ణించిపోయిందనుకొన్న జ్ఞానము, తామరాకును నీటిబొట్టు తడిపినంతమాత్రంకూడా తనను తడపలేదు. విద్యార్థులమధ్య నిత్యకృత్యంగా గడిచే జీవితపరిధిని దాటిన ఏ స్వల్ప సంఘర్షణాలలోనూకూడా, తనలో అలవడ్డా యనుకొన్న ఈగుణా లేవీ కూడా వెలికి రాక, కాలు సేయడక మనస్సు పని చేయక, అయోమయంలో విడిచిపెట్టినట్టు చేస్తున్నాయి. రక్తంలో సంస్కారజన్యంగా ఉన్న తెలివి ఏదో అదే పైకి తల ఎత్తి, ఈనూతన విజ్ఞానాన్నంతను తిరస్కృతితో తోసివేసి, మళ్లీ ఆఘట్టంలో తనను నడిపించబోయేది.

కాని ఆఘట్టం కాస్తా గడిచాక, మళ్ళీ ఆ సంస్కారమతనలో ఉన్నందుకే సిగ్గుపడి, విశ్వాసహీనంగా దాన్ని అణచివేసి, నవ్యవాదాల ఆసరాతో ముందుకు చూచేవాడు. కోర్కెలతో సుఖంగా జీవించగలిగేందుకు, ఈ నూతనత్వమే, రాచబాట అనిపించేది. బాట సమంగా గడుస్తూన్నంత సేపూ, సాహసమూ, ప్రజ్ఞ, బాధ్యత్వమూ, ఔత్సుక్యమూ, ఆత్మగౌరవమూ, అన్నీ తన సొత్తే ననిపించేవి. కాలను ఏమాత్రం ఎదురుతిరిగినా, ఆ బాట మాయాబజారులాగ అంతర్థానమయేది. క్లిష్టస్థితిలో ఇవమిత్థమని నిర్ణయించుకోవలసి వచ్చేటప్పటికి తనలో జీర్ణించా యనుకొన్న ఆ నూతన విశేషాలన్నీ ఏమయ్యాయో కలికంలోకి కానరాకుండా పోయేవి. ఒక్క పశ్చాత్తాపమూ, ఆవేదనా మాత్రమే మిగిలేవి, అంతవరకూ తన మనస్సు ఒప్పుకోని, విధి, కర్మ, అన్నీకూడా, తన్ని దుస్థితికి తెచ్చినందుకు దోషులే అనిపించేవి. వాట్ల 'ఆస్తిక్యం' అప్పుడు బయలుపడేది.

ముచ్చెమటలతో ఒళ్లు ముద్దై పోతున్నది.

మందహాసపూరిత కంఠస్వనం "రాఘవా" అని సన్నగా పిలుస్తూంది.

చెమట తుడుచుకొంటూ, మోకాళ్లపై లేచి పిట్టగోడమీదికి తల ఎత్తిచూశాడు. ఆమె వెదుకుతూన్నట్టు స్నానాలగదిచుట్టూ చూస్తూంది. పలుపులోనే ఒక్కతే ఉందని తెలిసిన తెలివి దృష్టితో దృఢమయింది. అపాయమే ఏమీ లేక తప్పిపోయేటప్పటికి, గుండె దిటవు పడుతూంది.

కదలికకు ఆమె అటు చూసింది. ఆ పాలిపోయిన మొగమూ, ఆభీతస్థితిలో అతని మొగం చూచేటప్పటికి ఆమెకు పగలబడి నవ్వు వచ్చింది. ఒకచేతితో మూసుకొంటూ ఒకచేత్తో పొట్ట పుచ్చుకొని పగలబడి నవ్వుతూంది. అనుకొన్న అపాయ మేదీ కనపడక నెనుదిరిగి పోయేటప్పటికి, అపాయం పొడసూపిందన్న స్పృహే ఆమెలో

(21 వ పేజీ చూడుడు)

విషయ సూచిక

ముఖచిత్రం "వీథిలో ఒక ప్రక్క"

	పుట
నాకబలి (నవల)	5
కమ్యూనిస్టుచైనా రష్యావిరోధి!	6
ఈస్టిండి యాకంపెనీ చెలామణీలోకి తెచ్చిన నాణెములు	7
ఈజిప్టులో బ్రిటిష్‌వారి ప్రవేశం	8
విశాలాంధ్రనిర్మాణములో పత్రికారచయితల బాధ్యత	9
శ్రీ కాళహస్తి మాహాత్మ్యము కొన్ని విశేషములు	10
రహస్యం (కథానిక)	11
బాలానందం	12
సంగీతము	15
సినిమా	16
మన పౌరాణిక దృక్పథం-నాడు-నేడు	18
సాళువ గోవిందరాయలు	19

కమ్యూనిస్టుచైనా - రష్యావిరోధి!

శ్రీ నందివాడ కృష్ణమూర్తి

షాంగ్‌హైపతనముతో జాతీయప్రభుత్వము చైనాలో చాలా భాగాన్ని పోగొట్టుకుంది. షాంగ్‌హైనుండి కాంటన్‌కు రాజధాని మార్చబడింది. ఇంక ఒకటి రెండు యుద్ధములతో 17 సంవత్సరములనుండి జరుగుచున్న అంతర్యుద్ధము ఒకవిధముగా సమాప్తి నొందవచ్చు. కాంటన్‌నగరము కొఱకును, వాణిజ్యరేవుపట్టణమైన హాంకాంగ్ కొఱకును తీవ్రమైన యుద్ధములు జరుగగలవు. హాంకాంగ్ రక్షణార్థమై బ్రిటిష్‌వారుగూడ సన్నాహాలు చేస్తూన్నప్పటికీ కోటానకోట్ల ప్రజల సానుభూతితో ముందుకు త్రోసికొని వచ్చుచున్న కమ్యూనిస్టుసైన్యాలకే విజయము రాక మానదు. హాంకాంగ్ కూడ పతనము పొందక తప్పదు. ఆ నగరము స్వాధీనమైనచో చైనాలో కమ్యూనిస్టుప్రభుత్వ మేర్పడగలదు. అంటే ప్రాచ్యదేశాలలో రష్యా ప్రాబల్యానికి ఇంకొక దేశముగూడ దోహద మిచ్చిం దన్నమాట. అయితే వినూతనచైనాకు రష్యా కెంత అభిమాన మున్న దన్న విషయ మాలోచించవలసి ఉంటుంది.

అంతర్యుద్ధము ప్రారంభమైన నాటనుండి చైనాకమ్యూనిస్టులకు రష్యా అంటే పక్షపాత మని చాలామంది అభిప్రాయము. డా॥ సన్‌యట్‌సేన్ (Dr. Sunyet San) ఆశయాలే చైనా కమ్యూనిస్టుల కావేశాన్ని కలిగించాయి. ఆయన ఆదేశాల్ని అమలుపరచడానికే వారీ యుద్ధాన్ని సాధించారు. అటువంటివారు నేడు సన్‌యట్‌సేన్ అభిప్రాయాలకు వ్యతిరేకంగా 17 సం॥ కష్టించి సాధించిన సంపూర్ణస్వాతంత్ర్యము ఒడ్డిపోయి, జాతీయప్రభుత్వమునకు కీలుబొమ్మయై యుండుటకుబదులు రష్యాబానిసలగుట కొప్పుకుందు రనట సందేహాస్పదము.

చైనాలో విజయము పొందినవారు కమ్యూనిస్టులైన వారుకూడా జాతీయవాదులే. వారికి ముందు కావలసినది జాతీయపునరుద్ధరణ, జాతీయాభ్యుదయము. అందుకొరకై వా రెన్ని కష్టములైనా ఓర్వగలరు.

ఈ విషయములే ప్రఖ్యాత అమెరికారచయిత ఎడ్గార్ స్నో (Edgar Snow) ఉద్ఘాటించియుండెను. అమెరికావాసుడైనను, ఈయన చైనాపరిస్థితుల నవగాహనచేసికొనిన ట్లితరఅమెరికను లెవరును చేసికొనియుండలేదు. నూతన చైనా రష్యాప్రాబల్యములోనికి రాజాల దనియు, ఆ కూటమికి చెందజాల దనియు వీరి అభిప్రాయము.

న్యూయార్కు, సాటర్‌డే, ఈవినింగ్ పోస్టు పత్రికలలో ఆయన ఈ క్రిందివిధముగా ఒక వ్యాసము వ్రాసియుండెను.

చైనాలో కమ్యూనిస్టుప్రభుత్వ మేర్పడిన దంటే, చైనా క్రెమ్లిన్ ప్రాబల్యానికి లొంగిపోయినట్లేనా? అయితే ఇంతటితో చైనా పోలీసుదళాలలోను రాజ్యదక్షతలోను మాస్కో గూఢచారులు తూర్పుయూరపులోలాగ అంతః ప్రభుత్వ మేర్పరచగలదా? రష్యా, ఆర్థికసహాయాలకి లొంగిపోయి వారి పరిశ్రమలును, గనులును, చైనావారు ఒడ్డిపోవలసినదేనా? దేశీయపరిస్థితులలోను, రాజకీయాలలోను, చైనా రష్యావశం కావల్సిందేనా? అంతర్జాతీయసమితిలోగూడ నికపై చైనా రష్యాతరఫునే ఓటు చేయవలసియుండునా?

ఇవి నేటి ప్రశ్నలు. కొన్ని ప్రాంతముల వారి కెల్లప్పుడూ అవు ననే జవాబే స్ఫురించుతూ ఉంటుంది. కాని చైనావిషయములో మాత్రము తీవ్రమైన సందేహాలు కలుగుతున్నాయి. కమ్యూనిస్టులు తమ విజయముతో ఒక ప్రత్యేక చరిత్రను ప్రారంభం చేస్తారు. గతంలోని అనుభవాలద్వారా భవిష్యత్తులో మార్పులు తీసుకువస్తా రని అభిజ్ఞుల అభిప్రాయ మైయున్నది.

చైనా ఒక ప్రత్యేకపు సమస్య అని చెప్పినందులకు ఎడ్గార్ స్నోను ఆక్షేపించారు. అనేకకోట్ల కాని స్నో ఎప్పుడును చైనాకమ్యూనిస్టులు మార్క్స్ అనుచరులు కా రని చెప్పలేదు. కాని దేశపరిస్థితు లేమియు వారు రష్యాకు లొంగిపోగల రనిమాత్రము రుజువుచేసియుండలేదు. 12 సం॥ల అనుభవముకలన వీరికి స్ఫురించిన దొక్కటే. సంపూర్ణజాతీయవాదులయిన చైనా కమ్యూనిస్టులను రష్యా సంపూర్ణముగా లొంగదీసికొనజాల దని వీరి విశ్వాసము.

చైనాకమ్యూనిస్టుసంస్థకి స్టాలిన్ అంటే భయమే. ఇది క్రెమ్లిన్‌కు లొంగియున్న ఒక సనాతనసంస్థ. రష్యా తనంతట తానుగా కోమిన్‌టర్న్ (Comminturn) ను మూయించే టంతవరకు, వీరుకూడ ఆ సంస్థలోనే సభ్యులుగా నుండేవారు. తమ కొకప్పు డాదర్శప్రాయుడైన టిటోను మాస్కో కొరకు వీరుకూడ నిరసించారు.

రష్యనులవలెనే, చైనావారుకూడ పెట్టుబడిదారుల ప్రాబల్యము నాశనముచేయుట ఒక చరిత్రాత్మకఅవసరంగా నమ్మారు. వీరుకూడ ప్రపంచమంతటిలో సామ్యవాదము ప్రవేశపెట్టి తద్వారా కమ్యూనిజము తీసికొనిరావలె నని ఆశించారు. కాని ఇప్పుడు ప్రభుత్వముచేతిలోకి వచ్చినా వారు సామ్యవాదము లని కీటిని ఆచరణలో పెట్టుకొని మున్ముందుగా ఉత్పత్తిసాధనాలన్నిటిని జాతీయము చేయగలమని మాత్రము ఉద్ఘాటించుచున్నారు.

చైనాకమ్యూనిస్టులు రష్యాస్నేహితులుగా తెలియజేసికొంటున్నారు. రష్యా వారి కేవిధముగా సహాయము చేయకపోయినను వారికి కావలసినంత ఆదర్శసహాయము కలిగినది. ఆసియాలో అమెరికను ప్రాబల్యాన్ని తగ్గించడం విషయములో రష్యాతో వీరు సంపూర్ణముగా ఏకీభవించారు. కమ్యూనిస్టులపై యుద్ధానికి అమెరికా చాంగ్‌కైషేకున కనేకవిధములుగా సహాయపడినమాట నిజమే. కాని నేడు వారు కోరుచున్న అమెరికన్ బహిష్కారానికిది కారణము కాజాలదు. అమెరికనులు ఉదాసీనులుగా నున్నప్పటికి కూడ వారు అమెరికనుసైన్యాలను చైనాలోనుండి తరిమివేయడానికి, అరికప్రపంచములో అమెరికాకు తావు లేకుండా చేయడానికి బద్ధకంకణులై యున్నట్లు ఎన్నిమారులో వారి నాయకులు చెప్పుచుండిరి.

చైనాకమ్యూనిస్టులు ప్రజాద్వేషు లని, దేశస్వాతంత్ర్యమునకే వ్యతిరేకు లని కొందరి అభిప్రాయము. వారి అభిప్రాయములో నట్టి సంస్థ చేతిలోని ప్రభుత్వము రష్యాకు లొంగియుండక తప్పదట. అందుచేతనే జాతీయప్రభుత్వమునకు సహాయము చేయా లంటున్నారు.

కాని తమ ఆదర్శాలను నిలుపుకొనుటకు ప్రయత్నించినంతమాత్రమున ఏ సంస్థా తమ ఇరుగుపొరుగురాజ్యాలతోను వ్యతిరేకించ నవసరము లేదు. ఒక్కజాతియొక్క పురాతిన చరిత్రకన్నా ఒక సంస్థయొక్క ఆదర్శాలు ముఖ్యం కాగలవా? సనాతనుల అభిప్రాయముతో రాయభారి వెలింగ్‌టన్ కూ (Wellington Koo) అన్నట్లు వీరంతా క్రెమ్లిన్ బానిసలుగానే భావింపబడుట తథ్యము.

కాని ఇట్టి భయాలకు తగిన నిదర్శనం దొరకడంలేదు. ఇంతవరకు చాంగ్‌కైషేక్‌కుగాని, డా॥ వెల్లింగ్‌టన్ కూ (Wellington Koo)గాని చైనాకమ్యూనిస్టులను రష్యా ఎంతవరకు లొంగదీసికొందో రుజువు చేయలేక పోయింది. అమెరికన్ యుద్ధనిపుణులుగూడ చైనాకమ్యూనిస్టుల యుద్ధసామర్థ్యములో, రష్యన్ యుద్ధపద్ధతుల నేమియు కనకొనలేక పోయారు. అందుచే భవిష్యత్తుగూర్చి ఆలోచించేటప్పుడు కొన్ని ముఖ్యాంశా లవగాహన చేసికోవాలి.

అతిముఖ్యమైన కొన్ని విషయాలను ఆలోచించాలి. చైనా విస్తారమైన దేశము. అమెరికా సంయుక్తరాష్ట్రాలంత ఉంటుంది. రష్యాలోని జనాభాకి రెండు రెట్లు అధికమైన ప్రజాబాహుళ్యం కలిగి ఉంది. మానవ, సహజసంపత్తులతో తులతూగుతోంది. కనీసం 3000 సం॥ విలువైన చరిత్ర గల్గి ఉన్నది.

కోలనీ లన్నిటిలోను చైనాలోనే మున్ముందుగా కమ్యూనిస్టులు విజయంపొందారు. మొదటినుంచి చైనామార్క్సిస్టులు అంతర్జాతీయవాదులు కాని ఆ చరణలోమాత్రము వారు స్వతంత్రపంథా ననుసరించు జాతీయవాదులే. రెండవది, రష్యా తర్వాత, మార్క్సిస్టుసిద్ధాంతము లనుసరిస్తున్న రెండవ పెద్దదేశం చైనా. తూర్పుయూరపుతోను, రష్యాతోను పోల్చితే ఈ దేశపు జీవితప్రమాణములు చాల తక్కువ.

మూడవది: కమ్యూనిస్టుసైన్యాలు తమ జీవాలకోసమే పోరాడిన ముఖ్యమైన యుద్ధాలు రెండవ యుద్ధము ప్రారంభము కాకమునుపే జరిగిపోయాయి. యుగోస్లేవియాలాగ చైనాలోని కమ్యూనిస్టులు మాత్రము రష్యానుండి ఏవిధమగు ఆర్థిక, రాజకీయ, మిలిటరీసహాయములు లేకుండా స్వాతంత్ర్యాన్ని సంపాదించారు.

నాల్గవది చైనాకమ్యూనిస్టునాయకు డెప్పుడూ ఇతరులవలె రష్యాకు వెళ్లి యుండలేదు. కోమిన్‌టర్న్ (Commintern) ఎన్ని మారు లితనిని తమ పార్టీనుండి బహిష్కరించినను తమ ప్రాబల్యము నిల్పుకొనిన వా డితడొక్కడే. మావో 1921-28 లో స్వతంత్రపంథా నవలంబించాడు. పార్టీ అధికారము లేకుండా స్వతంత్ర వ్యవసాయపద్ధతుల నవలంబించాడు. టిటోతర్వాత రష్యా నింతగా నిరసించినవా డొక్క మావో మాత్రమే. 1511 సం క్రితము చైనా పోలిట్ బ్యూరో (Polit-buro) దక్షతకై పంపబడిన ఆఖరు రష్యన్ స్పెషలిస్టును అరెస్టు చేయించి పంపివేయుటలో ముఖ్యమగు పాత్ర వహించాడు. అతడిని పంపివేశాక రష్యా ఇంకొకరిని పంపుటకెట్టి ప్రయత్నము చేసి యుండలేదు.

స్వతంత్రపంథా లనుసరించి ఏకాకిత్వ మనుభవించిన చైనా ఆత్మవిశ్వాసాన్ని విస్తారమగు అనుభవాన్ని పొందగల్గింది. సంవత్సరాల తరబడి జరుగుచున్న అంతర్యుద్ధ మనేక రాజకీయ, యుద్ధనిపుణులను తయారు చేయగల్గింది. రష్యా తర్వాత చైనాలోని కమ్యూనిస్టుపార్టీయే పెద్దది. వీరి సంస్థలో 3,000,000 సభ్యులు—వీరి సైన్యానికి 2,00,000 సిపాయిలు. వీరుగాక సాయుధులైన వ్యవసాయదారుల సహాయముగూడ వీరికే లభ్యమైంది. చిన్న చిన్న యూరోపియన్ రాజ్యాలలో రష్యా తాండవ మాడుటలో సులభమే. కాని ఇంత పెద్దదేశమైన చైనాను లొంగదీసికోడం అంత సులభసాధ్యం కాదు.

చైనాకమ్యూనిస్టులలో నూటికి పదిమందికి కూడ రష్యాచదువు లబ్బలేదు. సామాన్యులలో వెయ్యిమందికి ఒక్కడుగూడ రష్యాకు వెళ్లి యుండడు. చైనాసంస్థల చరిత్రనుండే, చైనా తిరుగుబాటులనుండే, వారి ఆదర్శాలనుండే మార్క్సిసిద్ధాంతాల్ని తెలుసుకోగలిగారు. ఈ పార్టీనాయకు లందరు 50-60 సం॥ వయస్సువారగుటయే గాక వారిలో నందరికీ గూడ 20 సం॥ల అనుభవము లేకపోలేదు

నిజానికి మావోత్సేటంగ్ (MaoTze Tung) అతని అనుచరులే కోలనీలలో కమ్యూనిస్టు ప్రాబల్యంతోను, భూస్వామిత్వనాశనాన్ని కోరే సంఘసంస్కార ప్రచారాలతోను, ప్రభుత్వాధికారాన్ని సంపాదించడం సులభసాధ్య మని రుజువు చేయగలిగాడు.

నేడు సనాతనము కాని పద్ధతులు సి రవలంబిస్తున్నారు. దారిద్ర్యావస్థతో వెనుకబడి యున్న చైనావంటి దేశాలలో, నూతన పెట్టుబడిపద్ధతులు, నూతన ప్రజాస్వామ్యమూ, రెంటిని పెంపొందజేయవచ్చు నని వీరి ఆలోచన. సామ్యవాదముతో దేశములో కమ్యూనిజమును తెచ్చుటయే వీరి ఆశయ మయినను దేశములో నింకను వ్యక్తిగతంగా పెట్టుబడిదారు లుండక తప్ప దనియు, జాతీయవాదముకూడ తప్ప దని వీరి అభిప్రాయము.

1927 నుండి రష్యా, చైనా కమ్యూనిస్టుల విజయమును కోరియుండలేదు. 1936లో సియాన్ సంఘటన దీనికి నిదర్శనము. చాంగ్‌హూషేలియాంగ్‌కు (Chang Huseh Liang) చాంగ్‌కైషేకు పట్టుబడెను. రష్యావారు చాంగ్‌హూషేలియాంగ్, జపానుగూఢచా రని చైనాకమ్యూనిస్టులు దొంగగుంపు లని నిందిస్తూ చియాంగ్‌కైషేక్‌ను వారు వెంటనే విడుదల చేయా లని కోరిరి. చైనా జపాన్ యుద్ధము పూర్తిఅయేవరకు చైనాలో నైక్యత ఏర్పడవలెనంటే ఒక చియాంగ్‌కైషేక్‌వలనే సాధ్య మని రష్యా నమ్ముచుండెను. చియాంగ్‌కైషేట్ సైన్యానికి రష్యా అన్నివిధముల సహాయము చేసియుండెను.

పశ్చిమ పెట్టుబడిదారులను రష్యాగూడా చియాంగ్‌కైషేకు పతనము ఆశ్చర్యము కలుగచేసి యుండవచ్చును. రూజువెల్టు (Roosevelt) మంచూరియా స్టాలిన్‌పరం చేయా లన్నప్పుడు చియాంగ్ అనుమతించాడు. అప్పుడే రష్యా చైనాకమ్యూనిస్టులతో తెగతెంపులు చేసికొంది.

జర్మనీ ఓటమితో చియాంగ్‌కు రష్యాఅంటే భయం ఎక్కువైంది. కాని ప్రపంచ మనుకొనినదానికి వ్యతిరేకంగా రష్యా జాతీయప్రభుత్వానికే సహాయం చేసింది. జపాన్‌తో యుద్ధంకోసం రష్యా చైనాకమ్యూనిస్టుల కూడగట్టుకొనుటకు బదులు జాతీయప్రభుత్వంతోటే సన్నిహిత ఒడంబడిక యేర్పరచుకుంది. కాని ఈ ఒడంబడిక ఆచరణలోకి రాకపూర్వమే జపాన్ లొంగిపోయి యుద్ధం ముగియడం జరిగింది. రష్యా, అమెరికన్ సహాయాల నభ్యర్థిస్తున్న చియాంగ్‌ను, చైనాకమ్యూనిస్టులు దేశద్రోహిగను, ఫాసిస్టుగను ఎంచ ప్రారంభించారు. దీనితో చైనాకమ్యూనిస్టులయెడల టిటోపై చూపిన కాఠిన్యముకన్న ఎక్కుడు కాఠిన్యము చూపబడినది. కాని 1945 లో రష్యా విరోధము కోరడం మంచిది కాదనే మావో మాట్లాడకుండా తన పని కావించుకున్నాడు. అప్పటి రాజధాని చంగ్‌కింగ్‌లో కమ్యూనిస్టులకు జాతీయప్రభుత్వమునకు సంప్రతింపులు ప్రారంభమయాయి. కాని అదేసమయములో చియాంగ్ అమెరికా, రష్యాల సహాయముతో మంచూరియాను తను స్వాధీనము చేసికొన్నాడు. ముఖ్యపట్టణము లన్నీ వారి స్వాధీన మయాయి. సంధిపత్రాలవల్ల రూపుమాపడానికి చైనాకమ్యూనిస్టు లంత చేతకానివారు కారు. అందుచేతనే చియాంగ్ ముఖ్యనగరాలన్ని, రైల్వేస్థానాన్ని స్వాధీనము చేసుకుంటూంటే కమ్యూనిస్టుగూఢచారులు ఊర్లు పల్లెలు ప్రవేశించారు.

రష్యా కమ్యూనిస్టుల కెట్టి సహాయము చేసి యుండలేదు. వారి సామ్రాజ్యాభిలాషలకి చైనా కమ్యూనిస్టుల నడ్డంగా భావింపబడ్డారు.

తత్కారణంగా చైనాలో కమ్యూనిస్టుదిగ్విజయాన్ని మార్క్సిస్టు ప్రపంచంలోను అవతలగూడ అనేక సమస్యలకు దారి తీసింది. ఇకపై రష్యా ఇదివరకువలె గాక ఒక మహత్తరమైన విదేశంతో వ్యవహరించవలసి ఉంటుంది. ముఖ్యంగా ప్రభుత్వముగూడ కమ్యూనిస్టులదే యైనను వారు రష్యాకు విరోధు లగుట ఆశ్చర్యమయిన విషయం. సోవియట్ జాతీయవాదాలకి చైనాజాతీయతకు కావలసినన్ని స్పర్ధ లప్పుడే మంచూరియా, మంగోలియా చైనా టర్కీస్తాన్‌లో కనబడుతూ ఉన్నాయి. ఇప్పుడు కన్పడే దొక్కటే సమస్య. గతంలోని అనుభవాలను జ్ఞాపక ముంచుకుని చైనా రష్యాలు విరోధులుగానే మిగిలిపోతాయా? లేక రెండుదేశాలు ఆదర్శాలొకటే అవడంచేత గతాన్ని మరచిపోయి ఐక్యత సంపాదిస్తాయా?

చైనా నూతనపద్ధతులపై అభివృద్ధి పొందాలని వాంఛించే ఏ ప్రభుత్వమయినను మంచూరియాపై స్వాధీనము పొంది యుండాలి. జనబాహుళ్యత మంచూరియాలో 40,000,000 గలదు. చైనాలోని ఇనుపగనులలో 80 పాళ్లు, 37 వంతులు ఆడవిప్రాంతాలు, చాలాభాగం బొగ్గుగనులు. నీటిసరఫరా సదుపాయములు ఇందే గలవు. చైనా ఎగుమతివ్యాపారములో 40 వంతులు ఇక్కడే జరుగుతుంది.

1945 సంధిప్రకారము రష్యా మంచూరియాలో చాల ప్రాబల్యము సంపాదించింది. ట్రాన్సు మంచూరియా రైల్వేలో సగము అధికారాన్ని, గనులలోను, పరిశ్రమలలోను హోటళ్లలోన అధికారాన్ని రష్యా సంపాదించింది. పోర్టుఆర్థరు నౌకారేవులో సహాయాధికారాన్ని గూడ పొందగలిగింది. అందుచే నేటి మంచూరియా ప్రభుత్వము రష్యాకు లొంగియుండవలసి వచ్చింది.

కాని మంచూరియనులుగూడ చైనావారే. స్వాతంత్ర్యకాములే. రష్యాలోని సైబీరియా,

(22-వ పేజీ చూడుడు)

ఈస్టిండియాకంపెనీ చెలామణీలోకి తెచ్చిన నాణెములు

శ్రీ యద్దనపూడి వెంకటరత్నం

ఈస్టిండియాకంపెనీవారికి భారతావనియందు భూస్వామ్యహక్కులు సంక్రమింపక పూర్వమే అప్పటి మొగలాయీచక్రవర్తుల అనుమతిపొంది స్వంతంగా రూపాయినాణెములను ముద్రించుకొనుటకు ప్రారంభించారు. 1707 సంవత్సరములో బొంబాయి దుకాణంలో ముద్రించి వాటిని 'సూరతు'లని పిలువసాగారు. దరిమిలాను ప్లాసీయుద్ధముజరిగింది. సురాజుద్దౌలా సంధిజేసుకున్నారు. ఆసందర్భములో కలకత్తాలో నొకటంకసాలను నెలకొల్పి నాణెములను ముద్రించుకొనుటకు అనుమతి పొందారు. మెల్లిగా కలకత్తాలో రూపాయిల ముద్రణమునకు ప్రారంభించి, వాటిని 'సిక్కా'లన్నారు. క్రమక్రమముగా మద్రాసులోకూడా నొకదానిని స్థాపించి, మద్రాసులో ముద్రింపబడినవాటిని 'ఆర్కాటు' లనసాగారు. కాని నాణెము లెక్కడ ముద్రించినా వెండితోనే ముద్రింపబడేవి. అవి తూకంలో, ఆయాప్రాంతములందు ముద్రింపబడే వాటితో పోల్చిచూస్తే కొంచెం యించుమించుగా వుంటూ వచ్చేవి.

దరిమిలాను కంపెనీవారు, బెంగాలు బీహారు, ఒరిస్సాపరగణాలకు జాగీరుదార్లైనారు. 'దస్తు' శిస్తువసూళ్లకుసంబంధించిన 'దివానీ' అధికారము వీరికి సంక్రమించినది. వ్యవసాయదారులవల్ల వసూలయ్యే నాణెములలో పలురకాలుంటూ యుండేవి. తూకంలోగాని నాణ్యంలోగాని, ఒకదానితో మరియొకదానికి యెట్టి పోలికా వుండేదికాదు. వీటిని కంపెనీవారి రూపాయిలతో విలువకట్టుకొనుటలో తేడాలు కన్పెట్టలేక తబ్బిబ్బులవుతూ వచ్చారు. ఒక్కొక్కప్పుడు నష్టానికి గురిఅయ్యేవారు కూడాను. ఈసందర్భములోనే, తమ అధీనదేశమునందంతటా, ఒకే విధమగు నాణెమును చలామణీలో బెట్ట సంకల్పించి, ఇంగ్లాండులోని తమపై అధికార్లను అనుజ్ఞవేడుతూ విజ్ఞప్తుల నంపుకున్నారు. కొంతకాలమువరకు వారేమీ అనుమూ మినుమూ చెప్పలేదు. ఇంతలో టిప్పుసుల్తానుతో యుద్ధము తటస్థించినది. యుద్ధవ్యయ... నర్పించుకొనుటలో కూడా చాలా దెబ్బ... న్నారు.

1802 సంవత్సరమునాటికి కంపెనీవారికి బెంగాలు, బీహారు, ఒరిస్సాపరగణాలున్నూ, ఉత్తరసర్కారులున్నూ, నైజాము, మరాటీలు, కంపెనివారు, కలసి మైసూరురాజ్యమును పంచుకొనుటలో సంక్రమించిన ప్రాంతాలకున్నూ సర్వస్వామ్యసంకలిత హక్కులతో సంక్రమించాయి. 1806 సంవత్సరములో కంపెనీవారి ఇంగ్లాండు అధికారులు, భారతదేశములోని కంపెనీవారికి నాణెముల ముద్రణాధికారము సంక్రమింపజేశారు. 1818 బంగారునాణెముకూడా చలామణీ చేయించుటకు అనుజ్ఞ యిచ్చారు. దానిపేరు పూలవరహా. 300 పూలవరహాలకు రు. 350/- వెండిరూపాయిలు యివ్వమన్నారు. ఆప్రకారం తమ ఖజానాలలో జమకట్టుకొనేవారు కూడాను. 1835 ఇండియన్ కాయినేజీచట్టమంటూ ఒకటి నిర్మించి, అదివరకుండే పూలవరహా నొత్తిగించి, 'మొహరీ' అంటూ మరొకబంగారునాణెమును ముద్రింపించి, దానికి 15 వెండిరూపాయిలు యివ్వమన్నారు. వెండిబంగారునాణెములకు వుండవలసిన తరతమములనిర్ణయిస్తూ, 1841 ఒక ప్రొక్లమేషన్ జారీచేశారు. ఇంతలో పులిమీద పుట్రలాగున 1857 సంవత్సరములో సిపాయీల తిరుగుబాటు తటస్థమైనది. దానిలోనుండి బయటపడేసరికి తలప్రాణం తోకకు వచ్చినది. కంపెనీవారి సంచితద్రవ్యమంతా తుడిచిపెట్టుకొని పోయింది. అంటిపెట్టుకుంటూవుంటే, వ్యాపారం స్తంభించేటట్లు కనుపించినది—1858 సంవత్సరములో కంపెనీవారి భారతదేశములోదలి రాజ్యాధికారమును, ఇంగ్లాండు ప్రభుత్వమువారిపరం జేశారు - అంతవరకు ఇంగ్లాండు ప్రభుత్వమువారిది బంగారునాణెము - భారతదేశమునందు వెండిప్రమాణనాణెముగా నుండేది - ఒకరికొకరిచ్చి పుచ్చుకొనవలసి వచ్చినప్పుడు, ఆయాలోహముల యుత్పత్తిలో హెచ్చుతగ్గుల ననుసరించి యేర్పడే ప్రజానుమతమగు విలువను బట్టి ధరనిర్ణయింపబడేది కాని, ప్రభుత్వాధికారపటిమనుబట్టి కాదు.

నాణెముల నిర్మాణవిధానము

సాధారణముగా నాణెముల విలువ రెండుతెరగులుగా నుంటుంది. ఒకవిధానమును "ఇంట్రిన్సిక్ వాల్యూ" అంటారు. రెండవవిధానమును "టోకెన్"వాల్యూఅంటారు. నాణెమునందుండు లోహపువిలువకును, మారకపువిలువకును కొంచెం యించుమించు సరిసమానముగా నుండునట్లమర్పబడుదానిని "ఇన్ట్రిన్సిక్ వాల్యూ" అంటారు - నాణెమునందుండు లోహమునకు దాని మారకపువిలువకు యెట్టిసంబంధము లేక, కేవలము, ప్రభుత్వపుమోతుబరీనిబట్టి, మారెడి విలువను "టోకెన్ వాల్యూ"అంటారు. పరాధీనతకు పాల్పడినదేశములందును, తరుచు ప్రత్యేక అపాయకరపరిస్థితులేర్పడి, దేశఖర్చునకు కావలసిన, నాణెముల ముద్రణమునకు వలయునంత లోహమును లభింపజేసుకొనుటకు అవ్యకాశము లేనప్పుడు, యిట్టి "టోకెన్ వాల్యూ" నాణెము లవతరిస్తూయుంటాయి. నాణెములకొఱకుపయోగింపబడు కల్తీలేని లోహమును "ప్యూర్ మెటల్"అంటారు - అది బహు మెత్తగా వుంటుంది. సులువుగా కరుగదు - అరుగుదల కాస్పద ముంటుంది. నాణెముల నిర్మాణసందర్భములో అనుభవజ్ఞులగువారు, పరిశుద్ధలోహమునకొక పాలు, నీచలోహమిశ్రమ మవసరమని సిద్ధాంతీకరించారు. ఇట్లు కలగలుపునకై నిర్దేశింపబడిన లోహమును 'బేసిక్ మెటల్' అంటారు - పైరెండింటినీ కలపి కరగించుటవలన ఏర్పడినలోహమును "ఎల్లోయ్" (*alloy*) అంటారు. ముద్రింపబడిననాణెముల తూకంలో వచ్చే, లేహాలు, లేశాలుగా వుండే తూకం తేడాలను 'రెమిడీ' అంటారు.

1707 లో ముద్రింపబడిన 'సూరతు'లందు గ్రె 178 3/4 లు చాదీవెండి, గ్రె $1\frac{1}{4}$ లు రాగీ వుండేది - 'సిక్కా' రూపాయియందు గ్రె 176 లు ఛాదీవెండి గ్రె 4 లు రాగీ వుండేది - మద్రాసు "ఆర్కాటు"లలో గ్రె 165 లు వెండి, గ్రె 15 లు రాగీ వుండేది. తరువాత, అర్ధ, పావల, బేడ నాణెములు వెండితోనే నిర్మింపబడేవి. అణా కాసంటూ ప్రత్యేకము, ఒక టుండేది కాదు- అర్ధణా, కాని, ఏగాని దమ్మిడీ లనునవి రాగితో నిర్మింపబడేవి. 1909 సంవత్సరములో నిక్కెలుతో 0-1-0 కాసును సృష్టించి, అర్ధణాలు, కంపెనీకాలమునాటి రాగికాసులను, ప్రచారమునుండి తప్పించారు. క్రమముగా అర్ధ, పావలా, బేడలుకూడా నిక్కెలుతోనే నిర్మాణ మొనరించి, వెండితో చిల్లరనాణెములను ముద్రించువిధానమునకు స్వస్తి జెప్పారు. కాని, నిక్కెలుతో నిర్మింపబడిన రెండు అణాకాసుల తూకం, అర్ధరూపాయితూకంతో సమతుల్యంగా వుండేది - రెండు అణాకాసులను కరిగిస్తే, ఒకఅర్ధరూపాయి నికిలునాణెము తయారుచేయవచ్చు. ఈవిధంగా 0-2-0 లు పెట్టుబడికి 0-6-0 లు లాభం వస్తూ వుంటే దొంగనాణెములు తయారు చేసి, వాటిని మార్చుకొనుటవలన సమకూరు లాభంతో జీవితం గడుపుటయే ముఖ్యజీవనవృత్తిగా గలవారూరకుంటారా? ఈ సంగతి కనుపెట్టి నికిలుతో అర్ధరూపాయి నాణెమును ముద్రించుటను తగ్గించినారు. వీటి వెనుక ఇత్తడివంటి లోహముతో తయారుచేయబడిన, నలుపలకల అర్ధణా కాసులు, చిల్లికాను లున్నూ చలామణీలో పెట్టబడినవి. యుద్ధకాలములో ఇనుము కరువైనందున, మిల్లులవారున్నూ, యితరపారిశ్రామికాలయముల ఖామందులున్నూ ఇనుపవాషర్లు దొరుకమిచే, వాటికి బదులుగా చిల్లికానులను వాడటం ప్రారంభించారు. దానితో వాటినికూడా ముద్రించుట మానివేసినారు.

బ్రిటిషుక్రౌనుక్రింద భారతదేశము


ప్రపంచమునందు బ్రిటిషువారికి 'దుకాణాదారుల జాతి' (*Nation of shop-keepers*) అనే బిరుదొకటున్నది. ఇంగ్లాండును, ప్రపంచానికి కావలసిన సామానులను తయారుచేసే, పారిశ్రామికాలయముగా (*Work-shop*) జేయవలె నని, విల్లియంపిట్టు మహాశయుని ఆశయము. వీరే దేశమును పాలించినా, సామ్రాజ్యకాంక్షతోనే కాని, అందలి ప్రజలనుద్ధరించవలెననే సదుద్దేశముతో వ్యవహరించలేదు. ఈసంగతికన్పెట్టే, భారతదేశమునందు మీరు వుంచుకుంటే రాజ్యాధికారమైనా వుంచుకోండి లేదా, వాణిజ్యవ్యాపార సౌకర్యాలైనా చలాయించండి. అంతేకాని రాజ్యాధికారమును చేతియందుంచుకొని, ఆ అధికారమును వాణిజ్యసౌకర్యముకొఱకు వినియోగించుకుంటారో ఆరోజునుంచే, మీ ప్రతిష్ఠాపతనానికి పునాదులు వేసుకున్నవారవుతారని యాడంస్మిత్ హెచ్చరిక చేసినాడు. వీరి వాణిజ్యవిజృంభణావేశమే వీరిప్రస్తుతస్థితికి కారణము. చాలవరకు ప్రదేశమును, నయానోభయానో, స్వాధీనపర్చుకున్నారు. స్వదేశసంస్థానాధీశుల అధికారప్రాబల్యము మితిమీరకుండా, వ్యూహాలు పన్ని ఉరు లొగ్గి అదుపులో బెట్టారు. శత్రుత్వములేకుండా తెరపిజేసుకున్నారు. అక్కడనుంచీ, భారతీయుల రూపాయికి, ఆంగ్లేయుల పౌనుకు లంకెవేసినారు. కొంతకాలము వరకు వారి రెండుషిల్లింగులకు, మన దొక రూపాయి అన్నారు - పౌనుకు, 20 షిల్లింగులు - అంటే మనవి రూ 10/-లిస్తే వారి పౌనునాణెము, మనకొకటి యిచ్చేవా రన్నమాట- ఇచ్చి పుచ్చుకోవటాలు ఈప్రకారం లెఖ్ఖచూచుకోమన్నారు- మన వెండిరూపాయి 16 అణాల యెత్తు. కాని వారికాసు 0-11-0 ల యెత్తు. మన రూపాయిలో గ్రె 165 లు పరిశుద్ధమైన వెండి వుండేది. వారి కాసుతూకం గ్రె 123-274. దీనిలో నికరం బంగారం గ్రె 112 లు. వీరి నాణెములో నిజలోహం 11 పాళ్లు. నీచలోహమిశ్రమ మొకపాలు అన్నమాట. వెండిరూపాయిలోకూడ అంతే 11 పాళ్లు నిజలోహం 1 పాలు నీచలోహమిశ్రమం. కొంతకాలంవరకూ తంతు, ఈవంతులప్రకారం జరుగుతూ వచ్చింది.

రానురాను వ్యాపారం, ఉభయదేశాలమధ్య బాగా విజృంభించింది. వెంటనే ఇంగ్లాండులో సెక్రిటరీఆఫ్‌దిస్టేటు అంటూ ఒకఆఫీసును సృష్టించారు. దానికి సెక్రిటరీ, అండర్ సెక్రటరీ లంటూ కొంత సిబ్బందిని యేర్పరిచారు. భారతదేశపు రాజకార్యనిర్వహణకు కావలసిన ఉద్యోగస్థులనందరి నీ వారే నియోజిస్తూయుండటం. ఇంగ్లాండుకు, భారతదేశానికి మధ్య జరిగేవ్యాపారమునకు సంబంధించిన యిచ్చి పుచ్చుకోవడాలు, భారతదేశముతో జరిపే వాణిజ్యవ్యాపారముల లావాదేవీలు యావత్తు, సెక్రిటరీ ఆఫ్ దిస్టేటు ద్వారానే నిర్వర్తింపబడా లన్నారు. ప్రపంచములో యేయితర దేశముతోటి, ఇంగ్లాండు యొక్క స్టర్లింగు పౌండుద్వారానే జరుగాలిగాని, రూపాయికి సరాసరి మారకం పనికిరాదంటూ, వీటికన్నిటికి భారతదేశం తరఫున సెక్రిటరీ ఆఫ్‌దిస్టేట్‌ఉత్తవాదిఅనిగంపెత్తారాయనకు. లండనుపట్టణమందతని కొక ఆఫీసును కొంత సిబ్బందిని యిచ్చి, తద్వారా, భారతదేశపు ఆర్థిక వ్యాపారనిర్వహణవిధాన మతనిహస్తగతమొనరింపజేసినారు. ఇంతలో 1851 లో ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్ వేల్సులో బంగారపు గనులు బయల్వెడలినవి. 1851-లలో 1907, వరకు ఆ గనులనుండి,3,00,000,000 పౌనులు తూకం గల బంగారము బయల్వెడలినది. 1870 లో న్యూజిలండులోని, ఒటాగోపరగణాయందు బంగారపు గనులు దొరికినవి. 1885 లో ట్రాన్సువాలులో బంగారపు గనులు బయల్వెడలాయి. ఈవిధంగా, బ్రిటిషువారెక్కడికాలుబెట్టితే అక్కడల్లా బంగారము దొరకడం ప్రారంభించింది. దానితో బంగారం చవుకయింది. వెండి ప్రియమైనది. అప్పుడు ఇండియాసెక్రిటరీగారికి పచ్చివెలగకాయ గొంతుకలో పడింది. ఇండియాతరఫున, వెండితో తీర్చవలసిన బాకీలకు యెక్కువ బంగారము యిచ్చుకోవలసి వచ్చేది. ఇండియాకు యిచ్చుకోవలసిన వెండిరూపాయిలను యెక్కువ బంగారమిచ్చి కొనుక్కోవలసి వచ్చినది. అప్పుడు తానొకటి తలచితే, దైవ మొకటి చేశాడన్నట్లయినది. 1935 ఆప్రాంతాల్లో ప్రాణం విసిగి బంగారుప్రమాణమునెత్తివేశామన్నారుకూడాను. ఇటువంటి యొగుడుదిగుడులు వచ్చినప్పుడల్లా, తప్పించుకోవడానికొక కమిటీని నియోజిస్తూయుండటం, వారి రిపోర్టు పరిశీస్తూయుండటం ఆఅహాంతరం దాటిపోతే, కమిటీవారి శిఫారుసులను క్రమక్రమముగా ఆచరణలో బెట్టువామని సాగేస్తోయుండటం, మరీఉద్రిక్తమైతే మరొక ప్రొక్లమేషనో, కమిటీనో, నియోజిస్తూయుండటం జరుపుతూ వచ్చినారుకాని, యెన్ని కమిటీలు యెన్ని శిఫార్సులు చేసినా, ఇంగ్లాండునందువలెనే భారతదేశమునందుకూడా బంగారుప్రమాణం ఓపెన్‌మింటువిధానములుబెట్టమన్నారు. కాని, "*It is possible, that East India Trade, sweeping away great sums of gold, may make its scarcer in Europe*" అనే పాశ్చాత్యఅర్థశాస్త్రజ్ఞుని- నుడువులు వీరిహృదయసీమలయందు మెలగుతూయుండి, వీరిని సాహసకృత్యమునకు వెనుకాడించి యుండవచ్చును. ఒకప్పుడు అనగా 1900 సంవర్సరములో, భారతదేశమందుకూడా, గోల్డుకరెన్సీ అవలంబించుట నిశ్చయించికూడా, తూతూ బొడ్డుకుతువ్వా లన్నారు. ఇండియాగవర్నమెంటువారి ఆర్థికశాఖాసభ్యులైన సర్. సి. డాకిన్సు, భారతదేశమందుకూడా, బంగారుప్రమాణమే పెట్టుటకు నిశ్చయింపబడిన దనిన్ని, ఇంగ్లాండులోని రాయల్ మింట్ శాఖ నొకదానిని ప్రతిష్ఠించుటకు తీర్మానింపబడిన దనిన్నీ వెల్లడిస్తూ, బడ్జటు ప్రసంగసందర్భమందీ విధముగా ప్రస్తుగించినాగు. "*India has at length emaged brain a pound of transitions in her currency has reached a goal to which she has been strugging for years.*"

ఏదియెట్లున్నా 1896 సంవత్సరపు ఇండియా కాయినేజీచట్టము అనంతరం, 1835 1840 ల నాటివెండిరూపాయిలొత్తిగింపబడ్డాయి. మొదటి ఐరోపామహాసంగ్రామానంతరం, విక్టోరియా, ఎడ్వర్డురూపాయిలు చలామణీనుండి తప్పింపబడ్డాయి. ద్వితీయప్రపంచసంగ్రామానంతరం భారతదేశమును విడిచిపోతూ పోతూ, నికిలునాణెములను స్థిరపరచి వెళ్లారు ఆంగ్లేయులు.

తాజ్ మహల్ బీడీలు

వనుకటిపేరు ప్రఖ్యాతులుం కలిగినవి



ఇంకను సాటిలేనివిగాను శ్రేష్ఠమైనవిగాను వున్నవి. తనికీమాలిన నకలు బీడీలకు మోసపోవద్దు. వివరములకు: మాన్యుఫాక్చరర్లు:

మెసర్సు సయ్యద్ ఖాదర్,

వాషర్‌మన్‌పేట, : : మద్రాసు 21.

మధ్యప్రాచ్యము:

ఈజిప్టులో బ్రిటిష్‌వారి ప్రవేశం

శ్రీమతి కమలాదేవి ఛట్టోపాధ్యాయ



పశ్చిమఖండము, ప్రాచ్యదేశాల నాక్రమించు కోటానికి సంరంభాలు పదహారో శతాబ్దంలో ప్రారంభమయాయి. 1521 లో వెనీసురాజులు, టర్కీ సుల్తానులవద్దనుంచి, తూర్పున వ్యాపారం చేసుకోగలిగేందుకు ఒక ఫర్మానా పొందారు. ఆ ఫర్మానా నమూనా ప్రాచ్యదేశాల కన్నిటికీ ప్రాకింది.

ఆ ఫర్మానా ప్రకారం వనీసువర్తకులకు, స్వల్పపరిమితి మించిన రేవుకవులు మొదలైన విదేశ వ్యాపారసుంకాలులేని వ్యాపారంతోపాటు, వాళ్లు ఆక్రమించుకొన్న స్థలాలలో, వాళ్ల కాన్సల్సుపాలనలో వాళ్లకు ప్రత్యేక న్యాయపాలనాధికారాలు కూడా ఇయ్యబడ్డాయి. ఆధునిక కాలాలదాకకూడా, వీరి కీ పనులుబాట్లు అల్లాగే మిగిలాయి.

మధ్యధరాతీరంలో వాణిజ్య అగ్రస్థానము, వెనీసునుంచి, ఫ్రాన్సుకు, తర్వాత బ్రిటనుకు క్రమంగా చిక్కింది. వీరు అందరూ కూడా ప్రాచ్యరాజ్యాలవద్ద వెనిషియన్లు పెట్టిన వరవడిలోనే, ప్రత్యేకవర్గాలన్నీ సంపాదించు కొంటూనే వచ్చారు. 1581 లో బ్రిటిష్ లెవాంటు ట్రేడింగ్ కంపెనీ రంగంలోకి వచ్చింది. 1599 కి ఈ కంపెనీ లన్నీ కలిసి, చరిత్రాత్మక ప్రసిద్ధిగన్న ఈస్టుఇండియా కంపెనీ ప్రభవించింది.

18 వ శతాబ్ద ప్రారంభానికి, ఈ వివిధ యూరోపియన్ కంపెనీల ప్రాముఖ్యాలు బలాబలాలు, తారుమారుగా మారజొచ్చాయి. పోర్చుగీసు, డచ్చివార్ల ప్రభావం తగ్గి, ఫ్రెంచి, ఇంగ్లీషు వారల బోరు హెచ్చింది. బ్రిటిష్‌వారు, తమ సర్వశక్తిసామర్థ్యాలూ, ఈస్టిండియా కంపెనీ బలపర్చటానికి వినియోగపరిచి, ఇండియాకు వచ్చేమార్గంలో పొడుగునా, ముఖ్యంగా పెర్షియన్‌గల్ఫులో, బాగా పాతుకొని నిలదొక్కుకున్నారు.

అటు ఫ్రెంచివారు ఈజిప్టు, తివాన్‌తీరాలలో తమ ఉనికిని బలపరుచుకొంటున్నారు. ప్రాచ్యరాజ్యాధిపతులూ పరస్పరం కలహాలతో, స్వసామ్రాజ్యస్థాపనదాహాలతో, ఈ పాశ్చాత్య వర్తకశ్రేణిని దగ్గిర దీయటానికి అతిఉబలాటాలు చూపించారు. ఈ పాశ్చాత్యవర్తకులకు గిడ్డంగులు, సుశిక్షితసైన్యాలూ, అన్నిటికన్నా, నవీనమైన మందుగుండు ఆయుధాలు ఉండటంవల్ల, ప్రాచ్యరాజులు ఒకర్నిమించి ఒకరు వీరి స్నేహానికి ఉవ్విళ్లూరుతూ ఉన్నారు. ఈ వణిజులకు తమ స్వార్థలాభాలు సిద్ధింపచేసుకొంటూ బలపడి వాళ్లను తమ క్రిందికి తెచ్చుకొనేందుకు, సులభంగా అవకాశాలు చిక్కాయి. ఆ శతాబ్దమంతా, యూరోపియన్ రాజ్యాల బలాబలాల పరీక్షకు ప్రాచ్యదేశం రంగమయింది. సూయిజ్ కాలవ తవ్వటంతో, యూరప్ రాజ్యాలలో విరోధాలు మరింత ప్రబలమైపోయాయి.

మధ్యప్రాచ్యంమీదికి నెపోలియన్ దండయాత్ర చేసి తిరోముఖుడవటంతో ఇంగ్లీషువారి ఆధిపత్యం మధ్యప్రాచ్యంలో మరీ ప్రబలమైపోయింది. 1806 లో నెపోలియన్ దండయాత్రలనుంచి రక్షిస్తామనే మిషతో బ్రిటిష్‌వారు అలెగ్జాండ్రియా ఆక్రమించుకొని పీఠం వేశారు. ఈనాటికీ బ్రిటిష్ సైన్యాలు ఈజిప్షియన్ గడ్డమీద అల్లాగే నిలిచిఉన్నాయి.

ఇదేవిధంగా ఎఱ్ఱసముద్రంలో బ్రిటిష్‌వారు పెరిమ్, ఏడెన్‌లు ఆక్రమించుకొన్నారు. ఏడెన్‌ను "తూర్పు జిబ్రాల్టర్" అన్నాడు లార్డు వాలెంటిన్. ఆ జోస్యం అవిఘ్నంగానే ఫలించింది. 1870 నాటికి 'ఓమన్', 'మస్కట్', 'కొవాయిట్'లుకూడా బ్రిటిష్ చేతుల్లోకి వచ్చేశాయి. పర్షియన్‌గల్ఫులోని ఓడదొంగలను రూపుమాపి అరబ్బుషేకులను ఒక్కొక్కళ్లనే మంచి మాట చేసుకొని వాళ్ల రాజ్యాల గృహకృత్యాలలో జోక్యం కల్గించుకొని, నెమ్మదిగా ఆ ప్రదేశమంతా తమ క్రింద "రక్షితరాజ్యం" (*Protectorate*) ఏర్పరిచారు.

ఈజిప్టులో ఫ్రెంచివారు తమ ప్రభావంపై మెరుగుతో స్థాపించుకొన ప్రయత్నిస్తూంటే, బ్రిటిష్‌వారు నిశ్శబ్దంగా, తమ ఆర్థికసౌధాన్ని బలపరుచుకొంటూ, అక్కడ స్థావరం చిక్కించుకోసాగారు. దీనికి లకం, ఈజిప్షియన్ పత్తిని బ్రిటిష్‌వారు "లాంకషైరుకు" పంపించటం లోనే ఇమిడి ఉంది. 1821 లో లంకషైరు బట్టలమిల్లులలో ఈజిప్షియన్ ప్రత్తి వాడటం మొదలు పెట్టారు. ఈజిప్షియన్ ప్రత్తి ఇంగ్లండుకు ఎగుమతి అవటం ప్రారంభమయింది. మొదటి మూడేళ్లల్లో ఈ ఎగుమతి 200 రెట్లు పెరిగింది. లాంకషైరు మిల్లులు నేసిన బట్టలు తిరుగు ఓడలలో ఈజిప్టుకు దిగుమతి కాసాగాయి. అక్కడి చేనేతవస్త్రాలు ధర, ఈ మిల్లు బట్టల ధరకన్నా, 16% ఎక్కువగా ఉండేది. ఈజిప్టు బ్రిటిష్ మిల్లుబట్టతో నిండిపోసాగింది. 1849 నాటికి ఈజిప్టు ఎగుమతులు, దిగుమతులుకూడా సగానికి సగం బ్రిటనుతోటేనని తెలుసుకొంటే, ఈజిప్టులో బ్రిటను ప్రభావం ఎన్నింతలు పెరిగిపోయిందో తెలుసుకోవచ్చును.

ఇండియామీద తన ఆధిపత్య ప్రమాణాన్ని, ప్రాచ్యరంగంలో తన విధానాల కన్నిటికీ, బ్రిటన్ కీలకంగా చేసుకొంది. అందుచేత ఈ రంగంలో రైలుమార్గాలు మొదలైన నవీనసౌకర్యాలు ఏవీ రానియ్యకుండా ఈజిప్టుదేశాన్ని పాతపద్ధతులలోనే ఉంచేందుకు శాయశక్తులా ప్రయత్నించారు. సూయజ్ కాలువ తవ్వటానికి కూడా బ్రిటిష్‌వారు అభ్యంతరమే చెప్పారు. కాని రష్యా ఆస్ట్రియా, తదితర దేశాల బలిమితో, ఫ్రెంచివారు బ్రిటిష్‌వారి అభ్యంతరాలను తోసేయగలిగారు.

ఫ్రాన్సు జర్మనీతో యుద్ధంలో మునిగి ఉండటంతో, మధ్యప్రాచ్యంలో రష్యా ముందుకు తోసుకురాగల్గింది. నౌకాస్థానాలు, రేవుపట్టణం, ఎడతెగని రైలుమార్గాలు వీట్లకోసం మామూలు రభసలు అన్నీ బయులుదేరాయి. "బాగ్దాద్ రష్యనులకు దక్షిణరాజధాని కావలసిందేనా" అంటూ లార్డుకర్జన్ ఉరిమాడు.

కాని బ్రిటిష్‌వారికి, ఫ్రెంచివారిని నెగ్గగానే అంతకన్నా బలీయమైన శత్రువు జర్మనీ బయలుదేరింది.

జర్మన్లు టర్కీ సుల్తానులకు "బెర్లిన్-బాగ్దాద్" రైలుమార్గం నిర్మించి పెట్టటంతో, బ్రహ్మాండమైన కదలికలు కలిగాయి. దీనితో, యాత్రీకులకంటూ "హెజాజ్" రైలుమార్గం సృష్టిఅయింది. పేరు యాత్రీకులకోసమని అయినా నిర్మాణ ఉద్దేశంమాత్రము కీలకస్థానాల ఆధిపత్యంకోసమే. అంటే సూయజ్ కాలవ దాటక్కరలేకుండా, టర్కిష్ సైన్యాలను పశ్చిమ అరేబియాలో ప్రవేశపెట్టేందుకు ఈ రైలుమార్గం ఉద్దేశింపబడింది. బ్రిటిష్‌వారు ఎన్ని అభ్యంతరాలు చేపుతున్నా జర్మనీవారు లక్ష్యపెట్టకుండా తమ్మ పని తాము సాగించుకొంటూ పోయారు. ముందు వచ్చిన చెవులకన్నా వెనక వచ్చిన కొమ్ములు వాడి అన్నట్టు, కొత్తగా బలం పట్టూన్న జర్మనీ మరింత ముందుకు చొచ్చుకుపో మొదలుపెట్టింది.

బ్రిటన్‌కు అప్పటికే సుస్థిరంగా స్థావరం చిక్కింది. డిజ్రేలీ పోరుమీద, బ్రిటన్ సూయజ్ కంపెనీలో షేరు సంపాదించింది. అప్పటికే ఈజిప్టు ప్రభుత్వఋణపత్రాలు, జాయింటు స్టాక్ కంపెనీ మూలధనాలలో నూటికి 78 పాళ్లు విదేశీయుల చేతులలోనే ఉన్నాయి. రాజ్యాంగం అధోగతి పట్టింది. 1876 నాటికి ప్రభుత్వం దివాలా అనిచెప్పి, ప్రకటించి, శిస్తులు వసూలు చేసేందుకు, అయోమార్గాలు సముద్ర వ్యాపారాలు మొదలైనవి నడిపేందుకు, బ్రిటిష్, ఫ్రెంచి కమిషనర్లు నియమింపబడ్డారు.

"యూరపియన్ కంట్రాక్టర్లు, ఋణదాతలు, గ్రీకుపట్లికస్లు, తాకట్టుదారులు, యూదుపడ్డీ వ్యాపారస్థులు, భూము లుతణఖా వ్యాపారస్థులూ, ఇందరూచేరి, యూరపియన్ రాజ్యబలాల రక్షణక్రింద, ఈజిప్షియన్ ధనాన్ని అంతా దోచేసుకొని, బీద ఈజిప్టు రైతు రక్తాన్ని ఎంతో ఘోరంగా పిల్చివేశారు" అని లార్డు మిల్నరు వ్రాశాడు.

ఈజిప్టును నవీనం చేద్దామన్న ఊహతో "ఖేడివ్" ప్రారంభించిన సూయజ్ కంపెనీ షేర్ల ధనమంతా, ఈజిప్టు పురోభివృద్ధి కార్యక్రమానికి కాకుండా రాజభవనాలని ర్మాణానికే ఖర్చయిపోయింది. అభివృద్ధి ప్రణాళికలకు, రూపాయిలో అణన్నర కూడా ఖర్చు కాలేదు. ఏమైనా సామాన్య ప్రజల ప్రయోజనార్థం జరిగిన ఉపకార మేదీ లేదు. ఆరేళ్లలో పన్నులు నూటికి ఐదురెట్లు పెరిగిన అధికపు చదువుమాత్రమే బీదరైతు భరించాల్సివచ్చింది. 'దేశక్షేమార్థం' అంటూ విదేశాలు ఇచ్చిన ఋణాల బరువుమాత్రం అంతకంతకూ రైతు వన్ను విరగదొక్కింది. ఋణస్థులను పూర్తిగా పిడించి పిప్పిచేసేదాకా ఋణదాతలు వదలలేదు. ఈ స్థితికి తెచ్చిన దేశాన్ని బ్రిటిష్‌వారు తము పూర్తిగా ఆక్రమించుకో గలిగేందుకు ఆతర్వాత అడ్డంకు ఏమీ లేకపోయింది. విదేశఋణదాతల జొక్కసాలు నింపేందుకు పేదరైతు ఎన్నివిధాల పిప్పిగావాలో అన్ని విధాలా పిప్పి పిప్పి అయిపోయాడు.

దీనిపై బ్రిటిష్‌వారిపై యీజిప్షియన్ విప్లవం సూడాన్‌వరకూ పాకింది. సైన్యబలంతో బ్రిటిషువారు విప్లవాన్ని అణిచేయగలిగారు.

ప్రథమ ప్రపంచసంగ్రామ ప్రారంభానికే విప్లవశక్తులన్నీ మధ్యప్రాచ్య మహానాయకులలో అగ్రగణ్యుడైన జగ్లూల్ పాషా నాయకత్వం క్రిందికి వచ్చాయి. యుద్ధఅవసరాలను పురస్కరించుకొని బ్రిటిష్‌వారు దేశాన్ని "మార్షల్ లా"తో పాలించసాగారు. విప్లవ నాయకుల నందరినీ బందీలు చేశారు.


వర్సేల్సు సంధి, "ప్రజాస్వామ్యం-శాంతి" పేరిట ఈజిప్టుమీద బ్రిటిష్‌వారికి ధర్మకర్తృత్వం రూఢిచేసింది. కాని బ్రిటిష్‌వారు ఈజిప్టులో 'బీభత్సరాజ్యం' సాగించారు.

కాని కాలిక్రింద రాచిన పురుగే ఎదురు తిరిగింది. "నోరులేని ఈజిప్టురైతులు" ఎదురు తిరిగారు. పల్లెలలో రాష్ట్రాలలో ప్రజాప్రభుత్వాలు ఏర్పడ్డాయి. పల్లెలు స్వతంత్రపాలన ప్రారంభించాయి. బ్రిటన్ తగ్గి రావలసివచ్చింది. ఈజిప్టు స్వతంత్ర రాజ్యమే అని ప్రకటించింది. అయితే కొన్ని తీవ్రమైన నిబంధనలకు లోగి ఉండాలని అంది. సూడాన్‌మీది బ్రిటిష్ ఆధిపత్యము, రహదారులన్నిటిమీదా బ్రిటిష్ యాజమాన్యము అట్టే ఉంటా యని ప్రకటించింది. ఈజిప్టు ఇందుకు ఒప్పుకోలేదు. మళ్లీ బీభత్సపాలన సాగింది. ప్రజాపక్షం "వాఫ్టుపక్షం" పేర అంతకంతకూ బలీయమైంది. కాని వీరు ఎదిర్చవలసింది ఒక్క విదేశీయుల్నే కాదు. సుల్తానులుకూడా తమ లాభాలను బ్రిటిష్‌వారితో ముడిపెట్టుకొన్నారు. ప్రజలను అణచేందుకు సుల్తానులు బ్రిటిష్‌వారికి తోడయ్యారు.

నాజీ జర్మనీ ప్రభావంలోకి వచ్చి, ఎథియోపియాపై ఇటలీ దురాక్రమణ సాగించటంతో కొత్తఘట్టం ప్రారంభమయింది. బ్రిటిష్ ఈజిప్టు బాంధవ్యాలు సరిదిద్దుకోవలసివచ్చింది. అక్షరాజ్యశత్రువు నెదుర్కొనేందుకు, బ్రిటన్ ఈజిప్టులు 20 ఏళ్ల సంధిపత్రం (పదిఏళ్లతర్వాత సరిదిద్దుకొనేందుకు వీలుగా) వ్రాసుకోవలసి వచ్చింది. ఈ పత్రం ముఖ్యసూత్రం, బ్రిటన్‌తో సైనికస్నేహం. యుద్ధం అంటూ వస్తే; అక్కడంతా బ్రిటిష్ సైనిక అధ్వర్యంలోనే పాలన అంతా జరగాలి. మార్షల్‌లా, సెన్సార్, మొదలైనవన్నీ ప్రవేశపెట్టేందుకు బ్రిటనుకు అధికారముంటుంది. సూయజ్ కాల్వ బ్రిటిష్‌వారికి అత్యవసరం అన్న విషయం ఈజిప్టు గుర్తించాలి. అందుకని 10,000 బ్రిటిష్ సైనికులు, 400 మంది R. A. F వైమానికులు, అట్టే పెట్టి ఉంచాలి. ఈజిప్షియన్ సైన్యం బాధ్యతాయుతంగా ఈ పని నిర్వర్తించగలదు అని తేల్చేదాకా ఈ సైన్యాలు ఇల్లా ఉండవలసిందే. ఈజిప్షియన్ సైన్యాలు, ఉద్యోగులు, వలసజనం, సూడాన్‌లో ప్రవేశించేందుకు బ్రిటిష్‌వారు అనుజ్ఞ ఇచ్చారు. (1924 లో లీస్టాక్ హత్యతో బ్రిటిష్‌వారు వీటిపై నిషేధం పెట్టారు. ఆ నిషేధాన్ని తొలగించా రన్నమాట) సూడానీస్ ప్రభుత్వంలో ఏఉద్యోగానికైనా, సూడానీస్ పౌరులు దొరక్కపోతే తప్ప, బ్రిటిష్‌గాని ఈజిప్షియన్‌గాని ఉద్యోగులను నియమించరాదని కూడా, ఒక నిబంధన చేశారు. సూడాన్ జాతీయతను రక్షించటానికై బ్రిటిష్‌వారికి అవ్యాజకరుణాకటాక్షం కలగసాగింది.

కొద్దికాలంనుంచి సూడాన్ ప్రాముఖ్యం హెచ్చింది. సర్‌లీస్టాక్ హత్యానంతరం, "సూడాన్ పత్తిపొలాలకు నైలునదీజలాలను పూర్తిగా ఉపయోగించుకొనేందుకు ఈజిప్షియన్లు ఒప్పుకుతీరాలి" అంటూ అల్లెన్‌బీ బెదిరించాడు. అంతవరకూ ఈజిప్టుకు కావలసిన నీటి నరికట్టకుండా సూడాన్ పత్తిపొలాలకు నీరు తీసుకొనేవారు. కాని ఈ బెదరింపుతో నైలునదీగర్భాన్నే ఈజిప్టునుంచి తొలగిస్తామని బ్రిటిషువారు బెదరించారు. ఈ కీలకస్థానం పరాయివారిచేతిలో నున్నంతకాలమూ యీజిప్షియన్లు ఎదురుతిరగటమే కష్టమవుతుంది. మట్టు చేతి కందిచ్చి పెనగులాడినట్లుంది.

అదీకాక సూడాన్‌లో తన ఉనికికి స్థావరం చిక్కించుకొంటూ సూడాన్ జాతీయతకు



పంజాబ్ విశ్వవిద్యాలయం జర్నలిజం శాఖవారి అధ్వర్యాన న్యూఢిల్లీలో జరిగిన 'జర్నలిజం' దినోత్సవ మహాసభలో హెచ్. వి. కామత్ ప్రారంభోపన్యాసం చేస్తున్న దృశ్యం.

విశాలాంధ్ర నిర్మాణములో పత్రికారచయితల బాధ్యత

శ్రీ యన్. నరోత్తమరెడ్డి

[విజయవాడలో ఆంధ్రపత్రికా ప్రదర్శన ప్రారంభోత్సవానికి అధ్యక్షత వహించిన గోల్కొండ పత్రికా సంపాదకులు శ్రీ నరోత్తమరెడ్డిగారు ఆంధ్ర రాష్ట్ర సమస్య, పత్రికారచయితల బాధ్యత, తెలంగాణావాసుల సమస్యలను గురించి ఈ నెల 11వ తేదీ శనివారంనాడు ఉపన్యసించారు. తెలంగాణాంధ్రుల దృష్టిలో ఈ సమస్యలను వివరించిన శ్రీ రెడ్డిగారి ఉపన్యాసపాఠాన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాము. సర్కారు, రాయలసీమ, తెలంగాణావాసు లందరూ వీరి సూచనలను గమనించవలసియున్నది.]

ఆంధ్రరాష్ట్ర నిర్మాణము కొరకు పాతిక సంవత్సరాలకు పైగా ఆందోళన జరుగుచున్నను భారతదేశము స్వాతంత్ర్యమును బడసిన తరువాతనే ఈ సమస్యకు అధిక ప్రాముఖ్యత గలిగి, సమస్య నిజస్వరూపాన్ని దాల్చినదని చెప్పవచ్చును. ఇట్టి సమయంలో ఆంధ్రపత్రికా రచయితలందరు ఒకచోట సమావేశమై ఒండొరుల కష్టసుఖములను విచారించి ఆంధ్రుల చిరకాల వాంఛితమైన ఆంధ్రరాష్ట్ర స్థాపనకు సర్వశక్తులా ప్రయత్నించవలసిన ఆవశ్యకత యెంతేని యున్నది. ప్రస్తుత మిచట సమావేశమైన పత్రికారచయితలందరు వివిధ ప్రాంతాలకు జెందినవారైనను, సంస్కృతి, భాష, ఆచారములు సంబంధ బాంధవ్యములు, వీ టన్నింటివలన మన మందరము వేరుగా లేము. మనను వేరుగా నుంచిన కల్పిత పరిహద్దులు త్వరలోనే అంతరించి మన మందరము ఏకము కానున్నాము. అందుచే, ఆంధ్రుల నందరిని యేకము జేసి వారికి భారతదేశంలో ప్రత్యేక గౌరవస్థానము కలిగింప జేయవలసిన బాధ్యత నాయకులతోపాటు పత్రికారచయితలమైన మనపై సమానముగా నున్నది. ఈ విషయాన్ని గుర్తించి ఆంధ్రపత్రికారచయితలందరు (వారు ఆంధ్ర ప్రాంతములో నున్నను లేకున్నను) తదేకదృష్టితో, పట్టుదలతో కృషి యెడల, దూరము పరుగెత్తుచున్నట్లు కానస్తున్న ఆంధ్రరాష్ట్రము మనము అనుకున్న కాలమునకన్న ముందే యేర్పడవచ్చును.

భాషారాష్ట్రసమస్య:

స్వతంత్ర భారతము బాల్య దశలో నున్న సమయంలో, భాషాప్రయుక్త రాష్ట్రాల స్థాపన విషయంలో పట్టుబట్టుట భారతదేశమునకు హానికర మగునని చెప్పబడినది. భాషాప్రయుక్త రాష్ట్రాల స్థాపనను వాయిదా వేయుట కిదియే ముఖ్యకారణముగా చెప్పబడినది. కాని ప్రజాభిప్రాయమును గమనించినచో ఈ సమస్యను త్రోసిపుచ్చుటకు గాని, వాయిదా వేయుటకు గాని అవకాశము లేదు. భాషాప్రయుక్తరాష్ట్రాల సమస్యను ముందుగా ప్రవేశపెట్టిన ఆంధ్రులు ఇంతకాలంనుండి తమ అభిమతము నెరవేరక పోవుటవలన నిరుత్సాహపడుచున్నారు. భారతదేశంలో రెండుకోట్లకు పైగా ఆంధ్రు లున్నను, భారతదేశ చరిత్రలో ఆంధ్రులకు, ఆంధ్ర రాజులకు ప్రత్యేక గౌరవస్థాన మున్నను నేడు ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రము లేక వారందరు మదరాసు, హైదరాబాదు, మైసూరు, మధ్యరాష్ట్రాలు, ఒరిస్సా ప్రాంతాలలో వేర్వేరుగా నివసించవలసి వచ్చుట వారి దౌర్భాగ్యమే యగును. ఈ ప్రాంతాలలో ఆంధ్రులు, ముఖ్యంగా మద్రాసు హైదరాబాదులలో ఎక్కువగా నున్నారు. మదరాసులో వారి కెట్టి స్థాన మున్నదీ, రెండు సంవత్సరాలనుండి స్పష్టముగా చూస్తూనే యున్నాము. హైద్రాబాదు పరిస్థితి మీ రందరూ యీ 9 నెలలనుండి చూస్తూనేయున్నారు. అధికసంఖ్యాలుగా నున్న ఆంధ్రులస్థితి ఏ విధముగా నున్నదీ పత్రికా రచయితలైన మీకు నేను ప్రత్యేకముగా చెప్ప నవసరం లేదు.

భాషాప్రయుక్త రాష్ట్రాల స్థాపననుగూర్చి ఆలోచించుటకు యేర్పాటుచేయబడిన ధార్ కమిటీ నివేదికను మనము చూచినాము. జయపూరు కాంగ్రెసు మహాసభలో నియమింపబడిన అగ్రనాయకులకమిటీ సిఫారసులను గ్రహించినాము. ఆంధ్రులు తమ కోరిక సమంజసమయినది కాదేమో నని సంశయింపరాదు. చిరకాల వాంఛితమును బడయుటకు యెడతెగని కృషి చేయవలసియే యున్నది. కాని ముందుగా మనము యీ విషయములో నున్న అభిప్రాయభేదాలను దూరము చేసుకోవలసి యున్నది. ఆంధ్రనాయకులలో అభిప్రాయభేదా లుండుటచే యీ సమస్య వెనుకబడి పోవుచున్నదని చెప్పుటకు మనము సిగ్గుపడరాదు. జయపూర్ కాంగ్రెసు మహాసభలో నియమింపబడిన ఉపసంఘ సభ్యులైన డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు, ఆంధ్రులు మద్రాసుపట్టణంపై యెల్లప్పటికి హక్కులు వదలుకొంటేనే ఆంధ్రరాష్ట్ర స్థాపన త్వరలో జరుగు ననుచున్నారు. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసువారు దీన్ని ఖండిస్తూ విజయవాడలో జరిగిన సమావేశంలో తీర్మానాలు ఆమోదించినారు. మద్రాసు పట్టణ విషయాన్ని సావకాశంగా విచారించుటకు నిపుణుల సరిహద్దు కమిటీకి వదలివేసినచో, ఆంధ్రజిల్లాలతో గూడిన ప్రత్యేకరాష్ట్రమున కవకాశ మున్నది. అందుచే యీ సమస్యను గూర్చి యిచట సమావేశమయిన పత్రికారచయితలు ఒక దృఢనిర్ణయానికి వచ్చి యేక కంఠముతో యావదాంధ్రుల కోరికను వెల్లడించవలెను. మూలసూత్ర విషయంలో అభిప్రాయభేదాలు లేవు. వివరాలలో గూడా అభిప్రాయభేదా లుండరాదు. అప్పుడు మన కోరిక సఫలమగు నని నా దృఢవిశ్వాసము.

తెలంగాణా:

ఆంధ్ర రాష్ట్రముతో సన్నిహిత సంబంధమున్న సమస్య మరియొక టున్నది. అది హైద్రాబాదు సంస్థానాన్ని భాషాప్రయుక్త ప్రాంతాలలోకి విభజించి, మొత్తం వైశాల్యంలో సగముకన్న నధికముగా నున్న తెలంగాణమును ఆంధ్రరాష్ట్రములో చేర్చుట. ఈ సమస్యపట్ల స్టేటుకాంగ్రెసు విధానాన్ని గమనించవలసియున్నది. హైద్రాబాదు స్టేటుకాంగ్రెసు నాయకులు మొదటినుండియు భాషాప్రయుక్త విభజనకు అనుకూలాభిప్రాయాలను వెల్లడిస్తూయున్నారు. తెలంగాణా ప్రజలు గూడా యివే అభిప్రాయాలు కలిగియున్నారు. శ్రీ శంకర్‌రావుదేవ్ లోగడ హైద్రాబాదు వచ్చి మహారాష్ట్ర ప్రాంతాలు పర్యటన జేసినప్పుడు, భాషాప్రయుక్త విభజనకు అనుకూలాభిప్రాయాలే వెల్లడించినారు. గణపురములో జరిగిన హైద్రాబాదు ఆంధ్ర కాంగ్రెసు స్థాయిసంఘ సమావేశంలో ఆమోదింపబడిన తీర్మానాలలో భాషాప్రయుక్త విభజనకు స్టేటుకాంగ్రెసు ప్రయత్నించవలసిందిగా కోరుతూ సిఫారసు జేసిన తీర్మానము ముఖ్యమైనది. పరిస్థితు లిట్లుండ హైద్రాబాదును భాషాప్రయుక్త భాగాలలోనికి విభజించుట స్టేటు కాంగ్రెసు అధికార అభిప్రాయము కాదని స్టేటుకాంగ్రెసు అధ్యక్షులు స్వామీ రామానంద తీర్థ అభిప్రాయపడినట్లు వార్తలు వెలువడినవి. ఈ విషయాన్ని ఖండిస్తూ ఆం.క. ప్రాంత కాంగ్రెసువారు సత్వరమే ప్రకటన జారీ చేయవలెను. తమ వ్యక్తిగత అభిప్రాయాలను ఆంధ్రుల నెత్తిపై రుద్దుటకు యెంత గొప్ప నాయకునకైనను అధికారం లేదు. ఆంధ్రపత్రికా రచయితలు యిట్టి విభిన్నఅభిప్రాయాలు వెల్లడించు నాయకుల ప్రకటనలను ఖండించి ప్రజలకు సరియైన మార్గమును చూపెట్టవలెను.

ఆంధ్రపత్రికా రచయితలపై మరొక బాధ్యత యున్నది. రాయలసీమ ఆంధ్రులకు తెలంగాణాంధ్రులకు సర్కార్ల ఆంధ్రులనుగూర్చి కొన్ని అనుమానా లున్నవి. పూర్వం జరిగిన శ్రీబాగ్ ఒడంబడికకు యిట్టి అనుమానాలే ముఖ్య కారణము. తెలంగాణము ఆంధ్రరాష్ట్రములో చేరుటకు ముందు శ్రీబాగ్ ఒడంబడికవంటి ఒడంబడిక జరుగుట అవసరమని కొందరు తెలంగాణావాసులు అభిప్రాయపడుటకు యీ అనుమానాలే కారణము. హైద్రాబాదు సంస్థానములో రజాకార్ల ముఠా యేర్పడి ప్రజలపై అత్యాచారాలు సాగించుటవలన గత సంవత్సరం వేలమంది ప్రజలు తమ ప్రాణ మానధనములను రక్షించుకొనుటకు పరిసర రాష్ట్రాలలో తలదాచుకొనిరి. సంస్థానము విడిచివెళ్లిన ఆంధ్రులలో అధికసంఖ్యాకులు మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్రజిల్లాలలో నివాసమేర్పరచుకొనిరి. అప్పుడా ప్రాంతాల ఆంధ్రులు, ప్రాణములను గాపాడుకొనుటకు తమ అండకు వచ్చిన సోదర ఆంధ్రులను సరిగా ఆదరించలేదు. ఆదరణమాట వదలి, శరణార్థులై వచ్చినవారినుండి లాభపడుటకు ప్రయత్నించిరి. ఆంధ్రదేశములోని ఒక ప్రఖ్యాత వారపత్రిక, శరణార్థులై వచ్చినవారిని ఎగతాళి జేస్తూ వ్యాసముల ప్రకటించినది. దీని మూలంగా సోదర ఆంధ్రులు తమకు సహాయపడెద రని గంపెడాశతో వచ్చిన శరణార్థులకు నిరాశ గలుగుటేగాక యీ ప్రాంతాల ఆంధ్రులపట్ల చెడ్డ అభిప్రాయం కలిగింది. యీ ప్రాంతాల ఆంధ్రులు తమ కేదో ప్రత్యేకత యున్నదనియు తమ ఆచారాలే సరియైన ఆచారాలనియు, తమ భాషయే సరియైన భాష యనియు, యిట్టివే యింకెన్నో అహంభావాలు గలిగియున్నట్లు తెలంగాణా నుండి వచ్చినవారు తలచిరి. విశాలాంధ్రము కొరకు ప్రయత్నము జేయవలసిన యీ సమయంలో ఇట్టి భావాలు కలుగుట యెంతమాత్రం సమంజసము గాదని మనవి జేయుచున్నాను. ఆంధ్రపత్రికా రచయితలందరూ ఈవిషయాన్ని దృష్టి యందుంచుకొని తెలంగాణా ఆంధ్రులకు గాని యితర ప్రాంతాల ఆంధ్రులకుగాని విసుగు జనించునట్లు ప్రవర్తించరాదు. పత్రికా రచయితలకు ఇదే నా మనవి. తెలంగాణా ఆంధ్రులు యితరప్రాంతాల ఆంధ్రులకన్న వెనుకబడియున్న మాట వాస్తవమే. నిజాంనిరంకుశపరిపాలన క్రింద అణగద్రొక్కబడి యుండుటయే దీనికి ముఖ్యకారణము. తమకన్న కొంతముందుగా నున్న ఆంధ్రజిల్లాలవారు తమకు సరియైన అవకాశాలు గలిగించరేమోనని తెలంగాణావాసులలో కొందరు భీతి జెందుట వింత గాదు. ఇట్టి అపోహలను దూరముచేయు బాధ్యత యిచ్చటి ప్రజలు, పత్రికారచయితలు, నాయకులపై నున్నది. హైద్రాబాదు నగరం విశాలాంధ్రమునకు రాజధానిగా నుంటేనే, తెలంగాణా ఆంధ్రరాష్ట్రములో చేరుట కంగీకరించవలెనని కొందరు కోరుటకీ అపోహలే కారణము. శిశువు జనించకముందే పేరుకొరకు వెతకినట్లున్నది, రాజధానికొరకు

(20-వ పేజీ చూడుడు)

ప్రోత్సాహ మిస్తూంది బ్రిటన్. అంటే అవసరమైనప్పుడు, ఈజిప్టును నొక్కేందుకు వీలు అట్టేపెట్టి ఉంచుకొంది. నైలుపక్కని ఉభయదేశాల్నీ ఎడతెగని పగ్గాలు రెచ్చకొట్టి బ్రిటన్ నాటకం ఆడుతూంది.

(సశేషము)



తిరుపతి దేవస్థానంవారు ఇటీవల నిర్వహించిన వేసంగి పాఠశాల ఉపాధ్యాయులు, దేవస్థానం కమిటీసభ్యులు. కుర్చీలలో కూర్చున్నవారు-ఎడమనుండి కుడికి వరుసగా—ఆర్. నాదమునిరెడ్డి, పరవస్తు వెంకట రామానుజస్వామి, బి. వీరాస్వామినాయుడు, వి. ఎస్. త్యాగరాజముదలియారు, కె. వెంకటస్వామినాయుడు, జి. వెంకటరెడ్డి, ఎం. రామకృష్ణా రెడ్డి, కె. కులశేఖరదాస్, ఎం. దొరైకణ్ణుగార్లు.

శ్రీకాళహస్తి మాహాత్మ్యము - కొన్ని విశేషములు

శ్రీ బులుసు - వేంకటరమణయ్య

శ్రీకృష్ణదేవరాయలకాలమున వెలువడిన యాంధ్రప్రబంధములలో ధూర్జటిమహాకవి రచించిన శ్రీకాళహస్తిమాహాత్మ్యము పేర్కొనఁదగినది. సాలెపురుగు, పాము, ఏనుఁగు, తిన్నఁడను కిరాతుఁడు, వేశ్యలును ముక్తిపొందిన శ్రీకాళహస్తిక్షేత్రముయొక్క ప్రాశస్త్య మీ ప్రబంధమునఁ జక్కఁగా వర్ణింపఁబడినది.

మహాకవి ధూర్జటి గొప్ప శివభక్తుఁడు. ఇతఁడు శ్రీకాళహస్తిమాహాత్మ్యమునే గాక, శ్రీకాళహస్తీశ్వరశతకమునుకూడ రచించెను. తాను రాయల యాస్థానమునందలి యష్టదిగ్గజములలో నొకఁడయి యున్నను తన గ్రంథముల నాయన కంకిత మీయకుండెను; దీనింబట్టి యీతనికిఁగల స్వాతంత్ర్యము వ్యక్తమగుచున్నది; గ్రంథమును తనకుఁ గృతి నీయకున్నను రాయ లీతనిపయి కినియలేదు; మీఁదుమిక్కిలి

'స్తుతమతి యైన యాంధ్రకవి
ధూర్జటిపల్కుల కేల గల్గె నీ
యతులిత మాధురీమహిమ'

అని యీతని కవిత్వమును ప్రశంసించి యున్నాఁడు.

ధూర్జటికవి తన కులగోత్రములను గూర్చి చెప్పి యుండలేదు. కాని యితని మనుమఁడును, 'కుమారధూర్జటి' బిరుదాంచితుఁడు నగు వేంకటార్యకవి రచించిన 'కృష్ణరాయవిజయము'నుబట్టి ధూర్జటి యాపస్తంబసూత్రుఁ డనియు, భారద్వాజగోత్రుఁ డనియు, పాకనాటి యార్వేలవంశీయుఁ డనియుఁ దెలియుచున్నది.

మాహాత్మ్యములు ప్రౌఢప్రబంధములుగా రచింపఁబడుట పదునాఱవ శతాబ్దిలోనే ప్రారంభింపఁబడి యుండవచ్చును. తెనాలి-రామకృష్ణకవి రచించిన 'పాండురంగమాహాత్మ్యము'నకుఁ బిదప ఎన్నదగిన మాహాత్మ్యరూపప్రబంధములలో నిది యే తొలుతటిది. పెక్కు విషయములలో నీ రెండింటికిని పోలికలు కానవచ్చుచున్నవి. ఈ రెండును ప్రౌఢప్రబంధములు. కవు లిరువురును రాయలసభలోని అష్టదిగ్గజములలోనివారే. రెండింటను కవులు వ్యాకరణశృంఖలలకు లొంగక స్వేచ్ఛగ సంచరించిరి. రెండును ధనాశతో వ్రాయఁబడిన గ్రంథములు కావు; రెంటను, కీటకమృగములును ముక్తిపొందిన కథలు కలవు. కథలను చర్వితచర్వణముగఁ గూర్చినను, క్రొత్తదనమువలనఁ గ్రొత్తగానే తోఁపించి, చదువరులకు విసువు కలిగింపనిరీతి కూర్పు రెండింటను గలదు. రెండింటను సరిసమానము లగు లోకోక్తులు కూర్పఁబడినవి; ఇఁక భేద మే మనఁగా — ఒకటి వైష్ణవమతప్రశస్తి ప్రతిపాదకము. వేఱొకటి శైవమతప్రాశస్త్య ప్రతిపాదకము.

ధూర్జటి, రామకృష్ణకవులకుఁ బరస్పరము కొలఁదిపాటి విరోధ మున్నట్లు

'స్తుతమతియైన యాంధ్రకవి
ధూర్జటి పల్కుల కేల గల్గె నీ
యతులిత మాధురీమహిమ'......

అని శ్రీకృష్ణదేవరాయలవా రిచ్చిన సమస్యయు, దానికి తెనాలి రామకృష్ణుఁ డొసగిన—

.........'హా; తెలిసెన్ భువనైకమోహనో
ద్ధత సుకుమార వారవని
తాజనతా ఘనతాపహార సం
తత మధురాధరోదితసు
ధారసధారలఁ గ్రోలుటంజుమీ'

అను సమాధానమును తెలుపుచున్నవి.

పయివిషయమువలన ధూర్జటికవి వేశ్యాలోలుఁ డను ప్రతీతి కలుగుచున్నందున— అట్టి ప్రథను సహించని ముద్రిత కాళహస్తిమాహాత్మ్య పీఠికాకారులు— ఇది యంతయుఁ గల్పితమనియు, ధూర్జటిమహాకవి పరమ భక్తాగ్రేసరుఁ డనియు, హాస్యగాఁ డగు రామకృష్ణుని మాటను లెక్క చేయరా దనియుఁ దెలిపిరి. [చూ. పీఠిక. ఫుట X] ధూర్జటిమనుమఁ డగు కుమారధూర్జటి, తన తాత కృష్ణరాయలవలన 'స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటిపల్కుల కేల గల్గె నీ యతులిత మాధురీమహిమ' అను గొప్ప ప్రశస్తి పొందె నని చెప్పినమాటలను పీఠికాకారు లంగీకరింతురు. కాని, సమస్యను పూరించిన భాగము మాత్రము యథార్థవిషయముపై నాధారపడి యుండ లే దందురు. ఒక పద్యమునఁ గొంతభాగము సత్యమయి, కొంత యసత్య మనుట పొసఁగదు కదా!

ధూర్జటిమహాకవి వేశ్యాలోలుఁ డైనంతమాత్రమున అతనిభక్తికిఁ గాని, వాక్శుద్ధికిఁ గాని, ప్రశస్తికిఁ గాని భంగము కలుగదు. ఈవిషయమున శ్రీనాథాదులు మేలుబంతులు! వేశ్యాస్నేహము కవులకు గుణావహము. 'విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహినః' అను భగవద్గీతోక్తి ననుసరించి చూడఁగా 'కామి గాక మోక్షకామి' యగుట యసంభవ మనుట స్పష్టము.

మఱియు ధూర్జటికవి గొప్ప సరసుఁడు; వర్ణింపవలసిన పట్టుల నీతఁడు శృంగారము ...తముగ వర్ణించెను. ప్రథమాశ్వాసములోని ౭౩, ౭౭, సంఖ్యల పద్యము లీవిషయమునకు దార్కాణములు. పరమ భక్తాగ్రేసరుఁ డను నీ కవి శృంగారమువంక మూచినచో—

'మం చెలమీఁద నెక్కి కటి
మండలిఁ జుట్టిన పాలుటాకు లిం
చించుక చంచలించి, మరు
నిల్లు బయల్పడఁ జేయఁ బట్టలన్
జెంచెల లార్చి వ్రేయుదురు
చిత్రముగా నొడిసెల్ల బాహుమూ
లాంచితదీధితుల్ చిలుత
యైన చనుంగవమీఁదఁ బర్వఁగన్'

అను [ఆ. ౩. ప.౧౦] పద్యమును వ్రాయుట యసంభవము కదా!

దీనింబట్టి ధూర్జటికవి యొనర్చిన వర్ణన, యతని వేశ్యాప్రీతియు భక్తి కెంతమాత్రమును ప్రతిబంధకములు కాఁజాల వని తెలసికొనవలసి యున్నది.

'ధూర్జటి' నామమున వెలసిన కవులు ముగ్గురున్నట్లు తెలియుచున్నది. మహాకవిధూర్జటియు, నితని మనుమఁడును, కుమారధూర్జటి యను బిరుదు పొందిన వెంకటార్యుఁ డొకఁడును ప్రసిద్ధులు. వీ రిరువురే కాక, 'కాళహస్తీశ్వర దండకము'ను రచించిన ధూర్జటికవి యింకొకఁడు కలఁడు. అతనినిగూర్చి దొరతనమువారి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమువారు ప్రకటించిన యక్షగానములు-దండకములు అను పుస్తకములపట్టికయొక్క ఎనిమిదవ సంపుటమునఁ గొంత విషయము కలదు. అతఁడు వ్రాసిన దండకములోని—

'మాధురి సాధురీతిన్ రచించెన్ బ్రియావల్లకీ భాతిఁ జేతోభవారాతిపై నూత్నశృంగార మీ దండకం బాంధ్రభాషాకవిగ్రామణిన్ జక్కయామాత్య నారాయణ శ్రీసుధీమాధవాఖ్యావనీదేవతా విశ్వనాథ ప్రధానీంద్రపోలాంబికాపుత్రుఁడున్ ధూర్జటిప్రాఖ్యుఁడున్ జేసె ముఖ్యం బగున్ మూఁడు లోకంబులన్—'

అను భాగమునుబట్టి యతని పితృ పితామహ, ప్రపితామహుల నామములు తెలియుచున్నవి. ధూర్జటి పోలాంబికా విశ్వనాథుల పుత్రుఁడు.

కాళహస్తీశ్వరదండకము చాల నవీనము. కాళహస్తీశ్వరుని గూర్చి గ్రంథమును వ్రాయుటవలన ఈకవికిఁ గల ధూర్జటినామము చరితార్థమైనది. దండకములోని ముఖ్యేతివృత్తము— ఒక వారవిలాసిని శ్రీకాళహస్తీశ్వరుని వలచి విరాళిఁ జెందఁగా, వేశ్యమాత సాదిభిక్షుం డగు నాతనిమీఁది వలపు తగవు కా దని వారింపఁ దనియు, పిదపఁ గూతురు తల్లికి ఆదిదేవుని మాహాత్మ్యమును తెలియఁజెప్పి యొప్పించి కృతార్థురాలయ్యె ననియుఁ గలదు. వారవనితల వంచనారీతు లిందు బాగుగ వర్ణింపఁబడినవి.

పయి యితివృత్తము, అంశములునుగూడ కొలది మార్పులతో శ్రీకాళహస్తిమాహాత్మ్యమున గానవచ్చుటచే, ఈ దండకము ధూర్జటి ప్రబంధము ననుసరించియే వ్రాయబడిన దన వచ్చును.

కుమారధూర్జటి పుత్రుఁ డగు లింగరాజకవి ధూర్జటి వ్రాసిన శ్రీకాళహస్తిమాహాత్మ్యము ననుసరించి విపులప్రబంధమును పండ్రెం డాశ్వాసములలో వ్రాసియున్నాఁడట! అందు ధూర్జటి గ్రంథమునకంటె కొన్ని మార్పులు కానవచ్చుచున్న వని పీఠికాకారులు తెలుపుచున్నారు.

శ్రీకాళహస్తిక్షేత్రమాహాత్మ్యము సంస్కృతమునను గలదు. అది లింగరాజకృతప్రబంధమునకు సరిపోవునుగాని, ధూర్జటికృతప్రబంధమునకు సరిపోదు. కావున అది ధూర్జటిగ్రంథముకంటె చాల అర్వాచీన మనవలెను. తెలుగులో నున్న క్షేత్రమాహాత్మ్యములకు ప్రసిద్ధిని, ప్రాశస్త్యమును గూర్పగోరి మనవారు సంస్కృతమున ఆ కథలను గూర్చుట యొక యాచారమై యున్నది. ప్రసిద్ధప్రబంధ మగు పాండురంగమాహాత్మ్యమునకును ఇట్టి నకలు సంస్కృతము ఒకటి కానవచ్చుచున్నది. ఈ సంస్కృతగ్రంథములు ప్రబంధముల పౌర్వాపర్యనిర్ణయమున ఎంతమాత్రము ప్రమాణములు కావు; వీనివలన తెలుగు ప్రబంధముల ప్రశస్తియు కొఱవడజాలదు.

శ్రీకాళహస్తిమాహాత్మ్యము తొలిసారి 1895 వ సం. నను, మలిసారి 1930 వ సం. నను ముద్రింపబడినది. రెండవ ముద్రణమున మూలముతోబాటు శ్రీవావిలికొలను సుబ్బరావుగారు వ్రాసిన లఘుటీక (12 పుటలు) యు ముద్రింపబడినది. ఏతద్గ్రంథముద్రణమున శ్రీ పూండ్ల రామకృష్ణయ్యగా రిచ్చిన ప్రతియు, 'దొరతనమువారి లిఖిత పుస్తకభాండారము నందు మెస్తరు బ్రౌన్‌దొరగారిచే సేకరింపబడి కడు హెచ్చరికతో వ్రాయింపబడిన ప్రతియొకండును' మిక్కిలి యుపకరించినట్లు పీఠికాకర్తలు తెల్పియున్నారు. పయివానినే గాక వారు మఱి రెండుసమగ్రగ్రంథములను పరిశీలించి శుద్ధప్రతిని వ్రాసికొని ముద్రింపించిరట!

ప్రథమముద్రణము వెలువడినపిదప, అందు పెక్కు ముద్రణస్ఖాలిత్యములు, అసంగతములు నున్నట్లు శ్రీ వేదం— వేంకటరాయశాస్త్రులుగారు ఆంధ్రలోకమునకు వెల్లడిపఱచిరి. వారు తమ 'శారదాకింకిణీ' పరంపరలో 'శ్రీకాళహస్తి మాహాత్మ్యముద్రణ విమర్శనము'ను ప్రత్యేకగ్రంథముగనే ప్రకటించిరి. ఈ ప్రబంధపు ద్వితీయముద్రణమున— శ్రీశాస్త్రులుగారి విమర్శన ఫలితముగ గాబోలు కొన్ని తప్పులు దిద్దబడినవి. శ్రీ వావిలికొలను—సుబ్బరావుగారు రెండవ కూర్పుపీఠికలో దొరకిన తాటియాకుపుస్తకములసమగ్రములుగా నుండుటచే దొలుతటి కూర్పున దోషములు మెండుగా నుండ గారణ మయ్యె' ననియు 'దీనిని సంస్కరించుటయం దాంధ్రసాహిత్యపరిషత్తువారు సేకరించిన యొక కాళహస్తిమాహాత్మ్య పుస్తకము జీర్ణమువసమగ్రమయ్యు నాకు మిక్కిలి యుపయుక్తమయ్యెఁ గావున వారికి గృతజ్ఞతచే నమస్కరించుచున్నాఁడను' అనియు మాత్రము వ్రాసియున్నారు. శ్రీ సుబ్బరావుగారు శ్రీ వేంకటరాయశాస్త్రులుగారి నామమును స్మరింపకపోయినను, ఆయన విమర్శనను చూచి, కొన్ని తప్పులు దిద్దియుందు రనుట యూహ్యము.

ధూర్జటిమహాకవి, తాను కోరియే ప్రయోగించిన 'కాచుక, చేసుక, నూఱుక, కడ్పు, చిన్నక పెద్దక, (చిన్నయనక, పెద్దయనక) ఎఱ్ఱు (ఎఱుకు), పోడిమిన్ (పోడిమియును), అతనికి విని, నిమ్మపంటి పులుస, మన్నన' వంటి ప్రయోగములను, క్త్వార్థకారసంధిని అటుంచి, లిఖిత ప్రతులనుబట్టి చూడగా ముద్రితప్రతులకును,


(17 వ పేజీ చూడుడు)



భారత ప్రభుత్వ ఆహారశాఖమంత్రి గౌ. శ్రీ జయరాందాసు దౌలత్‌రాంగారు చెంగల్పట్టు జిల్లాలోని పోరూరు, చెంబరంబాకం చెరువులను తనిఖీ చేయుచుండుట.

గనోక్వేల్
...పెరంతు గంటలలోగుణము

కథానిక:



మూలం: ఆస్కార్ వైల్డ్ - అనువాదం: శ్రీ కోటంరాజు జనార్దనరావు

ఒకనాటి మధ్యాహ్నము హోటలులో కూర్చుని, పట్టణజీవితంలోని ఆనందాన్ని, ఆర్భాటాన్ని చూసున్నాను. ప్రపంచం మన కళ్ళయెదుటే మనం గ్రహించకుండా ఎట్లా మారిపోతుందా అని ఆలోచిస్తూండగా వెనకనుంచి నన్నెవరో కేకవేసినట్లనిపించింది. వెనక్కు తిరిగి చూచేటప్పటికి మర్చిసన్ కనపడ్డాడు. కాలేజీకాంపౌండు వదలివేసిన తర్వాత పదిసంవత్సరాలకు నేటికి మేమిద్దరం కలుసుకున్నాము. చిరకాలానికి ఆప్తస్నేహితుడు కలిసేటప్పటికి, ఆనందాన్ని పట్టలేక కౌగలించుకున్నాను. చదువుకుంటున్న రోజుల్లో ఈతను ఒక్కడే నా ఆత్మీయుడు, స్నేహితుడు అని చెప్పొచ్చు. గొప్పవంశంలోంచి వచ్చినప్పటికీ, ఎప్పుడూ సూటిగా మాట్లాడుతూ, నిజం చెప్తుండేటప్పటికి, ఈతనితో స్నేహం కొంత బాధ కలిగిస్తూండేది. ఇన్నాళ్ళకు అతనిలో మార్పు కొంత ఉన్నట్లు కనపడుతోంది. ఎప్పుడూ ఉత్సాహంతో చిఱునవ్వు నవ్వుతూండే అతనిముఖంలో ఏవో విషాదరేఖలు అలుముకున్నట్లున్నాయి. జీవితంలో ఏదో తీరని సంఘటన జరిగినప్పుడు కలిగే మార్పు అతనిలో కలిగినట్లనిపించింది. దీనికల్లా పెద్ద ఆధారం స్త్రీమాత్రమే అయివుంటుందనే ఉద్దేశంతో "వివాహం అయిందా?" అని ప్రశ్నించాను.

"స్త్రీలను యింకా పూర్తిగా అర్థం చేసుకోలేదు" అని జవాబిచ్చాడు.

"అదేమిటి? స్త్రీలు ప్రేమింపబడడానికిగాని, అర్థంచేసుకునేందుకు కాదు" అని నా ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాను.

"నేను స్త్రీని నమ్మందే, ప్రేమించలేను" అని ఖండితంగా సమాధానం చెప్పాడు.

దీన్నిబట్టి చూస్తే నాపూర్వపు అనుమానం ఛాయ మనిపించింది. ఇతడెక్కడో జీవితంలో దెబ్బ తిని ఉంటాడు. ఆ కళంకాన్ని యావత్తు స్త్రీజాతి మీదే మోపుతున్నాడనిపించింది.

"ఏంరా బాబూ! ఏదో కథ నడిచినట్లుందే?" అని అన్నాను.

"బయటకు పోదాం పద! ఇక్కడ జనం మరీ ఎక్కువగా వున్నారు" అని నన్ను బయటకు బయలుదేర తీశాడు. 'సరే'నంటూ బయటకు వచ్చి టాక్సీ పిలవపోతూంటే వద్దని బండి పిలిపించాడు. ఎక్కడకో చేరం ఆడకుండానే బండిలోకి జేరాము. బండివాడు 'ఎక్కడి'కని అడిగాడు. ఊరిఅవతలకు అని చెప్పేటప్పటికి, వాడు మావంక ఒకసారి చూచి, బండిని వేగంగా తోలడం ప్రారంభించాడు.

సాధారణంగా ఒక సంఘటన జరిగితే గాని మనలో మార్పు రాదు. ఒక్కొక్కప్పుడు ఆసంఘటన మనజీవితంలో మంచి మార్పును తెస్తుంది; ఒకటి మన జీవితాన్నే నాశనం చేస్తుంది. ఇద్దరం బండిలో మౌనంగా కూర్చున్నాము. అతనివంక చూస్తే జరిగిన సంఘటనను జ్ఞప్తికి తెచ్చుకుంటున్నట్లుంది. గమ్యస్థానానికి చేరాము. ప్రక్కగా ఒక్క ప్రవాహం ప్రవహిస్తోంది. బాడుగ తీసుకొని బండివాడు వెళ్ళిపోయాడు. వెళ్ళి గట్లమీద కూలబడ్డాము.

వెంటనే ఒక చిన్న ఫోటోకేస్ నాకు తీసి యిచ్చాడు; తెరిచి చూచాను. లోపల ఒక అందమైన స్త్రీఫోటో వుంది. విశాలమైన కళ్ళు, ముంగురులు తిరిగిన జుట్టుతో ఆమెముఖం చాల ఆకర్షణీయంగా వుంది. పట్టువస్త్రాలతో బిగింపబడిన ఆమెఅంగసౌష్టవం ఆమె ఒక ధనికురాలని సూచిస్తోంది.

"ఏం, ఆమె నీకు మర్యాదస్థురాలిగా తోస్తోందా?" అని అడిగాడు నన్ను.

నేను ఈసారి దీక్షగా ఆ ఫోటోవంక చూచాను. ఆమెముఖం ఏదో రహస్యాన్ని దాస్తున్నట్లనిపించింది. కాని ఆ రహస్యం మంచిదో, చెడుదో మాత్రం నేను అర్థం చేసుకోలేకపోయాను. ఆమె అందం ఏదో అంధకారాన్ని వెంటబెట్టుకొస్తున్నట్టుంది. ఆమె చిఱుపెదవులపైని నవ్వు అంత మాధుర్యంగా ఉన్నట్లనిపించలేదు.

నా ఈ ఆలస్యాన్ని భరించలేక 'ఏమంటావు?' అని ప్రశ్నించాడు.

"ఇదమిత్థమని చెప్పలేకుండా ఉన్నాను. నన్నెందుకు వేధిస్తావు? ఆవిడగురించి విషయమంతా చెప్పేసెయ్యి" అని ప్రశ్నించాను. నా కొచ్చిన అనుమానాలను బయటకు చెప్పలేదు.

అదోవిధంగా నావంక ఒకసారి చూచి, రెండుమూడుసార్లు అటూ యిటూ పచార్లు చేసి, ప్రారంభించాడు:

ఒకనాడు సాయంత్రం ఐదు అప్రాంతాలకు బాండ్ స్ట్రీటులో పచార్లు చేస్తున్నాను. ఆరోడ్డుమీద బళ్ళు చాల కిక్కిరిసి వుండటంవలన, అసలవి నడవటంలేదేమో ననిపిస్తోంది. రోడ్డుప్రక్కగా వున్న ఒక పసుపురంగు టాక్సీ నాదృష్టి నాకర్షించింది. వెళ్ళి చూచేసరికి లోపల ఈ ఫోటోలోఆవిడ వుంది. టాక్సీ వెళ్ళిపోయింది తరువాత చాలరోజులవరకు ఆ పసుపురంగుటాక్సీ, కనపడుతుందేమోనని చూచాను. కాని నాప్రయత్నాలన్నీ వృథా అయిపోయాయి. ఒకరోజున హోటలులో విశ్రాంతి తీసుకుంటుండగా ఆమె వచ్చి నాప్రక్కగా ఉన్న కుర్చీలో కూర్చుంది. ఏదోవిధంగా పరిచయం చేసుకుందామనే ఉద్దేశంతో—

"నేను మిమ్మల్ని ఈమధ్య బాండ్ స్ట్రీటులో చూచినట్లున్నాను" అని అన్నాను. ఆమె తెల్లబోయి, సన్నని కంఠంతో "గట్టిగా మాట్లాడకండి. ఎవరన్నా వినగలరు!" అని నన్ను మందలించింది. నాందిలోనే ముసురుపడితే, నేను చాల నిరుత్సాహపడ్డాను. చేసేదేం లేక కొంచెంసేపు ఫ్రెంచినాటకాలను గురించి మాట్లాడాను. ఆవిడ నెమ్మదిగా కమ్మని కంఠంతో కొద్దిగా మాట్లాడింది. ఎంతసేపు మాట్లాడినా తనమాటలను ఎవరైనా వినిపోతారనే భయంతో మాట్లాడింది. ఆమెమీద నాకు ప్రేమ కలిగింది. అసలా భయానికి కారణమేమిటో కనుక్కుందామనే ఉత్సాహం నాలో బయలుదేరింది. ఆమె వెళ్ళబోతుంటే నేను తనయింటికి రావచ్చునేమో నని అడిగాను. కొంచెంసేపు అనుమానించి, అటూ యిటూ చూచి, మొర్నాడు సాయంత్రం ఐదుగంటలకు రమ్మంది. తరువాత తెలుసుకుంటే, ఆవిడ ఒక వితంతువని, *Parklane*లో ఉంటోందనీ తెలుసుకోగలిగాను. మొర్నాడు అనుకున్న టైంకు ఆమెయింటికి వెళ్తే బట్లరు ప్రత్యక్షమై ఆమె అప్పుడే బయటకు వెళ్ళిందని చెప్పాడు. నేను చాల నిరాశ చెందాను. బాగా ఆలోచించి మళ్ళీ నేను దర్శనంచేసుకునేందుకు వీలుంటుందేమో నని ఉత్తరం వ్రాశాను. చాలరోజులవరకు సమాధానం రాలేదు. ఇక నా ఆశ పూర్తిగా పోయింతర్వాత "నాకెప్పుడూ యిక్కడకు ఉత్తరాలు వ్రాయివద్దు. ఆదివారంనాడు మాయింటికి వస్తే అవిషయం మాట్లాడుకుందాము" అని ఉత్తరం వ్రాసింది. అనుకున్న ప్రకారం ఆదివారం కలిసాను. కొంచెంసేపు కాలక్షేపం అయింతరువాత బయలుదేరి వస్తుండగా, నా చేతికో యడ్రసు యిచ్చి, అక్కడికి ఉత్తరాలు వ్రాయమంది 'ఎందుకు' అంటే "దానికి కొన్ని కారణాలున్నాయి, నాకు యిక్కడకు ఉత్తరాలు వ్రాయకూడదు" అంది.

తరువాతకూడా చాలసార్లు ఆమెను కలిసాను. కాని ఆరహస్యం ఏమిటో బయటపడలేదు. ఎవరి అధీనంలోనన్నా ఉన్నదేమో ననుకున్నాను. కాని ఆమెస్వభావం నా యీ అనుమానాన్ని పోగొట్టింది. మనం వస్తుప్రదర్శనశాలల కెళ్ళినప్పుడు అక్కడ మనం కొన్ని రాళ్ళను చూస్తూంటాము అవి ఒకొక్కసారి నిర్మలంగానూ, యింకోసారి మసిగానూ కనపడుతూ ఉంటాయి. అలాంటప్పుడు ఆరాతి నిజస్వరూపాన్ని నిర్ణయించలేము. ఈవిధంగానే ఈవిడను గురించి ఒకవిధమైన నిర్ణయానికి రాలేకపోయాను. నాకు ఆమెను వివాహం చేసుకోవాలనే కోరిక ప్రబలతోంది. నన్ను కలసినప్పటి, నాకు వ్రాసే ఉత్తరాలలోని ఆమెప్రవర్తనతో విసుగెత్తిపోయాను. ఆమెలోని ఆ భయం వెరపు...అనుమానం నా కింకా అర్థం కాలేదు.

మొర్నాడు ఆమెను కలుసుకుందామని అడ్డత్రోవను వస్తున్నాను. ఎదురుగా ఆమె ముసుగువేసుకొని వస్తోంది. నన్ను గుర్తించినట్లు లేదు గబగబా నడుస్తూ ఒక మేడలోకి వెళ్తోంది. నేను ఆశ్చర్యపోయి, ఈ విచిత్ర ప్రవర్తనను చూద్దామని మేడదగ్గరకు వెళ్ళాను. ఆమె తొందరగా వెళ్ళడంలో గుమ్మందగ్గర చేతిరుమాల మరచిపోయింది. దాన్ని తీసి దాచాను. ఆమెను అట్లా చూస్తుంటే ఎద్దమనిషితరహా కాదనిపించింది. వెంటనే అక్కడినుంచి వెళ్ళిపోయి ఆసాయంత్రం ఆమెయింటికి వెళ్ళాను. ఆమె సోఫాలో పడుకొని ఏదో మాగజైను చూస్తోంది. నేను రాగానే "రాండి! మీకోసమే ఎదురుచూస్తున్నాను. ఇవ్వాళ యింతవరకు బయటకే వెళ్ళలేదు" అంది. ఆమె అంత ధైర్యంగా అబద్ధమాడుతూంటే ఆశ్చర్యపోయాను. వెంటనే ఆ చేతిరుమాలాను తీసి ఫలానాచోట మరచిపోయావని యిచ్చాను. ఆమె భయంతో నావంక చూచింది కాని, ఆచేతిరుమాలు తీసుకోలేదు.

"అక్కడేం చేయటానికి వెళ్ళావు?" అన్నాను.

"మీ కడగటానికి ఏం అధికారం వుంది?" అని రెట్టించింది.

"నిన్ను ప్రేమిస్తున్నానుగనుక. నిన్ను వివాహంచేసుకుందామనుకుంటున్నాను" అని చకచకా అనేశాను.

ఆమె చేతుల్తో ముఖాన్ని కప్పుకుని ఏడ్వడం మొదలుపెట్టింది.

"నువ్వు నాకు సమాధానం ఏమీ చెప్పలేదు" అన్నాను.

ఆమె లేచి నిలబడి నావంక చూచి "చెప్పవలసింది ఏమీ లేదు" అంది.

"అక్కడ ఎవర్నో కలవటానికి వెళ్ళావు. దాయడానికి ప్రయత్నిస్తున్నావు" అని కోపంతో అరచాను.

ఆమె తెల్లబోయి "నే నెవర్ని కలుసుకోటానికి వెళ్ళలేదు" అంది.

"నిజం చెప్పు!" అని మళ్ళీ ప్రశ్నించాను.

"నిజమే చెప్పాను" అంది.

నేను నమ్మలేకపోయాను. కోపంతో పిచ్చగా చాల వాగేశాను. అక్కడే ఉండటానికి అసహ్యం వేసింది. వెంటనే ఆయింట్లోంచి బయటపడ్డాను. మొర్నాడు నాకు ఆమె ఒక ఉత్తరం వ్రాసింది ఉత్తరాన్ని చింపి చూడకుండానే తిరిగి పంపేశాను. ఆ ఊరుమీదే అసహ్యం కలిగింది. ఓ నెలరోజులపాటు అల్లా తిరిగి వచ్చాను. ఆమెనుగురించి వాకబుచేయకుండా ఉండలేకపోయాను. ఆమెకు సుస్తీచేసి చనిపోయిందని తెలిసింది. నేను ప్రప్రథమంగా ప్రేమించిన స్త్రీ గతించిందని తెలిసేటప్పటికి చాల బాధపడ్డాను. కొన్నాళ్ళదాక బయటకు రాలేకపోయాను.

ఆమెమీద అంత ప్రేమ ఉన్నప్పటికీ నాకా సందేహం తీరలేదు. అందుకని ఒకనాడు, ఆమె చేతిరుమాలు మరచిపోయిన యింటిదగ్గరకు వెళ్ళాను. తలుపు తట్టాను. లోపలనుంచి ఎవరో ఒక వృద్ధస్త్రీ బయటకు వచ్చింది. అద్దెకిచ్చే భాగాలున్నాయేమోనని అడిగాను. ఏవో ఉన్నాయి పైకి రమ్మంది. ఆమెతో పైకి వెళ్ళాను "ఎవరో ఒక ఆవిడ మూడునెలలనుంచి రావడంలేదు. అద్దెకూడ బకాయిపడింది. కాబట్టి మీకు కావాలంటే ఆభాగం యిస్తాను" అంది. నాజేబులో ఉన్న ఫోటోను చూపి "ఈమేనా?" అని అడిగాను.

"అవును. ఆమె మళ్ళీ ఎప్పుడు వస్తుంది బాబూ?" అంది.

"చనిపోయింది" అన్నాను.

ఆ ముసల్ది కంట తడిపెడ్తూ, ఆమె గుణగణాలను పొగడుతూ, ఆభాగంలోకి ఆమె అప్పుడప్పుడూ వచ్చి కూర్చుంటూఉంటుంది అని చెప్పింది. నేను అనుమానంతోనే "యిక్కడ ఎవరినైనా కలుసుకుంటూ ఉంటుందా?" అని అడిగాను.

"లేదు. ఎప్పుడూ ఆమె ఒంటరిగానే వేస్తుండేది" అన్నది.

"మరి ఏం చేస్తుండేది?" అని మళ్ళీ అడిగాను.

"ఏవేవో పుస్తకాలు చదువుకొని, టీ తాగి వెళ్ళిపోతుండేది" అంది.

నేను తెల్లబోయాను. ఆమెవింత అలవాటు విని—అని కథ ముగించాడు మర్చిసన్.

"మరి నువ్వు ఆమాటలను నమ్మావా?" అని నే నడిగాను.

"ఆ, నమ్మాను" అన్నాడు.

"మరి అక్కడకు అమె ఎందుకు వెళ్ళేది?" అని అడిగాను. నా స్నేహితుడు ఒక చిన్న నవ్వు నవ్వి—

"ఆమెకు డిటెక్టివునవలలు చదవటం అంటే యిష్టం. తను ముసుగు వేసుకొని, రహస్యంగా ఆ గదులకు వెళ్తూ తను ఒక కథానాయకి ననుకుంటూ ఉండేది. రహస్యం సింటే ఎందుకనో ఆమెకు చాల సరదా. కాని చివరకు అతిరహస్యం బట్టబయలు అయింది" అని అన్నాడు.

"అంతే నంటావా?" అని అడిగాను.

"అంతే" నంటూ నాచేతిలోని ఫోటోకేస్ తీసుకొని, ఫోటోవంక చూస్తూ "చాల ఆశ్చర్యంగా ఉందికదూ?" అన్నాడు.

వింతలు : విశేషాలు

అసాధారణజంతువు

ఆస్ట్రేలియాలో తక్కినచోట కనిపించని జంతువులు దొరకునట. దానిలో డక్ మోల్ అనున దొకటి. దానికిముక్కు బాతుముక్కు. గుడ్లవరుసా పాములవరుసే; పిల్లను పోషించుటా, జంతువులవలె పాలిచ్చే; నివసించుటా ఎలుకకన్నములాటి సొరుగులో.

బేగ్ డాడ్

వైజాగ్ లో నీటిఎద్దడికేమి ఇది వినూ. పర్షియన్ జలశాఖ పరిసరప్రాంతమున నేలన మంచినీళ్లే లేవట. సముద్రమున ఉప్పునీళ్లు. దూరపు కొండలలో నీరు భూమిక్రిందుగా ప్రవహించి సముద్రములోకి ఊటలతో చిమ్ముతుందట. ఈ ఊటల తావు తెలిసినవారు, తోలుసంచితో సముద్రమున మునిగి, సంచి మంచినీటితోనింపి, పైకొచ్చి, కొనిపోయి బింకాలక్కన అమ్ముతారట!

"వలపర్తి"



గుణాల్ని బట్టే సౌభాగ్యం

శ్రీ మండ నరసింహం

అనగనగా ఒక వూళ్ళో ఒక కోమటి ఉండేవాడు. అతడికి ఇద్దరు పెళ్లాలు. పెద్ద పెళ్ళానికి జానెడు కొప్పు; చిన్న పెళ్ళానికి మూరెడు కొప్పు. అందు చేత కోమటి చిన్న పెళ్ళాన్ని ముద్దుగా చూస్తూ ఉండేవాడు.

ఇలా గుంటూఉండగా వర్తకానికి కోమటి దూరదేశం ఒక ఏడాది వెళ్ళ వలసివచ్చింది. అతడు వెళ్ళిన తర్వాత, ఇంటి అధికారం అంతా చిన్న పెళ్ళాందే. పెద్దదానిచేత ఇంటిచాకిరీ అంతా చేయించేది. తిన్నగా ఇంత తిండైనా పెట్టేది కాదు.

ఒక రోజున తలలో పేలు చూడ మని పెద్ద పెళ్ళానికి ఆజ్ఞ చేసింది. అది పేలు ఏరుతూ ఉంటే పొరపాటున ఒక తలవెంట్రుక ఊడిపోయింది.

అంచేత గొప్ప కోపం తెచ్చుకొని పెద్దపెళ్ళాన్ని తన్ని తలమీద ఒక వెంట్రుకైనా లేకుండా జుత్తు అంతా పీకేసి ఇంటిలోనుండి గెంటివేసింది. ఏ దిక్కూ లేకపోవడం చేత, పులో భూతమో తన్ను మ్రింగివేస్తుంది, అంతతో తన బాధలు తీరిపోతా యను కొని దగ్గ రున్న అడవిలోకి పోయింది.

అడవిలోంచి వెళ్ళుతూ ఉండగా ఒక దగ్గర పత్తిమొక్క ఒకటి కన బడింది. ఆ మొక్కచుట్టూ ఉన్న చెత్త తీసి గొప్పు తవ్వి పాడిచేసి దగ్గర నున్న గుంటలో కొంచెం నీళ్ళు తెచ్చి పోసింది. వెళ్ళగా వెళ్ళగా ఒక అరటి చెట్టు కనిపించింది. దాన్నికూడా బాగు చేసి కొంచెం నీళ్ళు పోసింది. మరి కొంచెం దూరం వెళ్ళేసరికి ఆప్పుల సాల ఒకటి కనబడింది. ఆ సాలలో పేడ, చెత్త తీసి కంపతో శుభ్రంగా తుడి చింది. ఇంకా వెళ్ళగా వెళ్ళగా ఒక తులసిమొక్క కనబడింది. దానికి దం డం పెట్టి నీళ్ళు పోసి పువ్వులు తెచ్చి పూజ చేసింది.

ఆ సమీపంలో ఒక ముని కళ్ళు మూసుకొని తపస్సు చేస్తూ ఉంటే, వాని వెనుక చేతులు జోడించుకొని వినయంగా నిలబడ్డది. కొంతసేపటికి ముని కళ్ళు విప్పి ఆమెను చూచి, ఎదురు గుండా రమ్మని చెప్పి ఆమె ప్రార్థన యేమో చెప్పమన్నాడు. పెద్ద భార్య తన కష్టాలు అంతా వానితో చెప్పి తలనిండా కొప్పు ఇమ్మని ప్రార్థించెను. మునికి దయ కలిగి సమీపంలో ఉన్న చెరువులో ఒకసారి మాత్రమే మునిగిన కొప్పు రాగల దని చెప్పెను. రెండవ పర్యాయము నీటిలో మునిగిన ప్రమా దము వచ్చు ననిగూడ చెప్పెను.

ఆమె భక్తితాత్పర్యములతో ముని చెప్పిన ప్రకారం చెరువులోనికి వెళ్ళి ఒక్కసారి నీటిలో మునుగగానే, పాద ముల నంటుచుండు పట్టుకుచ్చులాంటి నిగనిగలాడు నల్లని కొప్పు పుట్టెను. ఆమె ముసలిరూపము పోయి, నవ యవ్వనవతియై గొప్ప రూప లావణ్యా ములతో మహాలక్ష్మిలాగు తయా రయ్యెను. మిక్కిలి సంతోషముతో తడిబట్టలతో మునివద్దకు వచ్చి నమ

(15 వ పేజీ చూడుడు)

“దూర్వాసుడన్నా మహా కోపిష్ఠు లనీ, వాళ్ళతోటి ఏమి వచ్చినా ప్రాణాంతకమేనని, మామూలుగా విశ్వామిత్రుడి కథ తెలియని వాళ్ళు కూడా అనుకొంటూంటారు. అందుకనే ముక్కోపితనం, వెంకిపట్టుదలా ఉన్న వాళ్ళను విశ్వామిత్రుడనో దూర్వాసు డనో అంటూంటారు. విశ్వామిత్రుడు ఒకప్పుడు చాలా కోపిష్ఠి అయినవాడే. ఆయన తపస్సుచేసి కోపాన్నంతా జయించాడు. అసలు ఆ కోపం కూడ సామాన్యంగా ఎవర్నో ఎవళ్లకో అప కారం చేస్తూంటే చూసి సహించలేక, ఉద్రేకంతో కోపం వచ్చేది. వాళ్ళకు ఉపకారం చెయ్యటానికి ఎప్పటికప్పుడు చేసిన తపస్సు లంతా ధార పోసి మళ్ళీ తపస్సు మొదలుపెట్టేవాడు.

విశ్వామిత్రుడు పుట్టుకచేత ఒక మహారాజుకుమారుడు. గాధిరాజు అనే ఆయన తండ్రి, విశ్వామిత్రుడు పెద్ద వాడవగానే, అతనికి రాజ్యం అప్ప చెప్పి, తాను అడవులకు తపస్సు చేసు కోటానికి వెళ్ళిపోయాడు. విశ్వా మిత్రుడు, చక్కగా తన రాజ్యంలో శాంతి నెలకొల్పుతూ దేశం సుభిక్షంగా, పరిపాలన చేస్తున్నాడు.

తన రాజ్యంలో అంతా సుఖంగా ఉన్నారో లేదో, ఒకసారి దేశమంతా తిరిగి చూద్దామని, పర్యటనకు బయలు దేరాడు విశ్వామిత్రుడు. సైన్యాలు పరివారాలు, రాణీ వాసం, ఉద్యో గులు, నౌకర్లు చాకర్లు, అల్లా మంది మార్బలంతో, బయలుదేరి, పల్లెలు, పట్టణాలు, కొండలు, నదులు, తీర్థాలు, పుణ్యస్థలాలు, ఋష్యాశ్రమాలు అన్నీ చూసుకొంటూ, వసిష్ఠ మహా మునిఆశ్రమానికి వచ్చాడు. ఆ మహామునికి నమస్కారం చేసి కుశల ప్రశ్నాదికాలన్నీ అడిగి “వెళ్ళి వస్తాం మహామునీ! సెలవు” అని వసిష్ఠుల వారికి నమస్కారం చేశాడు.

వసిష్ఠులవారు సుముఖులయి, “విశ్వామిత్ర మహారాజా! మా ఆశ్ర మానికి అతిథివిగా వచ్చావు కాబట్టి, మా ఆతిథ్యం పుచ్చుకొని ఈ పూట ఇక్కడ భోంచేసి వెళ్ళవలసింది” అని అడిగాడు.

విశ్వామిత్రుడు చిరునవ్వు నవ్వి “మహర్షీ! నేను పెద్ద పరివారంతో వచ్చాను. పోసి మా పరివారానికి ఇక్కడ ఆకూ, అలమే తిండీగా పెడదా



“శ

మన్నా కూడ, ఈ ఆశ్రమంలో చెట్లన్న చాలవు. మీరో ఒంటరి వాళ్ళు. ఈ వేలాదిజనానికీ భోజ నాలు ఏర్పాటుచెయ్యటం, మీకు అలవి అవుతుందా.” మీరు ఉండమని మాట అనటంలోనే, మాకు ఆతిథ్యం అంతా అందినట్లు' కాబట్టి, ఏమీ అనుకోకుండి. మేము వెళ్ళివస్తాం” అని వినయంగానే చెప్పాడు.

వసిష్ఠ మహాముని చిరునవ్వునవ్వి 'మహారాజా, మీరు చెప్పినదంతా నిజమే కావచ్చు, అయినా, నేను ఉండ



మని కోర్తున్నా గదా' నా మాట నిరా కరించ వద్దు. పరివారసమేతంగా నే మీ ఆశ్రమంలో భోజనం చేసి వెళ్ళ వలసింది” అని మళ్ళీ ఆహ్వానించాడు.

ఇంకా కాదంటే బాగుండ దని విశ్వామిత్రుడు 'సరే' నని ఆగా ఆగాడే కాని అడవిలో ముక్కు మూసు కొని కూర్చున్న ముని, తన ఇన్నివేల పరివారాని కంతకూ భోజనాలు ఎల్లా అమర్చగలడా అని లోలోపలే అను మానిస్తున్నాడు.

వసిష్ఠమహర్షి, తన పద్దనున్న “శబల” అనే ఆవుని దగ్గిరకు పిలి చాడు. ఆ ఆవు “కామధేనువు” వం శంలోనిది.

బొమ్మల కథ. 2





బల

వసిష్ఠులవారు ఆవును దగ్గిరకు పిలిచి, గంగడోలు నిమురుతూ, మెడ కౌగిలించుకొని, "అమ్మా! విశ్వామిత్ర మహారాజుగారు, పరివార సమేతంగా మన ఆశ్రమానికి అతిథులుగా వచ్చారు. వారి పరివారంలో ప్రతివారికీ చిన్నా పెద్దా అందరికీ— తృప్తిగా పంచభక్ష్యపరమాన్నాలతో భోజనాలు సమకూర్చవలసిందమ్మా" అని అనుమతి ఇచ్చారు.

అందరికీ చక్కని చక్కని ఆకులలో పంచభక్ష్యపరమాన్నాలతో,



సకల విధాలయిన పిండివంటలతో ఎవరికి కావలసినమాదిరిగా వారికి, ఇట్టే భోజనాలు అమర్చింది ఆ "శబల" అనే కామధేనువువంశపు గోవు.

దరూ సంతృప్తిగా సంతోగా, భోజనాలు చేశారు. ముని మహత్యానికీ, గోవుమహత్యానికీ చాలా ఆశ్చర్యపోయారు."

ఇంత పరిపూర్ణంగా, జను లందరికీ, ఆకలిదప్పులు తీర్చే ఆవు, అడివిలో ఒంటరిగా ముక్కు మూసికొని కూర్చున్న మునిదగ్గర ఉండంకంటే, తన వంటి మహారాజుదగ్గిర ఉంటే, ప్రజల కెవళ్ళకూ ఆకలిదప్పులు లేకుండా, తను సత్యం సంతర్పణలు చేయవచ్చును కదా, అని విశ్వామిత్రమహారాజుకు ఆశ కల్గింది. ఆ ఆవును ఎల్లా అయినా మునిదగ్గిర నుంచి సంపాదించాలని, తీవ్రమైన కోరిక గల్గింది.

"మహాముని! ఈ అడవిలో ఈ ఆవు ఉండటం నిరుపయోగం. మీకింత గొప్ప ఆవు ఎందుకు? నేను మహారాజును. ఇల్లాంటి మహత్తర విశేషాలున్న వన్నీ మహారాజుల దగ్గిర ఉండాలి. కాబట్టి మీరు నాకు ఈ ఆవును ఇచ్చివేయవలసింది. దీనికి బదులు మీకువెయ్యి మంచి ఆవులు ఇస్తా"నని బ్రతిమాలి అడిగాడు.

వసిష్ఠులు నవ్వి, "శబల నాకు పుత్రిక వంటిది. నా తపస్సు, నా నిత్యాగ్నిహోత్రాలు, నా సర్వస్వమూ పోషించేది యీ గోవే. ప్రపంచమంతా ఇచ్చినా, నేను నా ఆవును ఇయ్యలేను. అది నా ప్రాణం" అని జవాబు చెప్పాడు.

విశ్వామిత్రుడు, తన ధనరాసు లన్నీ ఇస్తానన్నాడు. నవరత్నాలూ, బంగారమూ, అనేకసంపదలూ అన్నీ యిస్తానన్నాడు. ఆ ఒక్క ఆవును ఇమ్మన్నాడు. కాని వసిష్ఠులు "ఇది నా ప్రాణంలో ప్రాణం. ఏమి యిచ్చినా ఈ ఆవును ఇయ్యను" అన్నాడు.

విశ్వామిత్రుడికి కోపంవచ్చింది.

"మంచిగా అడిగాను. నువ్వు యియ్యలేదు. బలవంతంగా తీసుకుపోతాను. నువ్వు ఏం చెయ్యగలవో చూస్తాను" అని సైనికులచేత "శబల"ను బలవంతంగా తోలుకొని పోవటం మొదలుపెట్టాడు. వసిష్ఠ మహాముని నిర్విణ్ణుడై అల్లాగే చూస్తూ కూర్చొని ఉండిపోయాడు.

రాజభటులు తోలుకు పోతోంటే "శబల" గోవుకు ముందు ఏమీ అర్థం కాలేదు. నా తండ్రి అయిన వసిష్ఠులు నన్ను ఎందుకు ఈ రాజుకు ఇచ్చేస్తారు? నేను ఆయనకు ఏం అపచారం చేశాను. ఆయన నే కనుక్కొంటాను" అంటూ రాజభటులను కుమ్మి తప్పించుకొని, పరుగెత్తి వసిష్ఠ మహామునిదగ్గిరకు వెళ్ళింది. ఆయన ఒళ్ళో తల పెట్టి కళ్ళనీళ్ళు పెట్టుకొంటూ "తండ్రీ! నన్నెందుకు మహారాజుకు ఇచ్చేశావు? నేను ఏమి తప్పు చేశాను?" అంటూ ముని దేహమంతా నాలుకతో తడుముతూ అడిగింది.

వసిష్ఠుడు కన్నీళ్ళు పెట్టుకొని జాలిగా "అమ్మా! నేను నిన్ను ఎవరికీ ఇయ్యలేదు. ఎప్పటికీ ఇయ్యను. నేను ఒంటరివాడిని. ముక్కుమూసుకొనికూర్చొన్న బక్కమునిని. ఆయన మహారాజు. ఎంతో బలగముంది. సైన్యాలున్నాయి. ఆయన బలవంతాన నిన్ను ఎత్తుకొని పోతే, బలహీనుడిని నే నేమి చేయగలను? నిన్ను నాదగ్గిర ఉంచుకోగలిగితే నా కంతకన్న ఏమి కావాలి?" అంటూ పసిపాపను లాలించినట్లుగా ఆ గోవును లాలించాడు.

"ఇంత తపోబలం ఉన్న మీ ముందు, వట్టిసైన్యాలూ, అస్త్రాలూ ఉన్న ఈ మహారాజెంత? మీరు అనుజ్ఞ యిస్తే, విశ్వామిత్రుడి బలంన్నంతా నేను రూపుమాపుతాను. నేను మీవద్దే ఉంటాను" అంది శబల.

వసిష్ఠుడు సంతోషంతో "అల్లాగే కానియ్యమ్మా" అన్నాడు. వసిష్ఠులు ఆ ఆజ్ఞ యిచ్చె టప్పటికి, శబల సంతషంతో, తన దేహంలోనుంచి, అనేక సైన్యాలను పుట్టించింది. ఆసైన్యాలన్నీ విశ్వామిత్ర మహారాజు సైన్యాలతో యుద్ధం చేసి, విశ్వామిత్ర మహారాజుని పూర్తిగా ఓడించాయి.

తన ప్రయత్నం అంతా విఫలమయి, తన సైన్యం అంతా రూపుమాసిపోయి తనకు ఇంత అవమానం కలిగేటప్పటికి, విశ్వామిత్రుడికి రోషం వచ్చింది. "ఛీ మహారాజునై యుండి, ఇంతటి సైన్యబలం ఉన్నా, బలం లేని వాణ్ణే అయిపోయాను. ఈ బలం బలం కాదు. తపస్సు చేసి అస్త్రబలం సంపాదించి వసిష్ఠులవారిని జయించాలి" అని నిశ్చయించుకున్నాడు.

తన రాజ్యాన్ని కొడుకుకు అప్ప చెప్పి విశ్వామిత్రుడు తపస్సుకు వెళ్ళిపోయాడు.

—

బాలగేయాలు

****

శ్రీ సోమరాజుపల్లి చెంచయ్య



రావోయ్ రావోయి—
చందమామా! నీవు—
తాకుంటె—
అలుగుతాను చందమామా!

పొద్దుగూకేసరికి
బడినించి రాగానె
మాయమ్మ బెట్టిన
మంచి మిఠాయిలు

మా దొడ్లో బూసిన
మల్లెమొల్లలన్ని
మాలగట్టితి నోయి
మాలలన్ని మనము

మాధవునకిద్దాము
మాయమ్మ యిచ్చిన
మిఠాయి తిందాము
రావోయి......


వచ్చినప్పటినుండి నీ—
వచ్చుదారిని గాచియుంటె
వక్కసారైనను
వచ్చిపోవయ్యా!
రావోయి......

మా మామ వస్తాడు
మాకు కోడు కేమంచు
మురియుచున్నావోయి—మామా!
మాటదప్పబోకోయ్—మామా!
రావోయి......

పగు లెక్క డుంటావో
పొద్దుగూకేసరికి
పరుగుపరుగున నీవు
పరుగు లెత్తెదవోయి!—
చందమామా!!

తూర్పేపు వస్తావు
పడమరగబోతావు
మరురోజు తూర్పుగ
మళ్ళి వస్తావోయి!—
చందమామా!!

సగమురోజులు నీవు
సొగసుగ వుంటావు
సగమురోజుల్లోను
చిక్కిపోతుంటావు
నీ బ్రతుకు
చావుబ్రతుకుల్లోను
సాగిపోతుందోయి—
చందమామా!!



పిల్లలకథలు:

దైవబలమే బలము

శ్రీమతి పి. వేదవతి

అనగా అనగా ఒక వూళ్లో ఇద్దరు స్నేహితు లుండేవాళ్లు. ఒకడి పేరు రంగయ్య; ఇతను భాగ్యవంతుడు, బలాఢ్యుడు. రెండవ వాని పేరు నాగన్న. ఇతడు సాధారణకుటుంబీకుడు; దైవభక్తి, తృప్తి కలవాడు. వీ రిద్దరు ఒకరి నొకరు ఆదరించుకుంటూ, ప్రేమగా వుండేవారు. కాని ఒక విషయంలోమాత్రం యిద్దరికీ వేర్వేరు భావా లుండేవి. మనుష్య బలమే బలం, మనుష్యు డేది చేయలేడు ? అనే వాడు రంగయ్య. మనుష్యు డెంత ప్రయత్నించినా, దైవ సహాయం దైవబలము లేనిది ఏ పనీ పూర్తి చేయలేడు అనేవాడు నాగన్న.

సరే, యీ విషయంలోమాత్రం వేర్వేరు వుద్దేశా లెందుకు, ఎవరి మాట నిజమో తెలుసుకుందా మని యిద్దరూ బయలుదేరారు.

రంగయ్య ఒక వెయ్యివరహాలు తీసుకుని బయలుదేరాడు. నాగన్న వూరికేనే వచ్చాడు. రెండు మూడు వూళ్ళు చూసి, ఒక వూరిలో కాస్త తెలివైన వాణ్ణి చూసి, రంగయ్య ఆ వెయ్యి వరహాలు వాడి కిచ్చి, "నీ వు దీనితో సరకులు కొని వర్తకం మొదలు పెట్టు, లాభంగా అమ్మి భాగ్యవంతుడివి కావాలి. మేము మళ్ళా ఒక ఆరు నెలల్లో వచ్చి చూస్తాం" అని చెప్పి వెళ్ళిపోయినారు.

కొన్నాళ్లు గడిచి పోయినై. ఇంతలో నాగన్న, రంగయ్య మళ్ళా బయలుదేరారు. ఈ సారి నాగన్న ఒక తాళ్ళ వర్తకుణ్ణి చూశాడు. అతనికి పాపం, చాలామంది పిల్లలు. జనపనార, కొబ్బరినార అల్లి తాళ్ళ వర్తకం చేసుకుంటున్నాడు. అతనుకూడా దైవభక్తి కలవాడు. నాగన్న, రంగయ్య అతనున్న చోటికి వెళ్ళి కొంతసేపు మాటా మంతీ అయింతరవాత, మే మిద్దరం ఇట్లా వాదనపడ్డాం. "నేను నీకీ గాజుపెంకు యిస్తున్నాను. దీనివల్ల నీకేదైనా లాభం కలగాలి. మళ్ళా ఆరు నెలల్లో వస్తాం. దైవము నీకు సహాయపడుతాడు" అని వెళ్ళిపోయినారు.

మళ్లా కొన్నాళ్లు గడిచిపోయినై. ఈ ఇద్దరు స్నేహితులు, తమ పోలం పని పూర్తి అయింతరువాత, మొదట ఒక వెయ్యివరహాలు యిచ్చివచ్చిన అతనివద్దకు వెళ్లి, "ఏం ఎట్లా వున్నావు? వర్తకం సాగుతున్నదా?" అని అడిగారు.

వాడు పాపం దణ్ణం పెట్టి, "ఏమి చెప్పను దేవరా? ఆ వెయ్యివరహాలు నా ఎర్రతుండుగుడ్డలో పెట్టి కట్టి నా నెత్తిమీదపెట్టుకుని సరకులు తేవటానికి పట్నం బయలుదేరాను. దోవలో గద్ద ఒకటి మాంసం అనుకునేమో, ఆ ఎర్రగుడ్డతోపాటు ఆ వరహాలు తీసికొని ఆకాశంలోకి ఎగిరి పోయింది. చేసేది లేక వెనుకకు తిరిగి వచ్చాను" అన్నాడు.

వీళ్లిద్దరు కొంతసేపు విస్తుపోయి "పోనీలే, మళ్లా యిస్తాను. యీమాటు కొంచెమే యిస్తాను. ఈ వూళ్లో నే సామాను కొని కొట్టు పెట్టుకో" అని చెప్పాడు రంగయ్య. ఇద్దరు స్నేహితులూ వెళ్లిపోయినారు.

కొన్నాళ్లు గడిచింతరువాత మళ్లా యిద్దరు స్నేహితులూ బయలుదేరి, డబ్బిచ్చినవాడిదగ్గరకే మొదట వెళ్లారు. మళ్లా ఏడుపుమొహంతో కనపడ్డాడు. "ఏం సంగతి" అని అడిగారు. "ఏం చెప్పను? ఆరోజు మంచిది కాదని, మరునాడు సరకులు కొందా మని, మీ రిచ్చిన డబ్బు ఒక కుండలో పోసి పైన జొన్నలు పోశాను. మూత పెట్టాను. కోమటి వూరిలో లేడు; రాగానే కావలసినవి కొని కొట్టు పెడదా మనుకున్నాను. ఒకరోజు నే నింట్లో లేను. ఎవరో వచ్చి జొన్నలు అడిగితే కుండ తను ఎత్తలే నని నా కూతురు వాళ్లనే తీసికెళ్లమని యిచ్చినది. మళ్లా పోయినై. ఏం చేయను?" అని విచారపడ్డాడుట.

రంగయ్యకు విసు కెత్తి "సరే, ఇక పీడవ వదిలేద్దాం. నీ తాళ్ల వర్తకుణ్ణి చూద్దా"మని, ఆపల్లెటూరు బయలుదేరి వెళ్లి ఇదివరకు ఆ పూరిల్లు వున్న వేపు వెళ్తే అక్కడ పూరిల్లు లేకపోగా, ఒక మేడ, తోట, పూలమొక్కలు, కనిపించినై. తప్పుదోవన వచ్చామేమో అనుకుంటూ, అయినా తెలుసుకుందా మని ఆచుట్టుపట్ల వున్న వాళ్లని "యిక్కడొక తాళ్లవర్తకు డుండాలి. ఏ వూరైనా వెళ్లిపోయాడా?" అని అడిగారు.

వా ళ్లన్నారు: "ఏవూరూ వెళ్లలేదు. ఆమేడ వారిదే. ఇప్పుడు ధనవంతుడైనాడు" అని చెప్పారు.

ఇంతలోనే ఆ వర్తకుడే బయటికి వచ్చాడు. వీళ్లిద్దర్నీ చూసి నమస్కరించి లోపలికి తీసికెళ్లాడు. కాళ్లూ చేతులూ కడుక్కోమని పళ్లూ పాలూ ఫలహారమిచ్చాడు. వా ళ్లవి తింటూ ఉండగా అతనే చెప్పటం మొదలుపెట్టాడు:

"మీ రిచ్చిన రంగుగాజుపెంకు నేను లెక్కచేయలేదు. కాని దానిని మంత్రించి యిచ్చా రనుకొని నాభార్య దాని నొక గూటిలో పెట్టినది. 2, 3 రోజులైంతర్వాత ఒక జాలరివచ్చి, 'వల చిక్కు పడ్డది, చిక్కు తీసుకుని యిస్తాను. మీ కొక చేపకూడా యిస్తాను' అని అడిగి తీసికెళ్లి, సాయంకాలం పెద్ద చేప తెచ్చియిచ్చి, 'మీ గాజుపెంకు చిక్కుతీసుకు నేందుకు వీలుగా వున్నది. వల తెగకుండా వచ్చింది. కనుక నా కది యివ్వండి. ఇది సముద్రంలో పట్టిన చేప. మీకు రెండురోజులు కూరకు వచ్చును?' అని చెప్పాడు. పోనిమ్మని యిచ్చేశాం. నా భార్య కూర చేయటానికి దాన్ని తరగగా దానిపొట్టలోనించి ఒక రాయి యివతల పడ్డది. అదేదో గవ్వవంటి దనుకొని కడిగి తుడిచి పిల్లలకు ఆడుకోమని యిచ్చింది. దీపాలవేళ కాగా దీపందగ్గర కూర్చుని ఆడుకుంటుంటే అది మెరిసింది. అది చూసి పిల్లలు వింతపడి దానిని జాగ్రత్తగా రోజూ తుడిచి దీపందగ్గర ఆడుకోటం మొదలు పెట్టారు. రోజురోజుకి శుభ్రపడ్డకొద్దీ కాంతి కలిగిన రా యయింది. మేము దానిని జాగ్రత్తచేసుకుంటూవచ్చాము.

"ఒకరోజున ఒక వజ్రాల వర్తకుడు, దాహ మని వచ్చి, మాటలసందడిలో దీనిని చూశాడు. అమ్మమని అడిగాడు. 'నా పిల్లల కిది ప్రాణం; మేము దీపం వలె వాడుకుంటున్నాము, యివ్వ' నన్నాను. "దీనిని అమ్మితే నీ పిల్లలకు కావల్సినన్ని దీనాలు కొనవచ్చు. చదువు చెప్పించవచ్చు, పెళ్లి చేయవచ్చు. లేకపోతే, ఎవరైనా ఎత్తుకుపోతే అప్పుడు విచారిస్తా' వన్నాడు. సరేనని ధర అడిగితే మొదట కొద్దిగా జెప్పి, యివ్వనంటే పెంచిపెంచి పదివేల రూపాయలకు అమ్మాను. ఆ డబ్బుతో యింతవా ణ్ణయినాను. ఇదంతా మీ రిచ్చిన గాజుపెంకువల్లే జరిగింది. ఇప్పుడొక కొబ్బరితోట కొనబోతున్నాను. చూద్దాంరండి" అని వా ళ్లిద్దర్నీ తీసికెళ్లాడు.

తోట చూశాక "ఎండగా వున్నది, కాసిని కొబ్బరినీళ్లు తాగుదా" మని నాగన్న కొబ్బరిచెట్టు ఎక్కి కాయలు కోస్తుంటే ఆ కొబ్బరిమట్టలో ఒక మూట కనుపించింది, తీసి చూస్తే మొదట రంగయ్య ఇచ్చిన వెయ్యి వరహాలూను అవ్వి. తాళ్ల వర్తకుడు చెప్పిన కథకే వింత పడుచున్న రంగయ్య సెలవు తీసికొని నాగన్నతో తను డబ్బిచ్చినవానిదగ్గరకు వెళ్లి ఈ జరిగిందంతా చెప్పాడు. ఆ డబ్బు చూసి "యీ మాటన్నా జాగర్తగా వుండగలవా?" అన్నాడు. వాడు వద్దుబాబూ అంటుండగా, జొన్నలు కొన్నవాళ్లు కుండతోసహా తెచ్చి "ఏమయ్యా, అన్నీ పుచ్చు జొన్నలుయిచ్చావు? మాడబ్బు వూరికే వచ్చిందా?" అని, మాడబ్బు మాకియ్యమని తొందరపెట్టి కుండ జొన్నలు యిచ్చి డబ్బు తీసికెళ్లారు. జొన్నలు కిందపోయగా, రంగయ్య యిచ్చిన డబ్బు అందులో అడుగునే వున్నది. ఇదంతా దైవాయత్తమే నని ఒప్పుకుంటూ తన స్నేహితుడు నాగన్న చెప్పే, మాట లే నిజ మని ఒప్పుకున్నాడు రంగయ్య. ఆ డబ్బు అతని కిచ్చి వర్తకం చేసుకోమని స్నేహితు లిద్దరు ఇళ్లకూ వెళ్లిపోయినారు.

కథ కంచికీ మనం యింటికీ.

ఊఁ కొట్టినవారికి ఉంగరాలు; కథ చెప్పినవారికి కంకణాలు.

తేలు-సాధువు

'రవి'

గంగానదీతీరమున 'సుల్తాన్‌గంజి' యను నొక పట్టణము గలదు. నదీ ప్రవాహము నాని బహుసుందరమగు శివాలయ మొండు గలదు. నిత్యము నదిలో స్నానముచేయుట కచ్చట కనేకమంది ప్రజలు వచ్చెదరు.

ఒకనా డొక సన్యాసి నదిలో స్నానము చేయుచుండెను. అతనిదాపుననే మరికొందరు స్నానము చేయుచుండిరి. ప్రవాహము మహా వేగముగా నుండెను. ఈసమయమున చచ్చుటకు సిద్ధముగా నున్న తేలు నీటిపై తేలుచూ సన్యాసిసమీప మునకు వచ్చెను. దానిని చూచుటతోడనే సాధువునకు దానిపై దయ గలిగి దానిని రక్షించవలె నని తలచి వెంటనే దానిని తన అరచేతిలోనికి తీసుకొని వొడ్డునైపునకు రాసాగెను. తేలు కొండితో సన్యాసిచేతిని బాగుగా కుట్టెను. సన్యాసిచేయి వణకిపోయెను. చేయి వణకుటతోడనే తేలు నీటిలోబడి మునిగిపోసాగెను. వెంటనే సన్యాసి మరల దానిని తనచేతిలోనికి తీసుకొనెను. తేలు మరల కుట్టెను. సన్యాసిచేయి మరల కంపించెను. తేలు మరల నీటిలో బడెను. సాధువుమరల దానిని తన చేతిలోనికి తీసుకొనెను. తేలు మరల కుట్టెను.

ఈవిధముగా అనేకపర్యాయములు జరిగెను. నదివొడ్డుననున్న మనుష్యులాశ్చర్యముతో యీతమాషా చూచుచుండిరి. అందొకడు సాధువుగారి నిట్లని అడిగెను:

"స్వామీ, తేలు కుడితే మీకు నొప్పి లేదా?

సాధు: ఎందుకు? లేదూ' మనుష్యుడు: నొప్పివుంటే మీరు దానిని మాటిమాటికి యెందుకు తీయుచున్నారు? తేలు కుట్టటం దాని స్వభావమనేదికూడా మీకు తెలియదా?


సాధు: నాకు తెలుసును. ఈ చిన్న జంతువు చచ్చిపోయే సమయములో గూడా దాని స్వభావాన్ని విడిచిపెట్టనప్పుడు యింత పెద్దమనుష్యుడనైన నేను నా స్వభావాన్ని యెందుకు విడిచి పెడతాను?

మను: మనుష్యుని స్వభావమేమిటి? తేలు కుడితే వోర్చుకొనుట మనుష్యస్వభావమా ?

సాధు: కాదు. మనుష్యుని స్వభావము, సమస్తజీవులయందు దయ గలిగి వుండుట. ఎటువంటి కష్టములనైనను సహించి దుఃఖపడే జీవుల దుఃఖమును పోగొట్టుట మనుష్యస్వభావము.

తేలు కుడుతున్నప్పటికీ దానిని సహించి సన్యాసి దానిని వొడ్డునకు తీసి రక్షించినాడు.

(ఉరుదునుంచి.)



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

౩౧

అన్నమాచార్యరచన : (సం. ౪; ౨. ౧౭౦)

సామంతరాగం - రూపకతాళం

[పల్లవి]

౧) , సే సే సే సే ని నీ | , ప ధ ప ధ ప మ గా మ | , గ మ ప ధా ప ప | ప ధా ప మ గ రి గా
ది మ్మ రి గా కే ల మా ను ధీ రు డై న నో నే టి
, గ మ ధ ప మ గ గ రి గ రి గ రి గ మ గ రి స ని | నీ స రి గా గ | మా , , , గ మ
తి మ్మ డు తా లో క మె ల్ల ది రు గా డు వా డు

౨) ప ని సే సే సే ని రీ సే సే ని | నీ ప ధ ప ని సే ని ధ ధ ప మ | గా గ మ ప ధా ప ప మ | గ మ ప ధా, ప మ ప మ గా
ది మ్మ రి గా కే ల మా ను ధీ రు డై న నో నే టి
, గ మ ధ ప మ ప మ గ మ గ రి గ మ ప మ గ గ రి స ని | నీ స రి గా మ పా ప మ గ మ ప , ని
తి మ్మ డు తా లో క మె ల్ల ది రు గా డు వా డు

౩) సే రీ సే సే సే ని సే రీ గే మే గే రీ సే సా గే రీ రీ సే సే ని | నీ ప ధ ప ని సా ని ధ ని సా , రీ స ని ధ ధ ప ప
ది మ్మ రి గా కే ల మా ను ధీ రు డై న నో నే టి
మ గ గ మ ప సే ని ధా ప మ గ మ ప ధ ప మ గ రి స ని | నీ స మ గా మ పా ప మ గ రి స మ గ మ || ప ని
తి మ్మ డు తా లో క మె ల్ల ది రు గా డు వా డు (దిమ్మరి)

[చరణం]

, గ మ పా ప పా , పా మ | మ గ మ ప ధ ప మ గ గ మ ప మ గా
తో ర మై న ము త్యా ల తో ళ సి పూ స ల పె ద్ద
గ రి గ మ ప ధ మ ప మ గ రి ప మ గ రి ప ని నీ | , స స ప మ మ గ గా మా , , , ,
పే రు త న యు ర ము పై బె ట్టి న వా డు
, స ప పా మ ప ధ ధ ప సే సే ని | నీ సే సే సే ని సే రీ గే మే గే రీ సే గే రీ సే సే ని నీ
గా ర వం పు ప చ్చ ప ట్టు గ ట్టి న వా డు వొ
, ప మ గ మ ప ధా ప ప ని స ని సే రీ సే ని ధ ధ ప మ | గా గ మ ప ధ మ ప గా మ ప మ గ రి స ని స రి గ మ ప
య్యా ర పు గొ తె త ల గూ డా డి న ట్టి వా డు
ధ ని (దిమ్మరిగా)

ఇట్లే క్రింది చరణములు :

(౨) పెలిచుట్టు దలవాడు - పెద్ద పెద్ద కన్నుల
వాలుజూపుల సిరికి - వలచువాడు;
జాలిబెట్టి లోకమెల్ల - జట్టిగొన్నవాడు తా
నేలనుండి మింట బాఱ - గాలు చాచువాడు॥ (దిమ్మరి)

(౩) కొండ మోచినట్టివాడు - కొండ వేల నెత్తువాడు,
కొండంత రాకాసుల - గొట్టినవాడు;
కొండవంటి దొరయైన - కొండల కోనేటివాడు,
కొండమోపరుల నెల్ల - గూడబెట్టినాడు॥ (దిమ్మరి)

లఘుటీక : వేంకటేశ్వరుని శృంగారస్వచ్ఛందమును అతని యమేయశక్తి కారణముగా సమర్థించుచున్నది పదము. దిమ్మరి=స్వేచ్ఛాచారి; పచ్చపట్టు=పీతాంబరము; పెలిచుట్టుదలవాడు=పికిలిపిట్టఈకలు చుట్టిన తల గలవాడు. ఈ పట్టు నేను చూచినది గాదు. 'పెలి' యనగా నెమలితోకగఱికే కన్నడమందు వ్యవహారము; తమిళులో నెమలిఅనే అర్థము. ఇక్కడగూడా అదే అర్థమైతే శ్రీకృష్ణమూర్తియైన తిరువేంకటేశుడు 'బర్హిబర్హావతంసకు' డగుట న్యాయమగును; వాలుజూపులసిరికి=పదనైన కన్నులు గల లక్ష్మికి; జాలిబెట్టి... వాడు=దయాపాత్రముగాజేసి లోకమంతా స్వాధీనపరచుకొన్నవాడు; నేలనుండి...వాడు=త్రివిక్రమాకారమున ఆకాశమును పాదముతో నాక్రమించినవాడు; కొండమోచినట్టివాడు=కూర్మావతారమున మందరము మోచినవాడు; కొండ వేలనెత్తువాడు=గోవర్ధనధారి; కొండమోపరులనెల్లగూడబెట్టినాడు=(సేతుబంధమునకై) కొండలు మోసి తెచ్చిన కపులను గుంపుగట్టినవాడు.

గుణాల్ని బట్టే సౌభాగ్యం


(12-వ పేజీ తరువాయి)

స్కరించి నిలబడెను. మునికూడా దీవించి పంపివేసెను. ఆమె ఇట్లు వచ్చుచుండగా తనుపూజచేసిన తులసిచెట్టు ఒక తులసిదళ మామె కిచ్చెను. ఈ దళము నామె తల కొప్పున పెట్టుకొనగా ఒంటినిండ బంగారు నగలు వచ్చెను. మరికొంత దూరము రాగా ఆవుల సాలలో ఆవు కనబడి ఆమెకొక బుట్ట నిచ్చెను. ఆ బుట్ట దులుపు నప్పుడెల్ల ముత్యాలు, వజ్రాలు, రత్నాలు కుప్పలుగా పడుచుండును. ఇదే కాక ఇంటికి చేరిన తర్వాత తన భర్త ప్రేమతో ఆదరించునని కూడ వర మిచ్చెను.

ఆ తరువాత అరటిచెట్టు కనబడి ఆమెకు తన ఆకొకటి కోసి యిచ్చి ఈ ఆకు పరిచినప్పుడెల్ల పంచభక్ష్య పాయసములు సంసిద్ధము గును అని చెప్పెను. బుట్ట, అరటి ఆకు పట్టుకొని వస్తూఉండగా పత్తిచెట్టు ఆమెను నిలబెట్టి ఒకకొమ్మను దూలించుమని చెప్పెను. దులుపగానే శ్రేష్ఠమైన పట్టుచీరలు రవికెలు తన ఒడిలో పడెను. ఆ బట్టలను ధరించి తేనకన్నను మించిన చక్కని చుక్క యయ్యెను. పత్తిచెట్టు తన కొమ్మ నొకదానిని ఆమె కిచ్చి దాని దులిపినప్పుడెల్ల కోరిన బట్టలు రాలుచుండు నని చెప్పెను. ఈ వస్తువులన్నియు బుట్టలో వేసికొని పెద్దపెళ్ళాము ఇంటికి వచ్చునరికి చిన్న భార్యకు మితిమీరిన ఆశ్చర్యము అసూయకూడ కలిగెను. బోడితలపై యింత పెద్దకొప్పు ఎట్లు కలిగెనా అని ఆశ్చర్యముతో నామె నడుగగా పెద్దపెండ్లము అనుభవవృత్తాంతమును చెప్పెను.

తానుకూడ పెద్ద కొప్పు సంపాదించవలె నని కోరిక కలిగి మునిని ఒకరోజున దూడకోరెను. త్రోవలో కనబడ్డ పత్తిచెట్టు, అరటిచెట్టు, ఆవుల సాల, తులసిచెట్టు వీటిని లక్ష్యము చేయక మునికి యెదురుగట్టు నిల్లబడెను. వానికి నమస్కారము చేయక నే తనకు పెద్ద కొప్పు దయచేయవలసిన దని కోరెను. మునియు నామె గుణము గ్రహించి చెరువులో ఒకసారి మాత్రమే మునుగు మని చెప్పెను. ఆమె అట్లు చేయగా పెద్ద కొప్పు వచ్చెను. రెండవసారి మునిగిన, మరింత పెద్ద కొప్పు రాగల దని తలంచి తిరిగీ మునిగెను. ఉన్న కొప్పంతయు ఊడిపోయి చలిమిడిముద్దలాంటి బోడిగుండు తయారయ్యెను.

ఏడ్చుకొంటూ ఆమె మునివద్దకు పోయి బ్రతిమాలుకొనెను. తన మాట వినలేదని కోపముచేత మునియు ఆమెను పొమ్మనెను. చేయునది లేక తిన్నగా ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చెను. భర్తకూడ అంతకు మున్నే వచ్చి పెద్దభార్యతో సుఖముగా నుండుట [illegible] వానితో సమస్తము చెప్పెను [illegible] తుదకు సెట్టియు పెద్దపెండ్లమును బోడిపెళ్ళాన్ని వారివద్దనే సగౌరవముగా నుంచుకొనిరి.



విద్యార్థులలో దర్శకుడు, రంగనిర్మాతా ఇద్దరూ కూర్చొని "షీ స్టూప్స్ టు కాంకర్" అనే గోల్డుస్మిత్ నాటకంలోని "మద్యశాల" రంగం నిర్మిస్తున్నారు.

"యేల్" విశ్వవిద్యాలయ నాట్యకళాశాల

జస్టిస్ గార్వుడ్

యూరప్‌లో, నాటక కళాశాలలను, నాటకం థియేటర్లతో జోడించి ఉంచటం అలవాటు. కాని అమెరికాలో ఈ నాటకకళాశాలలు నాటకం థియేటర్లతో కలిసి ఉండటం అరుదు. అల్లా కలిసిఉన్నవి బహు కొద్ది. కాలిఫోర్నియాలోని, 'పాసాదినా కమ్యూనిటీ ప్లేహౌస్,' "సమ్మర్ థియేటర్" అప్రెంటిస్ సంఘాలు, పెన్సిల్వేనియాలోని హెడ్జ్‌రో థియేటరు, ఇల్లాటివి కొద్దిచోట్లలోమాత్రమే, నాటకంహాలూ నాటకవిద్యాశాలా మిళితమయి ఉన్నాయి. ఇవి మినహాగా తక్కిన అమెరికన్ థియేటర్లులోనూ, నాటకకళా శిక్షణ అంటూ విద్యార్థులకు ప్రత్యేకశిక్షణ లేదు. అందుచేత, నాటక శిక్షణశాలలు, నాటకం కంపెనీలకు వేరుగా, విడివిడిగా చాలా ఏర్పడ్డాయి. "నాటకాలను" గురించి సర్వస్వమూ, విద్యార్థులకు తెలియబరిచేందుకు ఇవి ప్రయత్నిస్తాయి. నటకులనూ 'నాటక రచయితలనూ, తదితర నాటక వృత్తులవాళ్లనూ తయారుచేయటానికి తగిన శిక్షణను ఇచ్చేందుకు, ఈ థియేటరుస్కూళ్లు ప్రయత్నిస్తాయి. ఒక్కొక్కప్పుడు, కొత్త కొత్త నటులు, నాటకకారులు, మొదలైనవార్ని థియేటర్లవాళ్లు ఈ విద్యార్థులలోనుంచే ఏరి, తమ ప్రదర్శనాలకు నూత్నాకర్షణ కల్గించేందుకు ప్రయత్నిస్తుంటారు.

'అయితే ఈ శిక్షణకేంద్రాలవారంతాకూడా, "నాటకరంగం" విద్యార్థిలోని ప్రతిభకు అనంతమైన అవకాశం ఇచ్చే రంగమైనా, ఓపట్టాన అక్కడ ప్రవేశమూ, పేరూ దెచ్చుకొని, జీవితాధారంగా చేసుకోగల్గటం బహుప్రయాసయుతమైన పనే అని ఆ విద్యార్థులకు నచ్చచెపుతూనే ఉంటారు.

అమెరికా విశ్వవిద్యాలయాలు కళాశాలలలో దాదాపు అన్నిటిలోనూకూడా, "నాటకశిక్షణ" శాఖ అని ప్రత్యేక అభిమానశాస్త్రశాఖ ఉంది. ఈ శాఖలో విద్యార్థులకు, పూర్వచరిత్రపాఠాలు, నాటకాల రమ్యతను హర్షించవలసిన విధానము, అందుకు తగిన రసజ్ఞత్వము, మొదలైన శిక్షణలియ్యటమేకాకుండా, విద్యార్థి సంఘాలు, నాటకాలు, ఉత్సవాలు తమంత తాము జరపటానికి, సలహాలు సహాయాలూకూడా ఇస్తూంటారు. కాని, "నాటకరంగం" వృత్తిగా చేసుకొని బ్రతుకటానికి తగ్గ శిక్షణ ఇచ్చే కళాశాలలు అట్టే అంతగా లేవు.

'విస్కాన్సిన్,' 'నార్త్‌వెస్టర్న్,' విశ్వవిద్యాలయాలలో "నాటకం" ప్రత్యేక అభిమానశాస్త్రంగా చేసుకొని, చదువు చాలామటుకు దానిమీదికే కేంద్రించి, శిక్షణ నందేందుకు తగిన 'అవకాశాలు మిక్కుటంగా ఉన్నాయి. కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫర్డు విశ్వవిద్యాలయంలో బహుప్రశస్తమైన "థియేటర్ వర్కుషాప్"(నాటక రంగానికి కావలసినవస్తువులన్నీ తయారు చేయటానికి అనువైనది) ఉంది. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో, నాటకం, సినిమా, రంగాలు, రెండింటిలోనూ శిక్షణ నందేందుకు ఉపయుక్తమైన(?), థియేటరూ, వర్కుషాపూ రెండూ ఉన్నాయి. వాషింగ్టన్ కాథలిక్ విశ్వవిద్యాలయంలోని, నాటకం థియేటరు అమెరికాలో ప్రశస్తమైన థియేటర్లలో ఒకటిగా నిలుస్తూ అతి ఆధునికమైన తయారీలో ఉంది. "నాటకశిక్షణ"లో ఈ యూనివర్సిటీదే ప్రథమస్థాన మనవచ్చును. రంగస్థలం నిర్మాణం, అలంకరణం, లైటింగ్, డైరెక్టింగ్, మొదలైన శాఖలలో శిక్షణనందిన విద్యార్థులను వృత్తిలోవున్న పెద్దపెద్ద థియేటర్లవాళ్లుకూడా, వెంటనే ఉద్యోగాలలోకి తీసుకొంటున్నారు.

జార్జి పియర్సు బేకరు 1925లో స్థాపించిన శాఖా పీఠము

ఇల్లా శతాధికంగా ఉన్న కళాశాలలూ, విద్యాలయాలూ, అన్నింటిలోకీకూడా, కానెక్టికట్ రాష్ట్రం న్యూహేవెన్‌లోని "యేల్" విశ్వవిద్యాలయానికి చెందిన "స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్సు నాటకశాఖ" విద్యాశాల ప్రముఖంగా చెప్పుకోవలసిన శిక్షణకేంద్రము. ఈ శాఖను 1925 లో, కీ. శే. జార్జి పియర్సుబేకరు, అనే ప్రసిద్ధుడయిన ఉపాధ్యాయుడు స్థాపించాడు. ఈయన "నాటకరచన"లో విద్యార్థులకు అనేకసంవత్సరాలనుంచీ శిక్షణ ఇస్తుండేవాడు. 1925లో "యేల్" విశ్వవిద్యాలయంలో "నాటకశాఖకు" అధ్యాపకు డయ్యాడు.

విద్యార్థులకు పాఠాలు చెప్పటం ప్రారంభించిన కొత్తలోనే, కేవలం "నాటకాలమీద విమర్శలు, నాటకరచనలోని మెళుకువలు విద్యార్థులకు బోధించటం చాలదనీ, ప్రత్యక్షంగా నాటకరంగమూ, రంగానికి కావలసిన వస్తువులన్నీ విద్యార్థులే తయారుచేసుకొనే కర్మాగారమూ ఉండాలనీ, నిర్ణయానికి వచ్చాడు. యూరప్ అమెరికాలలోని, నాటకశాలలను, నాటకరంగాలను, స్వయంగా చూసి, చాల నాళ్లుగా ఆవిషయంలో చాలా తీవ్రమైన కృషి చేస్తూ వచ్చాడు బేకరు. యేల్ విశ్వవిద్యాలయంలో నాటకశాస్త్రఅధ్యాపకునిగా నియమిస్తూ విశ్వవిద్యాలయాధికారులు అతనికి, ఆశాఖను అభివృద్ధిచేయటానికి పరిపూర్ణమైన అవకాశం ఇచ్చారు

"నాటకరంగ" ప్రవీణుల సహాయంతో మరుసటి సంవత్సరానికే, బేకర్, "యేల్ యూనివర్శిటీ దియేటర్" అని పేరున నాటకంహాలు నిర్మించాడు. నాటకంహాలూ, నాటకపాఠశాలా రెండూకూడా ఒకదాని కొకటి దోహదంగా అప్పటినుంచీ వృద్ధిపొందుతూ వచ్చాయి.

బి. ఏ. ప్యాసయిన విద్యార్థులను, యం. ఏ. చదువుకు ఈనాటక శాఖలో చేర్చుకొంటారు. 165 మంది విద్యార్థులవరకూ ఈక్లాసులో స్థానముంటుంది. నాటకరచన, దర్శకత్వం, నటన, రంగస్థల నిర్మాణం, రంగస్థల అలంకరణం, లైటింగ్, సీనరీ కాస్ట్యూముల డిజైనింగ్, నాటక ప్రదర్శనవిధానం, నాటకచరిత్ర, నాటకవిమర్శ, ఈ యీ విషయాల్లో దేన్లోనైనా వారు యం. ఏ. డిగ్రీని పొందవచ్చును. ఈ చదువు మూడు సంవత్సరాలు. మొదటి సంవత్సరం "నాటకరంగానికి" సంబంధించిన సర్వవిషయాల్లోనూ పరిచయం ఏర్పరుచుకొంటారు. చివరి రెండేళ్లల్లోనూ, తమ అభిమానవిషయం ఎన్నుకొని, దాంట్లోనే ప్రత్యేకకృషి చేస్తారు. నాటక చరిత్ర, నాటకస్వరూపము, లక్షణశాస్త్రము మొదలైనవి పాఠాలుగా చదువుచెప్పటం, చాలా స్వల్పంగానే ఉంటుంది. అంటే అవే అభిమానశాస్త్రాలుగా తీసికొన్న విద్యార్థులకు తప్ప, నాటకాలు విషయం చదవటంకంటే, నాటకం ప్రదర్శించగల్గటం విషయంమీదే శిక్షణ ఎక్కువగా కేంద్రీకరింపబడి ఉంటుంది.

అమెరికాలోని పెద్దపెద్దనాటకం థియేటర్లు అన్నీ న్యూయార్కుపట్టణంలో ఉన్నాయి.


(21-వ పేజీ చూడుడు)

చలనచిత్ర సమీక్ష:

గృహస్థి

సులోచన ఛటర్జీ, శారద, యాకూబ్, మసూత్ మొదలైనవారు నటించిన, ఆయినా పిక్చర్సువారి హిందీ చిత్రం. దర్శకుడు యస్. యమ్. యూసఫ్. కథకుడు ప్రభులాల్ ద్వివేది. సంగీతదర్శకుడు గులాం మహమద్. 10వ తేదీ శుక్రవారంనుంచి సాగర్‌లో ప్రదర్శించబడుతోంది.

బొంబాయిలో ఇరుగు పొరుగునున్న మూడు సంసారాలకథ. చాలీ చాలని మాసవేతనాలు భర్తతెస్తుంటే, సంసారం సుఖప్రదంగా నెరపడం గృహిణిపైన ఆధారపడిఉంటుం దని నిరూపించడం కథకుని ఆశయం. పొదుపు నేర్చి, సంసారాన్ని ఉన్నంతలో చక్కదిద్దడం తెలిసినది 'గీత' (సులోచనా ఛటర్జీ). ఆమెపట్ల తలో విశ్వాసం గల భర్త 'సుందర్'(యాకూబ్) ఆమెగీసిన గీటు దాటడు. వన్నెల విసనకర్ర 'మోహన' (కులదీప్)కు లోబడిన ఆమెభర్త కమల్ తల్లినీ చెల్లెలినీ కూడా ఆదరించడు. శక్తికిమీరిన ఖర్చులతో ఇల్లు గుల్లచేస్తున్న భార్యను కాదనలేక, తల్లిని చెల్లెలిని ఇక్కట్లు పాలుచేసి తాను ఉద్యోగంలో వంచితుడై చివరికి తన తప్పిదాన్ని గ్రహిస్తాడు. మూడో సంసారం ముఫత్‌లాల్, జమున. జమున పల్లెటూరి పిల్ల. ఇంగ్లీషు నేర్వాలనీ, షోకుచేసి తిరగాలనీ బలవంత పెట్టే భర్తను తిరస్కరించి గీతవద్ద సుఖజీవన విధానం నేర్చుకుంటుంది జమున. చివరిరెండు సంసారాల కష్టసుఖాలలో పాలు తీసుకుని గీత, సుందర్ చివరికి వారి నెలా ఉద్ధరించినదీ చూపుతుంది ఈ చిత్రం.



ప్రపంచదేశాలలోని రంగస్థలాలతీరులు, అక్కడి నాటకరంగ చరిత్ర మొదలైనవన్నీ విద్యార్థులు నేర్చుకొంటారు. నాటకశాలమ్యూజియంలో, విద్యార్థి, ఇతర రంగస్థలాల చిత్రాలను గీసికొంటున్నాడు.



"కంపానియన్సు ఆఫ్ ది లెఫ్టు హాండు" అనే నాటక ప్రదర్శనానికి విద్యార్థులు రంగస్థలనిర్మాణం పూర్తిచేసుకొంటున్నారు.

శ్రీ కాళహస్తి మాహాత్మ్యము - కొన్ని విశేషములు

(10-వ పేజీ తరువాయి)

వ్రాతప్రతులకుముద్రణములలో కొంత వ్యత్యాసమున్నట్లు కానవచ్చుచున్నది. ద్వితీయముద్రణమున సంస్కరింపబడిన పాఠములకంటె వ్రాత ప్రతులలోని పాఠములే కొన్ని యుపాదేయములయి యున్నవి. ఏతద్గ్రంథముద్రణమున కాధారమని తొలికూర్పు పీఠికలో చెప్పబడిన 'బ్రౌన్ దొరగారిచే సేకరింపబడి, కడు హెచ్చరికతో వ్రాయింపబడిన' ప్రతియందే కొన్ని చక్కని పాఠములు కానవచ్చుచున్నవి. వానిలో గొన్ని మాత్ర మిచట చూపబడుచున్నవి.

1. ప్రథమాశ్వాసమున భైరవదేవుని వర్ణించు 3-వ పద్యము

'వ్యాకీర్ణస్థితి నాలకించి వకుళీ
వారాహు లూటాడగా
నౌంకారాక్షర మంత్రమర్మముల కా
ద్యం బైన వర్ణంబుతో
నేకగ్రీవము సేసి పల్కెడు తురం
గేంద్రంబుపై నెక్కి వి
ద్యాకల్పుం బ్రణుతింతు భైరవుని లీ
లాహార్యలీలాలయున్.'

అని ముద్రితప్రతిలో గలదు. కాని యిచట 'ఔంకారాక్షరమంత్రమర్మముల కాద్యంబైన వర్ణంబు—' అనగా అర్థము విశకలితముగా లేదు. ఇయ్యెడ బ్రౌనుదొరగారు వ్రాయించిన వ్రాత ప్రతిలో 'ఔంకారాక్షరమంత్రవర్ణముల కాద్యంబైన వర్ణంబుతో' అని కలదు. ఔంకారాక్షరము గల మంత్రములోని అక్షరములకు తొలి యక్షరమగు దానితో అని ఆ పాఠమునభిప్రాయము. ఇది ఉచిత మని తోచుచున్నది.

2. దగ్గఱి పెనగొను దురితపు
బగ్గంబుల ద్రెంచి నైచి ప్రమదాసేతతుల్
దృగ్గోళంబుల దొరగగ
దగ్గుత్తికతోడ దనదు దయితయు దానున్.'

అని ముద్రితప్రతిలో [ఆ. ౧. ప. 111] నున్న పద్యములోని నాలుగవ పాదము వ్రాతప్రతిలో, 'డగ్గుత్తికతోడ దనపడంతియు దానున్' అని యున్నది. ప్రాతప్రతిపాఠమే సమంజసమని, సరసమని సహృదయులు గుర్తింపకపోరు.

3. చెలది పురుగు శివైక్యమును పొందిన కథను తెల్పు సందర్భమున ద్వితీయాశ్వాసమున, 99. వ పద్యముగ.

సేవింపంగ జెలంది నేమము బరీ
క్షింపన లలాటాక్షుడా
త్మావాసంబున నున్న దీపశిఖ కీ
లాఖిల తీవ్రప్రభా
వ్యావిద్ధాంబరమై తగుల్కొని తదీ
యాగారముల్ నూఘమై
పోవంజూచిన లేచి కీటకము హృ
ద్భూతవ్యథాక్రోధమై.'

అని ముద్రితప్రతియందు కలదు. ఇందలి నాల్గవపాదములోని 'లేచి'కి బదులు 'రేగి' అని వ్రాతప్రతిలోని పాఠము; అదియే సరసము.

4. తృతీయాశ్వాసమున తిన్నని బాల్యమును వర్ణించు 27 వ సీసపద్యపు తెత్తుగీతి—

'అంతరంగమలాపహం బైన చిత్సు
ధారసము వోని చిట్టాముదంబు దెచ్చి
బాలకు కడుపునకు బెట్టి పద్మముఖులు
పవ్వళింపగ జేసిరి పాన్పుమీద'

అని ముద్రితప్రతిలో గలదు. ఇందలి మూడవ పాదపు గమనము సరిగా లేదు. ఇట్టి పద్ధతి ధూర్జటికవిత్వమున లేదు. వ్రాతప్రతిలో 'బాలునకు గడ్పునకు బెట్టి పద్మముఖులు' అని యున్నది. అదియే యుచితమైనది. 'కడుపు' అనుటకు 'కడ్పు' అని యుంచుట కిచ్చగింపని పరిష్కర్తలే ముద్రితప్రతిపాఠమును కల్పించి యుండవచ్చును. 'బాలకు' అనుచో శిశువు—మగశిశువో ఆడుశిశువో నిర్ణయింప నవకాశము పద్యమునుబట్టి కానరాకున్నది గదా!

5. తిన్న డడవిలో శివలింగమును జూచి [ఆ. 3. ప. 85]—

'క. ఎన్నేళ్లనుండియో వ
సున్నాడీ యడవిలోన నొంటి మహేశుం'

—డని విచారించినట్లు ముద్రితప్రతిపాఠమును బట్టి తెలియుచున్నది. కాని వ్రాతప్రతిలో 'ఎన్నాళ్లనుండియో, వస్తున్నా' డనియే యున్నది. శివబ్రాహ్మణు డచటికి వారమునకొకసారి వచ్చి పూజించుచున్నట్లు కథాభాగము తెల్పుచున్నందున వ్రాతప్రతిపాఠమే యిచట ననుసంధేయ మని సహృదయు లంగీకరింపక పోరు.

6. ఆ సందర్భమునందే 90-వ పద్యము—

'క. నెప మొకటి గలదె నాపై
నుపవాసముతోడ బడలియుండెగ నీ కే
యపరాధము సేయంగజ
కృపతో గఱకుట్టు లారగింపంగదవే!'

అని ముద్రితప్రతిలో గలదు. ఈ పాఠమున 'నీ కే యపచారము చేయంగదె' అనగా అర్థము బోధపడకున్నది. వ్రాతప్రతిలో నియ్యెడ 'నీ కే యపరాధము సేయగలదె? అని పాఠ మున్నది. 'నీకు చేయుటకు ఎట్టి యపరాధ మైనను గలదా? నీకు నే నెట్టి యపరాధము నయిన జేసితినా?' అని దీని భావము; ఇదియే గ్రాహ్యము.

7. నత్కీరుని చరిత్రసందర్భమున, శివుడు రాజుసభ కేగి—

శా. 'ఈ రాజన్యునిమీద నే గవిత సా
హిత్యస్ఫురన్మాధురీ
చారుప్రౌఢిమ జెప్పె పంప విని మా
త్సర్యంబు వాటించి, న
త్కీరుం డూరకె తప్పుపట్టె నట! యే
దీ, లక్షణంబో యలం
కారంబో పదబద్ధమో రసమొ చ
క్కం జెప్పడా తప్పునన్.'

అని పలికినట్లు ముద్రితప్రతిలో నున్నది. 'వ్రాతప్రతిలో మాత్రమిందలి నాల్గవ పాదమున పదబద్ధమో' అనుటకు బదులు 'పదబంధమో' అని యున్నది. అదియే యుచితమైన పాఠము.

[ఆ. 3. ప. ౧౬౭]

8. తనకు బ్రత్యక్షమైన కుమారస్వామితో నత్కీరుడు—

'క. ఏలాగున దర్శింతుం
గైలాసం; బెపుడు గాని కానన్ ఖేదో
ల్లోలోర్మి రోగజలనిధి
వేలయనుచు విన్నవింప విని సుహృదుడయ్యెన్.'

తగిన సాహాయ్య మొనరించె నని ముద్రితప్రతి. వ్రాతప్రతిలో 'ఏలాగున దర్శింతుం గైలాసం; బపుడు గాని కానన్ ఖేదోల్లోలోర్మిరోగజలనిధి వేల' అని కలదు. 'కైలాసమును జూచినంగాని కుష్ఠురోగము నివర్తింప' దను నభిప్రాయమునకు వ్రాతప్రతిపాఠమే యనుకూలము.

9. మాణిక్యవల్లి యను వేశ్యమాత శివభక్తురాండ్రగు తనకుమార్తెలకు వేశ్యాధర్మముల నుపదేశించుచు—

సీ. 'రసికులు మీ గానరస మానవచ్చిరి
పాడరే శివభక్తి పాడుగాను;
జాణలు మీ విలాసముం జూడవచ్చిరి
చూడరే శివభక్తి చూఱవోను;
పల్లవుల్ మీతోడ భాషింప వచ్చిరి
పలుకరే; శివభక్తి పాఱిపోను
పార్థివుల్ సకల సంపద లీయ వచ్చిరి
పిలువరే; శివభక్తి పెంపు చెడను

ధనము గలిగిన జంగమార్చన మొనర్ప
శివున కఖిలోపచారముల్ చేయవచ్చు
వనజముఖులార! నా సరివారిలోన
సిరుల మెఱయుచు దల యెత్తి తిరుగవచ్చు.'

[౪-౩౫]

అని పలికినట్లు ముద్రితప్రతియం దున్నది. కాని ఎత్తుగీతినిబట్టి చూచినచో, సీసపాదముల చివరం గల 'పాడుగాను, చూఱవోను, పాఱిపోను, పెంపు చెడను' అను తిట్లు అనుకూలములుగా లేవు. హితమును బోధించునపుడు సాంత్వనవచనములు ప్రస్తుతములు; ఉపాలంభనము అనుచితము. వ్రాతప్రతిలో నీ పద్యము—

సీ. రసికులు మీ గానరస మానవచ్చిరి;
పాడరే; మీ భక్తి పాడు గాదు;
జాణలు మీ విలాసముం జూడ వచ్చిరి;
చూడరే; మీ భక్తి చూఱ వోదు;
పల్లవుల్ మీ తోడ భాషింప వచ్చిరి;
పలుకరే; శివభక్తి పాఱిపోదు;
పార్థివుల్ సకల సంపద లీయ వచ్చిరి;
పిలువరే; శివభక్తి పెంపు చెడదు;
ధనము గలిగిన జంగమార్చన మొనర్చి
శివుని కఖిలోపచారముల్ సేయవచ్చు
వనజముఖులార! మీ సరివారలోన
సిరుల మెఱయుచు దల యెత్తి తిరుగవచ్చు'

అనియే యున్నది. ఈ పాఠమే సమంజసముగా తోచుచున్నది.

10. కాళంబు పూర్వజన్మకథాసందర్భమున కైలాసపర్వతమును వర్ణించునెడ ముద్రితప్రతిలో [4—154]—

చ. ఫలముల గాచు నద్రిసుత
పాణిశుకంబు; వృషంబు గాచు శా
ద్వలముల్లు; గాచు దంతిముఖ
వాహన మక్షుతరాజి; గాచు జో
గుల యిలవేల్పు వాజి మది
గోరక బోనము భర్తు లీశ్వరుం
గొలిచినదాక దత్కుధర
కూటగళత్తటినీతటంబునన్.

అని యున్నది. కాని 'జోగుల యిలవేల్పు వాజి మదిగోరక బోనము గాచు' అనిన నర్థమేమో బోధపడుటలేదు. లిఖితప్రతిలో మాత్రము 'కాచు జోగుల యిలవేల్పు బంటుగమి కోరిక బోనము' అని యున్న పాఠము చాల పొందికగానున్నది. జోగుల యిలవేల్పు బంటుగమి యిచట ప్రమథగణము కావచ్చును.

ఇట్టి పాఠాంతరములు బ్రౌన్‌దొరగారు తయారుచేయించిన ప్రతియందే చాలవఱకు గానవచ్చుచున్నవి. మీది యుదాహరణములు మచ్చునకు మాత్ర మీయబడినవి.

16 వ శతాబ్దిలో దక్షిణభారతదేశమంతటను శైవమతము ప్రబలియున్న సంగతి యీ ప్రబంధమునుబట్టి తెలియుచున్నది. ధూర్జటికవి కొన్ని కన్నడసంప్రదాయములను, పదములను (1-35) వాడియున్నాడు; తమిళవాఙ్మయమున ప్రసిద్ధమైన నక్కీరుని చరిత్రను గ్రహించి యున్నాడు; కాని పేరినిమాత్రము 'నత్కీరు' డని మార్చియున్నాడు. అటుల మార్చుటలో నతని యభిప్రాయ మేమో బోధపడలేదు. 'నక్కీరు' డనగా తమిళమున మంచి వాక్కులు కలవా డని యర్థము. 'నత్కీరు'డనినచో ఆ యర్థము రాదు. ధూర్జటికవి 'నత్కీరాది కవీంద్రులన్ దివిషదన్న ప్రాయవాగ్గుంభసంపత్కావ్యప్రతిపాదక ప్రతిభులన్—' అని ప్రాసస్థానమునను, 'నత్కీరుం డూరక తప్పు పట్టెనట యేదీ లక్షణంబో యలం, కారంబో—' అని యతిస్థానమునను కూడ 'నత్కీర' పదము నుపయోగించుట గమనింపదగినది.

శివభక్తులకే కాక— ఆంధ్రభాషా, వాఙ్మయ సంప్రదాయజిజ్ఞాసువులకును, సాహిత్యవేత్తలకును కూడ శ్రీకాళహస్తిమాహాత్మ్య మవశ్యాదరణీయము.

—— .

గ్రంథస్వీకారం:

శ్రీవాసుదేవనామ శతకము

రచన: శ్రీగురుజాడ రాఘవశర్మ. బృందావన ప్రచురణములు, మచిలీపట్టణము. వెల 8 అణాలు.

శ్రీజానకీ శతకము-రామదండకము

రచయిత శ్రీ ఉపేంద్రము శంకరనారాయణ రాజు, బోర్డు ఉన్నత పాఠశాల, మదనపల్లి.

అవ్వకిపోటీ

(పిల్లలకథ)

రచనవల్లియప్ప. అనువాదం గిరిధర్, బాబు కార్యాలయం, 4, రట్లండ్ గేట్ కాలనీ, కెతెడ్రల్, మద్రాసు 6. వెల 2 అణాలు.


రాయల నీతికథలు

(మూడు భాగములు)

కర్త డా॥ గిడుగు సీతాపతి. ప్రకాశకులు రాయలు అండ్ కో, కడప.

రైతుబాబు

పద్యకావ్యము. రచన వైద్యశ్రీ డా॥ పాందూరపాంబమూర్తి, శ్రీప్రసాద్ మెడికల్ ఫార్మసీ, రావులపర్రు, ఉంగుటూరుపోస్టు వయా తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరిజిల్లా. వెల రు 1-0-0.



డాల్డాతో తయారుచేయబడినచో మొదటి రకముగానుండును

శుభ్రముచేయబడిన ఒక పూర్తి కోడియొక్క పై భాగమును చిన్నచిన్న రంధ్రములుజేసి గింజలు తీసివేయబడిన చింతపండుతో కలుపబడిన ఎరమ్ మసాలాముద్దను దాని మీదంత ఎద్దండి కోడి లోపలిభాగములో సగము ఉడికిన బియ్యము (ఈ బియ్యము మొట్టమొదట పూర్తిగా వేపబడి యుండాలి), కోడియొక్క వేసిన కాలేయము, గుండె మరియు తరిగివేసే మసాలా ముద్ద యొక్క మిశ్రమమును నిక్కండి తరువాత, పాత్రయొక్క అడుగుభాగమున డాల్డాను ధారాళముగా పూసి పలచని ఉల్లిపాయల ముక్కలను వేయండి తరువాత వాటిమీద కోడిని ఉంచండి కోడి చుట్టు ఇతర ఉల్లిపాయలను, సగముగా కోయబడిన బంగాళాదుంపలను వేసి ఉప్పును జల్లండి పాత్రమీద మూతపెట్టి గోధుమపిండి ముద్దతో దానిని సీలుచేయండి. తరువాత కొద్దిగానున్న మంటమీద వండండి



మీ కుటుంబ ఆరోగ్యమునకు ఫ్రూట్ సలాడ్!

ఉచిత సలహాకొరకు ఇప్పుడే— లేక ఏరోజైనను వ్రాయండి:

ది డాల్డా అడ్వైసరీ సర్వీస్

పోస్టుబాక్సు నెంబరు 353, బొంబాయి 1

HYM. 99 174 TL

మన పౌరాణిక దృక్పథం - నాడు - నేడు

పి. యస్. లలితాప్రసాద్

ఆదినుంచీ మనజాతిలో వెలువడ్డ గ్రంథాల్లో చాలాభాగం పౌరాణికములే. అవి జాతీయ సంప్రదాయాల్నీ, జాతీయ సంస్కృతినీ, జాతీయజీవనాన్నీ ఉద్ఘాటిస్తూ తద్వారా ముక్తి మార్గాన్నిగూడా ప్రబోధిస్తూ వచ్చాయి. నిజానికి మన జాతియొక్క స్థాయి వాటిలోనే వున్నది. మనజాతి సజీవంగా వుండాలంటే వాటిని కంటిని రెప్పవలె కాపాడుతూ వాటి సందేశాన్ని అనుక్షణం మనన జేస్తూ వుండాలి. ఆనాటినుండి యీనాటివరకు యేగ్రంథం యే విషయాన్ని ప్రబోధించినా ప్రపంచాన్ని విస్మరించినట్టు కనబడదు. కాని పాఠకులలోను శ్రోతలలోనూ మాత్రం తద్భిన్నత్వం గోచరిస్తూ వున్నది. యీ అభిప్రాయమే యీ రచనకు ఆధారం.

మొట్టమొదటినుండీ పౌరాణిక గ్రంథకర్తలు స్వానుభవాల్ని పురస్కరించుకొని ఉత్తమ మార్గాల్ని ఆ గ్రంథాల్లో వివరించారు. మానవులు ప్రశాంతజీవితాన్ని గడపటానికి ఆధారాలైన సత్య-దయా-శౌచాదులను వాటిలో స్పష్టంగా వ్రాశారు. తద్భిన్నంగా ప్రవర్తించటంవలన గలిగే నష్టాల్నిగూడా వెల్లడించి మిత్రునివలె హితోపదేశం చేశారు. తదుపదేశానుసారంగా నడుచుకుంటే మోక్షప్రాప్తిగూడా తథ్యమని నిరూపించారు. ఇట్టి పురాణాలవిషయంలో అందును మహాభారతం విషయంలో వ్యాసుని దృక్పథం యేమిటో చూద్దాం. "ధర్మే చార్థేచ కామేచ మోక్షేచ పురుషర్షభ, య దిహాస్తి త దన్యత్ర- యన్నేహాస్తి న తత్క్వచిత్" అని వ్యాసుడు చెప్పాడు. అంటే మానవజీవిత సౌఖ్యసర్వస్వమును ప్రతిబింబింపజేసేది భారతమని భావార్థంగా చెప్పకోవచ్చు. సంస్కృతభారతము తరువాత పుట్టి వ్యాసరచితము లని పేర్వడ్డ అష్టాదశపురాణముల విషయముగూడా తద్భిన్నమని చెప్పటానికి వీలులేదు కదా ?

ఇకను ఆంధ్రమహాభారతవిషయం. రాజరాజనరేంద్రుడు నన్నయను మహాభారతాంధ్రీకరణమును జేయమనుచు "నస్మదీయవంశమున బ్రసిద్ధులై విమలసద్గుణశోభితులైన పాండవోత్తముల చరిత్ర నాకు సతతంబు వినం గ న భీష్టమెమ్మెయిన్" అని "మహాభారతబద్ధనిరూపితార్థ మేర్పడగా" మహాభారతము నాంధ్రీకరించమని కోరినాడు. అంటే తన వంశీయుల చరిత్ర కావటం. మొదటికారణం వ్యాసుడు చెప్పినట్లు ధర్మార్థాదు లం దుండుట రెండవ కారణం. ఈ రెండవకారణాన్ని పురస్కరించుకొని లోకసంస్కారం చెయ్యాలనీ, ప్రజాజీవితాన్ని వొకక్రమపద్ధతిలో నడపాలనీ తలంచి ఆంధ్రమహాభారతాన్ని నన్నయచేత ఆంధ్రీకరింపజేశాడు. అంతేకాదు. ఆ గ్రంథాన్ని అచ్చటచ్చట పండితులచేత పురాణంగా చెప్పిస్తున్నట్లుగూడా చరిత్రప్రసిద్ధం. ఆ రోజుల్లో ప్రజలు తమ భవిష్యత్తంతా ఆగ్రంథాల్లో వున్నదని భావిస్తూ భక్తిశ్రద్ధలు గలిగివుండేవారు.

తరువాత కవిబ్రహ్మ భారతప్రాశస్త్యాన్ని గురించి రెండు పద్యరత్నముల రచించాడు.

"వేదములకు నఖిలస్మృతి
వాదములకు బహుపురాణవ్రాతంబులకున్
వాదైనచోటులను దా
మూదల ధర్మార్థకామమోక్షస్థితికిన్."

"విద్వత్సంస్తవనీయ భవ్యకవితా
వేశుండు విజ్ఞానసం
పద్విఖ్యాతుడు సంయమి ప్రకర సం
భావ్యానుభావుండు కృ
ష్ణద్వైపాయను డర్థిలోక హితని
ష్టంబూని గావించె ధ
ర్మాద్వైతస్థితి భారతాఖ్యమగు లే
ఖ్యంబైన యామ్నాయమున్"

ఇందలి విజ్ఞాన సంపద్విఖ్యాతుడు - అర్థిలోక హితనిష్ఠన్ - ధర్మాద్వైతస్థితి మొదలగునవి గమనార్హములు గదా ?

కాని తరువాత శైవులకాలములో వెలువడ్డ బసవపురాణాదులు అద్భుతవిషయాల్ని ఉద్బోధిస్తూ ప్రజలలో వొకవిధమయిన గాఢవిశ్వాసాల్ని నెలకొల్పాయి. వాటినే యీరోజుల్లో కొందరు మూఢవిశ్వాసాలంటారు. ఆ ప్రజలు తాత్కాలికగ్రంథాల్లో వర్ణింపబడే అభూతవిషయాల్ని విని, ఏదో తన్మయావస్థలో వుండేవారేగాని ఏవిషయాన్నిగూడా విమర్శించేవారే గాదు. తదాది క్రమక్రమంగా పురాణాల్ని వింటే ఏదో పాపపరిహార మవుతుందనీ మోక్షం సుగమ మవుతుందనీ విశ్వసించి గ్రంథస్థవిషయాన్ని విమర్శనాదృష్టితో ఆలోచించటం మానివేసి, జన్మ తరింపజేసుకునే అర్హత తమ పూర్వపుణ్యఫలితంవలన తమకే కలిగిం దనే ధోరణిలో పడ్డారు. అదిగాక ఆచరణశూన్యమైన ఆశయాలతో ప్రతివారితో వాదించటం మొదలుపెట్టారు. అసలు వాళ్ల విషయ మట్లావుంచండి. కాస్తోకూస్తో డొక్కశుద్ధి అయిన వారే గదా ఈరోజుల్లో పురాణాలు చెప్తాండే వారు. తాము లోకసంస్కారుల మనేభావం వారిలో ఎందుకు అంతర్ధానం కావాలి. కుక్షింభరత్వ మనేది ప్రతివారికీ పెద్దసమస్యే అనుకోండి. సంఘసంస్కారదృష్టితో యెందుకు ప్రవర్తించగూడదు. గ్రంథస్థవిషయాన్ని లౌకికంగా సమన్వయంచేసి యెందుకు ప్రబోధించగూడదు? అంటే వారిలోనే ఆ తత్త్వం లేనపుడు వారెట్లా ఆవిధంగా ప్రబోధిస్తారు. కనుక పురాణాలంటే పుణ్యప్రదా లనే అభిప్రాయంతో మన జాతీయతను విస్మరించి మన గ్రంథాల్లో యేమీ లేదనుకొని విజాతీయగ్రంథాలకోసం ఎదురుచూడటం ప్రతివారికీ సంప్రదాయమై పోయింది.

ఇది యిట్లా వుండగా మరో నూతనాభిప్రాయంగూడా యిప్పుడిప్పుడే బయల్దేరుతున్నది. ఏమీ తోచకపోతే పురాణం చెప్పే చోటనన్నా కాసేపు కూర్చుందామని పురాణం విని వస్తూవుండే పెద్దమనిషిని "యేమండీ బాబూ, యెక్కణ్ణించి వస్తున్నా"రని అడిగితే "ఆ యిక్కణ్ణించేనండీ. యేమీ తోచకుండావుంటే కాసేపు ఆపురాణందగ్గర కూర్చొని వస్తున్నా- యేదో ప్రొద్దు పోవాలిగా" అంటాడు. మన పౌరాణికగ్రంథాలమీద ఇంత తిరస్కారమూ, మనుష్యుల్లో ఇంత నిస్పృహ బయల్దేరితే యింకా యేమిటీ చెప్పండి మనముందుసంగతి. కనుక యీ దుస్థితిపోయి లోకంలో నవ్యచైతన్యం గలగటానికి నూతనపంథాలో మన పురాణాలు నడవాలి.

భీష్ముడు బ్రహ్మచర్యం అవలంబించాడంటే అబ్బా మహానుభావు డని రెండు చేతులెత్తి దణ్ణం పెడతారు. ధర్మరాజు పరమశాంతస్వభావుడు, సత్యవ్రతుడు అంటే - ఆహా ఎంతవాడండీ ఆరోజుల్లో గనక అటువంటి ఉత్తములు వెలిశారు. గాని ఈరోజుల్లో ఎక్కడ లేండి. అని యేమిటో చెప్పటానికి వీలులేకుండా కుమిలిపోతారు. అంతేకాని బ్రహ్మచర్య మంటే యేమిటో! దానివల్ల గలిగే ఫలితా లేమిటో ? ఆవిధంగా మనంగూడా సాధ్యమయినంతవరకు ఆచరించటానికి మార్గా లేమయినా వున్నాయో లేవో అనే విషయాన్నైనా ఆలోచిస్తున్నారా? ధర్మరాజు చరిత్ర విన్నప్పుడు అతని సద్గుణాల్ని అలవరచుకొని అభివృద్ధి పొందటానికి ప్రయత్నిస్తున్నారా? అంటే - ఆ జాడ మచ్చునకైనా ఎచ్చటా కనపడదు.

ఇకముందుకు పోదాం : పురాణాలు మన సంఘానికెట్లా ఉపకరిస్తాయో వివరిస్తారు. మార్కండేయపురాణంలో గృహస్థుని ధర్మాలు మనుష్యులలోగల పరస్పరసంబంధము పరోపకారచింత మొదలయిన ఉత్తమ బోధనలన్నీ వివరింపబడ్డాయి. భాగవతంలో భక్తియొక్క ప్రాముఖ్యత - దానివలన మానవు డెంతయినా కార్యాన్నయినా సాధింపగలుగుటకుగల మార్గాలూ స్పష్టపరచబడ్డాయి. ఇక భారతం సంగతి చెప్పేదేమిటి? మన ఉత్తమ జీవిత మార్గదర్శియే కదా ఆగ్రంథము? మార్కండేయపురాణంలో మానవధర్మాల్ని ఎంత బాగా వివరించాడో చూడండి.

"క్షమయు నకార్పణ్యము శౌ
చమును.ననూయయును నానృశంస్యము సంతో
షమును నహింసయు వినుస
త్యము నెనిమిదివలయు గుణము లఖిలజనులకున్."

పైసద్గుణము లున్నట్లైతే మన జీవితం సుఖాంతం గావటానికి యేలాటి సందేహము లేదుగదా? గృహస్థధర్మప్రాముఖ్యతను గూడా చాలా బాగా వివరించాడు.

"అనఘ గృహస్థధర్మపరు
డైన నరుండు త్రిలోకపోషకుం
డనుపమపుణ్యమూర్తి యత
డాతని సంతతధర్మసంపదన్
మునిపితృదేవ భూతగణ
ముల్ క్రిమికీటకపక్షిసంఘముల్
మను కనుగొంచునుండుదురు
మానక యర్థులు వానివర్త్రిముల్."

సర్వాశ్రమములకు సమస్త క్రిమికీటకాదులకు గూడా ఆధారము గృహస్థు. అతనిమీద యెన్నో జీవులు ఆధారపడివుంటవని చెప్పి గృహస్థధర్మంలో వుండే బాధ్యత గుర్తింపజేయబడ్డది. మరొక నీతిని చూడండి.

"అనలము నోర నూదదగ
దగ్గియు నీరును నొక్కమాటుతే
జనదు విలంబనంబు నిజ
శౌచవిధానమునందుగూడ ద
గ్గొనర గురుండు, దేవతలు
నుండగ నద్దెస గాళ్లు చాచుట
ర్థి నిగుడ గ్రేపుజన్నుడుపు
ధేనువు గొట్టుట తప్పు పుత్రకా."

ఈ పద్యములో ఆరోగ్యసూత్రాలూ నైతికపంథా రెండూ యిమిడివున్నై. ఇక సుఖజీవనము "ఎందలి జను లవినీతిం - బొందక మత్సరముపొంత బోవక పరమానందమున గూడియుండుదు-రం దుండుట పరమసుఖము నాపాదించున్." నీతిమార్గాన్ని విడవకుండ మత్సరగ్రస్తులు కాకుండుంటే సుఖజీవనం గడపటానికి మార్గమని ఉపదేశింపబడ్డది. సుఖజీవనాన్ని కోరేవారు నివసించే ప్రదేశం—

"ఎందెల్ల మంగులును గల
వెందు కృషీవలులు ధనికు లెందు ధరణి చె
న్నొందు బహుసస్యదాయిని
యందున్ నివసింపదగు సుఖార్థులు పుత్రా."

ఇక భారత జాతీయ సంప్రదాయం చూడండి. అతిథి పూజవిషయంలో మన కర్తవ్యాన్ని చాలా చక్కగా నిర్వచించాయి మన పురాణాలు.

"అతిథిన్ గాలసమాగతున్ ఘనబుభు
క్షార్తున్ బథిశ్రాంతు నా
తతమార్గోత్థితధూళిధూసరితగా
త్రిస్వేదబిందూత్కరా
న్వితు నజ్ఞాతకులాభిధానుగని య
వ్విప్రున్ మహాత్మున్ బ్రజా
ప్రతిగా నాత్మ దలంచుచున్ సముఖుడై
భక్తిన్ బ్రయత్నంబునన్."

ఇంతేగాదు.


"అతని కులశీలవిద్యా
స్థితు లడుగక యెంత వికృతదేహుండైనన్
మతి విష్ణునిగా దలచుచు
నతిముదమున బూజసేయునది నిజశక్తిన్."

అతడెవడయినా ఎటువంటివాడయినా అతని కష్టాన్ని హృదయపూర్వకంగా తనదిగా భావించి మహోత్కృష్టమయిన సత్కారం చెయ్యమని హితబోధ. ఇంతేగాకుండా మానవులు నాలుగాశ్రమములలోను యేరీతిగా బ్రవర్తించి జన్మతరింప జేసుకోవాలోగూడా స్పష్టంగా మన పురాణాలు వివరించాయి. ఇక భక్తిభావం. భాగవతంలో నారదుడు వ్యాసునితో స్వామీ "అపశబ్దంబులగూడియున్ హరిచరిత్రాలాపముల్ సర్వపాప పరిత్యాగము జేయు"నని అంటాడు. అంటే చిత్తస్థైర్యముతో అచంచలవిశ్వాసముతో ధ్యానించినపుడు శబ్దసౌష్ఠవంతో పనిలేదని భావనాశక్తియే ప్రధానమని దీని వుద్దేశం.

"తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్
దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్
సంకీర్తనల్ చింతనం
బను నీతొమ్మిది భక్తిమార్గముల స
ర్వాత్మున్ హరి న్నమ్మి స
జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్
సత్యంబుధాత్రీశ్వరా!"

ఇందు జెప్పబడ్డ తొమ్మిది భక్తిమార్గములను మానవులు ఆచరణరూపంగా అనుసరించినట్లయితే వారు తమ ధ్యాననిష్ఠను వృద్ధిజేసుకోటానికి సందేహ మేమీ లేదుగదా ?

తనతండ్రి నవమానించినాడనే కోపంతో శమీకుడు పరీక్షిత్తునకొసంగిన శాపములోని భావ మేమిటి? ఆత్మశక్తిని సంపాదించి హృదయపూర్వకముగా ప్రవర్తించే వ్యక్తి శమీకుడు! అటువంటివారు యేమాట అన్నా యేచేత చేసినా అది సఫలమయ్యే విషయంలో సందేహ మేమున్నది? అంటే ప్రతివ్యక్తి ఆత్మశక్తిని వృద్ధి పొందించుకుంటే తనకు స్వాధీనం కాని విషయమే ప్రపంచంలో లేదనే విషయం నిర్వివాదం. ఈ పై విషయమింతా సూచనామాత్రముగా వ్రాశాను. మన పురాణాలు బోధించే అమూల్యమైన హితబోధనలను విన్నప్పుడు గాని చదివినప్పుడుగాని వాటివల్ల మన జన్మ తరిస్తుందనే భావంతో తన్మయత్వం పొందకూడదు. ఆగ్రంథాన్నీ తద్గ్రంథకర్తనీ సెబాస్ అని పొగడినంతమాత్రాన లభించే దేమీలేదు. వొకవిధంగా ఆచరించటానికి ప్రాలుమాలే మన సోమరితనమే వెల్లడిఅవుతుంది. అసలు ప్రస్తుత దేశపరిస్థితి యెలా వున్నదంటే- అవినీతికి పాల్పడిన ప్రజలు ఆచరణకు భయపడి ధర్మోపన్యాసాలను వేదికల మీదినించి విసురుతున్నారు. ఈ పద్ధతే గనక ఇకముందుగూడా కొనసాగేపక్షంలో దేశం నిరాశాసముద్రంలో మునిగిపోవలసివస్తుంది. కనుక మన ప్రాచీనసారస్వతాన్ని అందును మన పురాణాలను పర్యాలోకనచేసి, అందుగల ఉత్తమ ధర్మాల్ని అవగాహన చేసుకొని వాటిని క్రియారూపంలో వుంచటానికి ప్రారంభించాలిగాని ఏరోజుకారోజువాయిదా వేస్తూ ప్రాచీనభారతీయౌన్నత్యాన్ని చూచి గర్వపడితే లాభంలేదు.



పడమటలో నిర్మితమైన ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము తాలూకు సర్వోత్తమ భవనం,

దండనాథులు:

సాళువ గోవిందరాయలు

శ్రీ కోన వెంకటరాయశర్మ

శ్రీ కృష్ణక్షితిపాలమౌళి సచివుడగు తిమ్మ ప్రభుని సోదరు డితడు. కౌండిన్యగోత్రి కలితాపస్తంబసూత్రుడు. ఆఱు వేలనియోగి బ్రాహ్మణుడు. 'కొండవీటి' నగర వాస్తవ్యుడు. తండ్రి రాచిరాజు. తాత వేమరాజు. అట్లని శా. శ. 1442 విక్రమశకవైశాఖ శు 15 నాటి నాదెండ్ల గోపమంత్రిశాసనమందలి—

"శ్రీకృష్ణక్షితిపస్సభౌతివిజయ
స్తంభః కళింగాంగణే
మహాప్రధాన శ్రీసాళ్వ
తిమ్మ స్సచివ శేఖరః,
శ్రీకృష్ణరాయనృపతే
స్సామ్రాజ్య మధితిష్ఠతి
శ్రీసాళ్వతిమ్మ సచివః
కౌండిన్యకులశేఖరః,
వేమయామాత్యసత్పౌత్రః
రాచయామాత్యనందనః."

అను వాక్యము లగత మొనర్చుచున్నవి. ఇయ్యన్నదమ్ములకు "కృష్ణమాంబ" యను సోదరి కలదు.

వీరి పూర్వు లెల్ల ఱును 'సాళువ' రాజన్యుల యొద్ద మంత్రిశేఖరులుగను జమాపతులుగను నుండి పేర్గాంచుచుండిరి. రాచిరాజుకాలమున స్వస్థలమగు కొండవీటిసామ్రాజ్యము గజపతిచక్రవర్తులచే గెలుపొందబడుటంజేసి 'సాళువ' రాజన్యులు 'చంద్రగిరి'కి తలసపోయి నూతనముగ రాజ్యమును నెలకొల్పుటవలన రాచిరాజుసైతమచట దన యాస్తిపాస్తుల గోల్పోయి నిలు పేదయై బ్రదుకుదెరవునకయి 'చంద్రగిరి'కి బోయెను. అనూచానముగ నివ్వంశజులు రాజవంశసేవాపరాయణు లగుటచే 'సాళువ' వారనియే వీరిని బిలుచుచుండిరి. బ్రదుకుదెరవునకయి రాచిరాజు 'చంద్రగిరి'కి బోయినతర్వాతనే తిమ్మమంత్రియు, గోవిందరాయలును, కృష్ణమాంబయు గలిగిరి. ఈ బిడ్డలు కలిగిన పిదప రాచిరాజు తన భార్యను గోల్పోయెను.

రాచిరాజు తన కొమార్తెయగు కృష్ణమాంబను జంద్రగిరిరాజగు సాళువనరసింహరాయని మహామాత్యుండగు నాదెండ్ల చిట్టిగంగన యన్న మనుమడైన తిమ్మరాజున కొసగి మహావైభవముగ బెండ్లి గావించెను. ఇట్టి సంబంధబాంధవ్యము లున్నను బేదరికము దాపురించిన తర్వాత గూడ దిమ్మమంత్రి మహామాత్యుండగు గంగనామాత్యుని సాహాయ్య మర్థించలేదు. తిమ్మమంత్రి సంస్కృతాంధ్రకర్ణాటాది భాషలలో జక్కని పాండితీగరిమ గలవా డయ్యును గుణవంతుడు, గార్యవంతుడు, ప్రజ్ఞాప్రాభవోపేతుడు, వని చంద్రగిరి, గుత్తి, పెనుగొండ, నారాయణవనము లోనగు ప్రదేశముల పేర్వడసెను. గోవిందరాయలును అన్నివిషయముల దిమ్మమంత్రివంటి వాడే యని ప్రజల రసనాగ్రముల మెలంగుచుండెను. 'చంద్రగిరి' సామ్రాజ్యమునకు రాజధానియగు 'నారాయణవనము'నందీ యన్నదమ్ముల ప్రజ్ఞాప్రాభవములు, శక్తిసామర్థ్యములు అతిశయించి తుదకు జిట్టిగంగనామాత్యుని శ్రవణపుటంబుల సైతము సోకి గోవిందరాయ తిమ్మప్రభుల రావించి, రాజనీతివిద్యారహస్యముల సమగ్రముగ నెఱింగించి, యున్నతస్థితికి రా దొడ్పడియెను. ఆకారణమున దిమ్మమంత్రికి గంగనామాత్యునెడ నశేషభక్తిపుంభావము గుదిరి యమ్మహామాత్యుని సందర్శించుటయు, సేవించుటయు, నొకవిశేష మని తలంచుచుండెను. ఇట్టి భావశబలత కలవారిలో నితడు మొదటివాడు.

చిట్టిగొంగన ఆనాటి యార్థికశాస్త్రజ్ఞులలో, సచివోత్తములలో బరిపాలనాదక్షులలో, రణనీతికోవిదులలో నెన్నదగిన సప్తతివర్ష ప్రాయుడు అయ్యును బహునాయకుల వయస్సామునింబలె దేహమనోబుద్ధులు గలవాడయి రాజ్యచక్రము నవలీల ద్రిప్పుచుండిన చతురుడు. ఇమ్మహనీయుని భయమువలననే గజపతులు వెనుకకజ వైచిరి. ఇవ్విచక్షణాదక్షుని పరిశీలనము వలననే బహమనీసులతానులు కర్ణాటకసామ్రాజ్యమును దాకుటకు వెఱచిరి.

గొప్పమేధావియగు తిమ్మమంత్రి చిట్టిగంగనామాత్యుని శుశ్రూషవలన రాజనీతివేత్తృత్వము, శాస్త్రపరిజ్ఞానము, లోకానుభవము, గడించి, మహామాత్యున కుండదగు సర్వలక్షణలక్షితుడగుచుండుటను గనిపట్టి యొకనాడు గంగనామాత్యుడు దగ్గఱకు బిలిచి "కుమారా! నీ భవిష్యద్భాగ్యలక్షణములు నీ ముఖము సాటుచున్నది. నాయంతర మీయాంధ్రమహాసామ్రాజ్యమునకు మహామాత్యుడవు నీవ యగుదువు. ఈ భారము నీయంద నిక్షిప్తమయియున్నది. విస్మరింపవలదు. ఒకదెస నుత్కళరాజులు, మఱియొకవంక బహమనీసులతానులును మనసామ్రాజ్యమును నోట బెట్టికొన నువ్విళులూరుచున్నారు. వయసు చెల్లినవాడను. ఎంతికాలమో బ్రదుకజాలను. ఈ శాత్రవయోధుల నిప్పుడే నిర్జింపదగు బలము మనకు లేదు. అదియునుంగాక, విజయనగరసామ్రాజ్యము సరియైన స్థితిలో లేదు. నాయనంతర మీ సామ్రాజ్యమునకు నీవ మహామంత్రివై నా యభీష్టముల నీడేర్చి "ఆంధ్రసామ్రాజ్యస్థాపనాచార్య"బిరుద మందుము. ఇందులకు దప్పనని లోకసాక్షియగు కర్మసాక్షియెదుట బ్రమాణ మొనర్పు"మని నొడివినంతనే తిమ్మరుసు బ్రహ్మానంద మంది "తమ యభీష్టము నెఱవేర్ప బ్రయత్నించెద"నని ప్రమాణ మొనర్ప గంగనామాత్యుడానందసాగరమున దొప్పదోగి తిమ్మమంత్రిని బిగ్గ గౌగిలించికొని "నాయనా! నీ వట్టిడవే! సందియము లే"దని నొడివి దాపుననుండి యీ దృశ్య మంతను దిలకించుచున్న గోవిందరాయల నవలోకించి 'బాబూ! అన్నగారికి నన్నివిధముల నీడైన నీ యభిప్రాయ మేమి?'యని పృచ్ఛింప నాడెలు జలదరించి కన్నులవెంట నశ్రుకణముల రాల్చుచున్న గోవిందరాయలు "ప్రభూ! మాయన్నగారికి బాసటయై యన్నివిధముల మీ యభీష్టము నెఱవేర్చి మీకు దృప్తి గలిగింతు"నని చేతులు ముకుళించగనే చిట్టిగంగనామాత్యు డాతని జేరదీసి ముద్దాడి 'భవతు'అనియెను.

ఇది జరిగిన కొన్నాళులకు గంగనామాత్యు డసువుల బాసెను. అతడు బ్రదికియుండగనే తుళువ నరసరాజునకు దిమ్మయ ప్రధానియయ్యెను. ఈ నరసరాజు 'చంద్రగిరి'ప్రభువగు సాళువనరసింహరాయనికడ జమాపతిగా నుండి 'గుత్తి'దుర్గమునకు నధిపతియై పరిపాలనము సాగించినవాడు. ఈశ్వరరాజుకొమారుడే యీ నరసరాజు. ఈశ్వరరాజు సైతము నరసింహరాయలయొద్ద సైన్యాధ్యక్షుడుగా నుండి నిరుపమాటోపమును గనంబఱచి దుర్గముల బెక్కింటిని జయించి 'చంద్రగిరి' సామ్రాజ్య విస్తరణకు దోడ్పడి—

"ఉదయాద్రి భేదించె హుత్తర నిర్జించె
గండికోటపురంబు గదల ద్రవ్వె
బెనుగొండ సాధించె బెగ్గలూరు హరించె
గోవెల నెల్లూరు గుంటపఱిచె
గుందాశి విదళించె గొడుగుచింత జయించె
బాగూరు పంచము పాడునేసె
నరుగొండ బెకలించె నామూరు మర్దించె
శ్రీరంగపురమును బాఱిపఱచె
రాయచేష్టాత్త మల్లగరావరాహ
మోహనమురారి బర్బరబాహుసాళ్వ
నారసింహ ప్రతాపసన్నహను డగుచు
విశ్వహితకారి తిమ్మయయీశ్వరుండు."

ఇట్టి విజయలక్ష్మీ కరగ్రహణుండయిన యీశ్వరరాజునకు నరసరాయలు తగిన కొమరుడు. శౌర్యధనుండగు నీతని నాయకత్వమున జంద్రగిరిసామ్రాజ్యము సర్వతోభద్ర మయ్యెను. కాగా, నరసరాయ లిప్పుడు శత్రుదుర్నిరీక్ష్యు డయ్యెను. గజపతి చక్రవర్తులు, బహమనీసులతానులు నరసరాయ లనిన గజగజ వడంకసాగిరి. ఆ సందర్భముననే తిమ్మరసు పేరెల్ల ఱకు దలలోని నాల్క యయ్యెను. ఇక గోవిందరాయలమాట జెప్ప నేల?

ఈక్లిష్టసమయమున గర్ణాటసామ్రాజ్యమున గలత లభివృద్ధి సెంది తత్ప్రభువగు విరూపాక్షరాయలు దుష్ప్రవర్తనము, స్త్రీలోలత, రాజ్యాంగవ్యవహారముల విస్మరింపజేసి తత్రాపి దండనాథులు, సచివులు, స్వైరవిహారులై నడచుటకు ద్రోవ యేర్పడినది. కాగా, సామంత ప్రభువులు స్వాతంత్ర్యమును బ్రకటించి, సుంకముల జెల్లింప మాని, యంకితులై యుండుటను దిరస్కరించిరి. ఆకారణమున బ్రజయందంతః కలహము లంకురించి పన్నుల నిరాకరణము, ఆదాయము సన్నగిలుట యేర్పడి బహమనీసులతానులు సామ్రాజ్యమును గబళింప నుత్సుకతతో బ్రయత్నముల జాగించుటను దిమ్మరసు మంత్రి గ్రహించి, నాదెండ్ల చిట్టిగంగనకు దా చేసిన వాగ్దానమును జ్ఞప్తికి దెచ్చికొని సామ్రాజ్యసంరక్షణభారమును వహింప నిశ్చయించి, నరసింహరాయలకు సర్వము వినుపించి ప్రభునానతిపై ప్రబలసేనాసమేతుడై నరసింహరాయలతో గూడ విజయనగరమును దండెత్తగా దత్ప్రజలును నరసరాయలకు స్వాగత మిచ్చి రంగరంగవైభవములతో గొనిపోయిరి.

అంతఃపురమున స్త్రీలోలుడై ప్రొద్దుపుచ్చుచున్న విరూపాక్షరాయలు నగరమును శత్రుమూక ముట్టడించిన దని చెప్పిన వార్తాహరుల జావమోది పంపెనే గాని తన యునికికే భంగపాటొదవుచున్న దని గ్రహియింప డయ్యెను. కతిపయఘడియలలో నరసరాయలు అంతఃపురమున బ్రవేశింపగా జూచి స్వప్రాణరక్షణార్థమై వేఱు త్రోవను బడి పిక్కబలము జూపెను. నరసరాయ లశ్రమముగ విజయనగరమును బట్టికొని తనప్రభువగు సాళువనరసింహరాయలకు దెలుపగా, నతడు, 'మహావైభవముగ విజయనగరమునకుం జని రాజ్యారూఢు డయ్యెను.

నాడుమొదలు విజయనగర, చంద్రగిరి రాజ్యము లైక్యము జెంది యాంధ్రమహాసామ్రాజ్య మయ్యెను. కాగా, దిమ్మరసుమంత్రి 'మహామాత్య'పద మధిష్ఠించి సామ్రాజ్యభర్తృహర్మ్యమునకు మూలస్తంభముగా నొప్పెను. నరసింహరాయధరణిపుడును సామ్రాజ్యసంరక్షణభారమంతయు నరసరాజు, తిమ్మరుసులపయి నుంచి నిశ్చింతతో సుఖంబుండుచుండెను.

చిట్టిగంగనామాత్యుని చరమపవిత్రవాక్యములు స్మృతిపథంబున మెలంగుచుండుటవలన దిమ్మమంత్రిరాజ్యమున గలతలు, శత్రుభయము లేకుండ జూచుచు బరిసరదుర్గముల బలీయ మొనర్చి, స్వాతంత్ర్యము నభిలషించి కప్పముల గట్టుటను మానినట్టి సామంతమాండలికుల మరలలోగొని విశ్వాస్యులగు సేనానుల నియమించెను. సర్వసైన్యాధిపతిగా నరసరాజుండినను గర్ణాటకసైన్యాధిపతిగా దన తమ్ముడైన గోవిందరాయల నియమించి నగరసంరక్షణభారమంతయు నాతనియందుంచెను.

నరసింహరాయలు పేరునకు రాజే గాని, తిమ్మరుసు మంత్రియే నిజమునకు రాజనిపించుకొనియెను. ఇట్టిడయ్యును దిమ్మరుసు తన సుఖమును గాంక్షింపలేదు. ఆంధ్ర మహాసామ్రాజ్యభద్రపీఠ మధిష్ఠించిన తర్వాత గొన్నాళులలోనే నరసింహరాయలు పరమపదించెను. అవల నాతని జ్యేష్ఠపుత్త్రుడయిన తిమ్మరాయలు రాజ్యారూఢు డయ్యెను గాని యతడు చిఱుతనంబున నుంటచే నరసరాయ లితనికి సంరక్షకుడుగా నుండి పరిపాలనము సాగింపజొచ్చెను. శౌర్యధనుండగు నరసరాజు, మహామేధావియగు తిమ్మరుసు మహామాత్యుడు, సహస్రాక్షుడగు గోవిందరాయలు కంటికి ఱెప్పవగిది గాపాడుచుండ నాంధ్రసామ్రాజ్యము రామరాజ్య మయ్యెను.


ఇమ్ముమ్మూర్తుల సామ్రాజ్యపరిశీలనమున శాత్రవులు భయకంపితులై యెప్పటికేని దమకు ముప్పు వీరివలన దప్ప దని చింతింప దొడంగిరి. ఇట్టి తఱుణమున నరసరాయలకు సరిపడని యుద్యోగి యొకండు నిమ్మరాయలకు విషప్రయోగమునేసి చంపి రాజ్యాపహరణమునకై నరసరాజే తిమ్మరాజును జంపించె నను వార్తను బ్రపంచించెను. మహామాత్యుండును, మహామేధావియు, దూరదార్శనిక పరిజ్ఞాతయు నగు తిమ్మరుసు చక్కగా యోజించి సాళ్వనరసింహరాయల ద్వితీయపుత్త్రుడయిన ఇమ్మడి నరసింహరాయలను సింహాసనాధిష్ఠితు నొనర్చి నరసరాజునకు న్యూనత లేకుండ జేసెను.

కాని యిమ్మడి నరసింహరాయలు చిఱుతప్రాయుడగుటవలన బరిపాలనావ్యవహారముల గొనసాగించుటకు జాలకుండి తన యన్నకు విషప్రయోగము చేసి మడియించిన ద్రోహితో నెయ్యము నెఱపి నరసరాయల కెగ్గొనరింప ప్రయత్నించెను. అప్పుడు తిమ్మరసు చేయునది లేక బలిమిమెయి రాజాజ్ఞం బడసి విషప్రయోగ మొనర్చినవాని గంఠ ముత్తరింపించి యంతతో దనివోక అప్రాప్తవ్యవహారదశ (*Mynority*) యందున్న యిమ్మడి నరసింహరాయలను రాజ్యమునకు దగ డని వేఱొకచోటికి గనిపి యతని పేరితో రాజ్యమును సాగింపవలసిన దని నరసరాజును నియోజించెను. దీన సాళువవంశ మంతరించి తుళువవంశమే యధికారమును బడసిన దని స్పష్టమగుచున్నది.

ఇవ్విధముగా తుళువనరసరాజు రాజ్యము సేయ నారంభింపగనే శత్రుమూక కకావికలై సంభ్రమచేతస్కు లయిరి. కాగా, దిమ్మరుసు సాళ్వవంశాభిమానుల నెల్ల ఱ వెడలనడపించి నరసింగరాయల రాజ్యాధికారబలదర్పములు సుస్థిర మొనర్చెను. నరసరాయలు శౌర్యధను డయ్యును స్వతంత్రించక పరిపాలనాభారమంతను దిమ్మయామాత్యునిపయిం బెట్టి, తన కుటుంబభారమునుగూడ నమాత్యునిచేతులయందె యుంచి, యాతని యుపదేశము ననుసరించి వర్తించుచుండెను. ఇవ్విషయమున నాదెండ్ల చిట్టిగంగనయు నిమ్మంత్రిశిరోమణికి జాల డని నరసరాయల విశ్వాసము. పట్టమహిషి మొదలుకొని పరిచారికవఱకును, బ్రభువు మొదలుకొని భటునివఱకు దిమ్మరుసుమంత్రి యన్న భయవిహ్వలులగుచుండిరి. రాజ్యాంగమున నతడు సేసిన కట్టుబాటుల ననుసరించి యెట్టివాడైనను మహామాత్యునకు దెలియకుండగనే స్వల్పకార్యమైనను జేయజాలకుండెను.

నరసరాయలకు దిప్పాంబ, నాగాంబ, ఓబాంబలను మూవురు భార్యలు గలరు. తిప్పాంబవలన వీరనరసింహరాయలు, నాగాంబవలన గృష్ణదేవరాయలు, ఓబాంబవలన నచ్యుతదేవరాయలు, రంగరాయలు నను కొమాళ్లను

(22-వ పేజీ చూడుడు)



కులాసా కబుర్లు

"మూడు మనువులు"

శ్రీ జి. యన్. సూరి

ఇంగ్లీషుఛలోక్తి ఒకటి దాదాపు ఈ విధంగా ఉంటుంది—"నీపిల్లలూ నాపిల్లలూ కొట్టుకుంటుంటే మన పిల్లలుపోయి విడతీశారు" అన్నదట ఒక మూడు పెళ్లిభార్య రెండవపెళ్లి భర్తతో. ఇది కేవలం ఛలోక్తి కాదనేవిషయం ఇటీవల జరిగిన ఒక ఖండాంతర వివాహం రుజువు చేస్తుంది. ముస్లిములలో ఇస్మాయిల్ తెగకు మతగురువైన ఆగాఖాన్ గారి కుమారుడు ఆలీఖాన్ వరుడు. హాలీవుడ్ తారలలో తారాచువ్వ అని ఖ్యాతి గాంచిన రీటాహేవర్తు వధువు. మంత్రం చెప్పిన వశిష్ఠుడు ఒక ఫ్రెంచిపట్టణపు కమ్యూనిస్టు మేయరు. వరుడికి ఇద్దరు కొడుకులు; వధువుకు ఒక కూతురు. ఇక కావలసిన దేమున్నది! వివాహమహోత్సవం అతి వైభవంగా జరిగిపోయింది.

ఆగాఖాన్ గారు తన కుమారుడి రెండవపెళ్లికి, కోడలిగారి మూడవపెళ్లికి తన ముద్దుల మూడవ భార్యతో హాజరై, యథావిధిగా కల్యాణం జరిపించి, వధూవరులను ఆశీర్వదించి, అతిథులను సత్కరించారు. ఆగాఖాన్ గారు అంటే సామాన్యుడు కాడు. డెబ్బదిరెండు సంవత్సరాల రెండువందల నల్భై పౌన్ల యువకుడు. ఫ్రాన్సు దేశపు 1931వ సంవత్సరం నాటి అందగత్తెను మూడవసారి పుస్తె కట్టిన ఘటికుడు. ప్రపంచంలోని ధనికుల జాబితాలో మొదటి అయిదారుగురు కుబేరులలో ముఖ్యుడు. మహమ్మద్ గారి ముదిముది మనుమల వంశోద్ధారకుడు. కోట్లకొద్ది ముస్లిములచేత కాళ్లు కడిగి దప్పిక తాగించగలిగిన స్వాములవారు. గుఱ్ఱాల కులగోత్రాలను సమగ్రంగా ఎరిగిన ప్రతిభాశాలి. రాజ్యం లేని మహారాజు. వెండి, బంగారు, వజ్రాలు మొదలైన సరుకులతో తులాభారం తూగిన మహారసికుడు.

అంతటివాడి కొడుకు కొండమీది కోతి కావాలంటే క్షణంలో రాక ఏమవుతుంది? కాకపోతే కొండమీది కోతిబదులు హాలీవుడ్ మెరుపుతీగను కోరాడనుకోండి. వచ్చి వెంటనే వడిలో పడిపోయింది. అయితే ఈ అపవి ఆమలకం అంబుధిలవణం కూడడానికి ఎంత గొడవజరిగిందో గమనించండి. రెండు నిండుసంసారాలు విచ్ఛిన్నం కావలసి వచ్చింది. పసిబిడ్డలు, కన్నతల్లికి కన్నతండ్రికి దూరం అయినారు. పెండ్లికి ముందు వధూవరుల దేశాటనం ఇంగ్లీషు పత్రికలను గగ్గోలు పెట్టింది. ఒక తెల్లస్త్రీ కొంత వరకైన రంగుకల్తీ గల పురుషుణ్ణి అంటగట్టుకున్నందుకు శ్వేతముఖులకు చెప్పరానంత కష్టం తోచింది. ఒక క్రైస్తవ ఆడది ముస్లిం మగవాణ్ణి అశాస్త్రీయంగా, అందులో నాస్తికుడైన కమ్యూనిస్టు ఆధ్వర్యాన పరిణయమాడినందుకు రోమన్ కాథలిక్ మతగురువు పోప్ మహాశయుడు ఆగ్రహించాడు. "పోండి, మీకు కలిగే సంతానం పాపసంభవ మగుగాక" అని శపించాడు. వివాహం జరుగుతుంటే ఓర్వలేని దుర్మార్గులు ఎవరైనా వచ్చి ఏమైనా చేసి పోతారేమో నని ఫ్రెంచి సైనికదళాలు విచ్చుతుపాకులతో వివాహమందిరంచుట్టూ గస్తీ తిరగవలసి వచ్చింది. ఇంత హంగామాతో ఆనంద మానంద మాయెనూ, మా రీటమ్మ (మూడోసారి) పెళ్లికూతురాయెను అని భజంత్రీలు బాకాలు ఊదారు. ఇది ఉత్తరోత్తరా ఏవిధంగా పరిణమిస్తుందో దైవజ్ఞులు నిర్ణయించాలి.

మూడు మనువులు బాగా అచ్చివచ్చేట్లు కనబడవు. ఇద్దరు మాజీభర్తలు సజీవులై ఉన్నందువల్ల నేఅష్టమ ఎడ్వర్డ్ చక్రవర్తి తాను మోహించిన రంభకోసం రాజ్యభ్రష్టుడైనాడు. తనకుభార్య ఉండగా భర్త ఉన్న మరొకస్త్రీని వలచిన బరోడామహారాజు పదచ్యుతుడైనాడు. ఇక ఈ తెగకు చెందిన అమా బాపతువాళ్లు ఎందరున్నారో లెక్క వేయటమే కష్టం. అయితే ఆలీఖాన్ గారికి రాజ్యం అంటూ ఒకటి లేదు కాబట్టి ఇటువంటి అవాంతరానికి అవకాశం ఉండదు. ప్రవక్త మహమ్మద్ గారి రక్తం అయిన నాళాలలో కొద్దో గొప్పో ప్రవహిస్తున్నది కాబట్టి ఇస్మాయిల్ పీఠాధిపత్యానికి భంగం సంభవించదు.

అదీగాక ఖాన్ గారి అనుచరులకు ఈలాంటి పెళ్లి అశాస్త్రీయం కాదు. మహమ్మదీయ న్యాయశాస్త్రంప్రకారం పురుషుడు ఏక కాలంలో నలుగురిని మించకుండా భార్యలను ఏలుకోవచ్చు. అంతకు మించితే ఖాజీ ఒప్పుకోడు. అయితే విడాకులను వారిమతం అంగీకరిస్తుంది. వారి 'లా' ప్రకారం పురుషుడు తన ఇష్టం వచ్చినప్పుడు, ఇష్టం లేని భార్యను కష్టం లేకుండా విడాకు లిచ్చి వదిలించుకోవచ్చును. ముమ్మారు తలక్ అంటే భార్య పరస్త్రీ అయిపోతుంది. ఉత్తరోత్తరా ఆ మహాపురుషుడు మనసు మార్చుకుని విడాకు లిచ్చిన తన మాజీభార్యను తిరిగి పెండ్లాడడానికి వీలు లేదు. ఆమె ముందుగా మరొకరిని వివాహమాడి ఆ వివాహాన్ని విచ్ఛేదం చేయించినప్పుడే మొదటివాడిని చేసుకోటానికి వీలవుతుంది. అంతేగాక మత గ్రంథాలున్న క్రైస్తవులు పార్శీలు మొదలైన కితాబియాలను పెండ్లాడడానికి వారిమతం అంగీకరిస్తుంది. అందువల్ల కాబోయే తమ మతగురువు అంకాల చిట్టితారను నిక్కాచేసుకున్నందుకు ఆ పీఠానికి చెందినవాళ్లు కోపగించకపోగా గర్వపడుతారు.

ఇక పెండ్లికుమార్తె రీటావిషయంలో ఆదుర్దాపడవలసిన అవసరం ఎంతమాత్రమూ ఉండదు. గంధర్వులు అనే ఒక తెగ ఉన్నదనీన్నీ, వాళ్లకొక లోకం ప్రత్యేకంగా ఉన్నదనీన్నీ, యవ్వనం తప్ప వారికి మరొక దశ లేదనీ, శుభకార్యాలకు పౌరోహితులతో వారికి నిమిత్తం లేదనీన్నీ, వారిరాజ్యంలో శిశుస్మృతిఅనే చట్టం ఇంకా శాసనసభ ప్యాసు చేయలేదనీన్నీ, అప్పుడప్పుడు ఆలోకం యువతులు హిమాలయపర్వతాలు, సుందరవనాలు మొదలైన ప్రాంతాలకు భూమిమీదకి షికారు వస్తారనీన్నీ, వచ్చి ఘోరతపస్సుచేస్తున్న మీసాల గడ్డాల మహర్షులనో, పరమ ఛాందస సద్బ్రాహ్మణులనో రెచ్చగొట్టి వ్రతభంగం చేస్తారనీ, అలాంటి సరదాలకు ఫలితంగా సంభవించిన శిశువులను ఏ పక్షులకో ఒప్పగించి వాళ్ల దేశం వాళ్లు వెళ్లిపోతారనీ మనం పురాణాలలో చదువుతూ ఉంటాము. ఈ గంధర్వుల విషయం పూర్తిగా భోగట్టాతీసి వారిలోకం లాంటి దొకదానిని అమెరికాలో బుద్ధిమంతులు నిర్మాణంచేసి, దానికి హాలీవుడ్ అని నామకరణం చేశారు, కొన్ని అంశాలతో మూలాన్ని కూడా మించిపోయే ఆచారాలను కల్పించారు. అటువంటి లోకపు గంధర్వస్త్రీ రీటాబీగం.

ఈ గంధర్వాంగనకూడ మహర్షులను వెతుకుతూ బయలుదేరింది. మన దేశం వచ్చినట్లయితే గడ్డాలమీసాల ఋషిపుంగవులు దొరికేవాళ్లే. కాని పశ్చిమముఖంగా దండయాత్రకు బయలుదేరటాన ఋషి దొరకకపోయినా ఋషి అంతవాడు, కాబోయే మతగురువు లభించాడు. తల్లి ఇటాలియన్ అయినా తండ్రి ఇండియన్ ముస్లిమే కాబట్టి వ్రతభంగం కావటానికి ఆలీఖాన్ అర్హుడే. ఇంతవరకు కథ సక్రమంగానే నడిచింది. ఇకమీదట పర్యవసానం కూడ పౌరాణిక గంధర్వాంగనల మాదిరి జరుగుతుందో చరిత్రకారులు గమనించాలి.

ఎవరు ఎలా పోతే నేమి, మన కెందుకు ఈ గొడవలన్నీ అని కొందరు అభిప్రాయపడవచ్చు. కాని ఇటువంటి రసవంతమైన సంఘటనలు జరుగకపోతే సామాన్యమానవులకు విలాసం కరువైపోతుంది. జీవితం బరువుగా తోస్తుంది. నిత్యమూ రేషన్ ఇబ్బందులనో, శాసనసభా కర్మాగారంలో తయారయే క్రొత్తక్రొత్త చట్టాలనో, మంత్రులపైని ఆరోపణలనో, చన్నపట్నపు సమస్యనో, కమ్యూనిస్టుల హడావుళ్లనో—ఇత్యాది విషయాలను గురించి మనస్సును కలవరపరచుకునేవాళ్లకు ఇటువంటి సరదా సమాచారాలు అత్యంత అవసరం. విలాసం, లేకుండా కాలం వెళ్లతీయటం కందెన లేకుండా బండి చక్రాన్ని తిప్పినట్లు ఉండితీరుతుంది.

ప్రపంచ శాంతికి ట్రూమన్ పథకం

"యూరోపియ దేశాల ఆర్థిక స్వాస్థ్యాన్ని పునరుద్ధరించడం అమెరికా నిజ యోగక్షేమముల దృష్ట్యాకూడా లాభకారియే. అందుచేత యూరోప్ సహాయ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించడం అవసరం. ఈ నాడు ఏ జాతీ ఏకాంతముగా జీవితం గడుపుతూ ఐశ్వర్య సౌభాగ్యాలు సాధించలేదు.

"అమెరికా సెనేట్ ఉత్తర అట్లాంటిక్ ఒడంబడికను అత్యధిక సంఖ్యాబలంతో ఆమోదించు నన్నటలో సంశయం లేదు. యూరప్‌లో ఇటీవల తలజూపిన ఆశంకలు అనుమానాలు దీనితో మూలముట్టుగా నివర్తి కాగలవు. స్వతంత్ర జాతుల దురాక్రమణ ప్రతిఘటనా శక్తిని పెంపొందించడానికి తోడ్పోడనే మిలిటరీ సహాయం చేయడంకూడా అవసరం.

"సమస్త ప్రపంచముయొక్క ఆర్థిక పునరుద్ధరణ, అమెరికా శక్తి సంపదల మీద ఆధారపడియున్నది. ఏ కారణంవల్లనైనా అమెరికా జవసత్త్వాలకు ఘాత కల్గినట్లయితే, యావత్ప్రపంచమూ నిరాశాసంక్షోభాలలో తక్షణమే నిమగ్నమై పోగలదు. మన కున్న ఆర్థిక వ్యవస్థవంటి వ్యవస్థలు భగ్నమైపోకమానవనీ, మనతోపాటు తక్కిన ప్రపంచాన్నికూడా వినాశముఖంగా మనం లాగుకొని పోవుచున్నామనీ, కమ్యూనిస్టులు జోస్యము చెప్పుచున్నారు. ఇది వట్టి మిథ్యాసిద్ధాంతమనీ, కమ్యూనిస్టులే ఇట్టి తప్పుడు సిద్ధాంతాలను ప్రతిపాదించ సమర్థులనీ నేను విడిగా చెప్పనవసరం లేదు.

"యూరోపియ పునరుద్ధరణ కార్యక్రమంకింద ప్రభుత్వం చేయదలచిన ధనసహాయాన్ని కాంగ్రెసు తగ్గించినట్లయితే అది కమ్యూనిజానికి అఖండమైన విజయంగా పరిగణింపబడుతుంది. కాని ఇటువంటి ప్రమాదాన్ని కాంగ్రెసు చేయదని నాకు విశ్వాసం ఉన్నది."

వెనుకబడిన దేశాలకు ట్రూమన్ సహాయం

ప్రపంచంలోని వెనకబడిన ప్రాంతాలకు అమెరికా చేయ దలపెట్టిన సహాయ కార్యక్రమాన్ని అధ్యక్షుడు ట్రూమన్ వచ్చేవారం సవివరంగా కాంగ్రెసుకు నివేదించగలడని విశ్వసనీయంగా తెలియవచ్చింది. ఈ సహాయకార్యక్రమం కింద సుమారు 10 కోట్ల డాలర్లను ఇవ్వవలసిందిగా అధ్యక్షుడు కాంగ్రెసును అర్థించునని తెలియుచున్నది.

ఈ కార్యక్రమాన్ని 3 ప్రధానభాగాలుగా విభజించవచ్చును. అవి ఏవనగా, ఒకటి.— అమెరికా ప్రభుత్వము అమెరికా సాంకేతిక సహాయం కోరే దేశాలతో సమష్టిగా గాక విడివిడిగా ప్రభుత్వహోదాలో ఒడంబడికలు చేసుకుంటుంది. సహాయకార్యక్రమంలోని ఈ భాగంకింద అధ్యక్షుడు 3 కోట్ల డాలర్లనుంచి 4 కోట్లు డాలర్లదాకా అడుగవచ్చును. రెండు వెనుకబడిన ప్రాంతాలలో జీవనప్రమాణములను అభివృద్ధి చేయడానికి ఐక్యరాజ్య సమితి వేసిన కార్యక్రమంతో అమెరికా తోడ్పడడం. దీని కింద అధ్యక్షుడు మరో 5 కోట్ల డాలర్లు అడుగవచ్చును. మూడు: అమెరికాలోని ప్రైవేటు పరిశ్రమదారులను వెనుకబడిన దేశాల ఆర్థికాభివృద్ధికి సాయపడవలసిందిగా ప్రోత్సహించడం. ఎగుమతి, దిగుమతి బాంకుచేత పరిశ్రమదారులకు ద్రవ్య మారకపు గారంటీ ఇప్పించమని అధ్యక్షుడు ట్రూమన్ ప్రతిపాదించగలడు. అమెరికా పెట్టుబడిదారులకు విదేశాలలో పెట్టిన పరిశ్రమల మీద డాలరురూపంలో లాభాలు చేకూరేట్లు గాను, పరిశ్రమలు జాతీయం చేయబడితే, తగిన నష్టపరిహారం లభించేట్లుగాను చేయడమే ఈ ద్రవ్య మారకపు గారంటీ ఉద్దేశ్యం. అమెరికా పెట్టుబడిదారుల సాయంకోరే దేశాలు ఈవిషయమై హామీ ఇస్తూ ఒడంబడికలు వ్రాసి ఇవ్వవలెను.

విశాలాంధ్ర నిర్మాణము

(9 వ పేజీ తరువాయి)

వాదోపవాదములు జరుగుట. ఈ ప్రాంతాల ఆంధ్రులు విశాల హృదయముతో సోదరభావంతో మెలగినచో, తెలంగాణావాసులు యెట్టి పరతుతిను పెట్ట రనియే నా విశ్వాసము.

తెలుగు పత్రికలు

ఇక మన తెలుగుపత్రికలనుగూర్చి విచారించవలసియున్నది. మద్రాసు రాష్ట్రములోని ఆంధ్రజిల్లాల జనాభా ఒక కోటికి పైగా నున్నను రెండు దినపత్రికలు మాత్రమే యున్నవి. సుమారు ఒకకోటి జనాభాయున్న తెలంగాణములో ఒక్క దినపత్రిక మాత్రమే యున్నది. అది సుమారు రెండుసంవత్సరాలనుండియే దినపత్రికగా మారినది. బాల్యదశలోనే రజాకార్ల ప్రతాపాన్ని యెదుర్కొనవలసి వచ్చింది. రెండు కోట్లకు పైగా నున్న ఆంధ్రులకి మూడు దినపత్రికలుమాత్రమే యుండుట ఆంధ్రుల స్థితిని స్పష్టముగా తెలియజేయును. ఆంధ్రులలో సగటున నూటికి 10 మంది చదువను వ్రాయును గలవారున్నను, మొత్తం 20 లక్షలమంది చదువుకున్నవారుండవలెను. 5 గురికి ఒక దినపత్రిక చొప్పున లెక్క వేసినను, 4 లక్షల పత్రికలు వ్యాప్తిలో నుండవలెను. కాని మొత్తం మూడు దినపత్రికల వ్యాప్తి 50 వేలకు మించి లేదని నా అంచనా. అంటే, 400 మంది ప్రజలకు ఒక పత్రిక వ్యాప్తిలో నున్నది. పశ్చిమ దేశాలలో సగటున ప్రతివాడు రెండు పత్రికలు చదువునని తెలుస్తున్నది. మనదేశంలోగూడా అట్టి పరిస్థితి యేర్పడుటకు మనము కృషి చేయవలసి యున్నది. హైద్రాబాదులో ఆంధ్రులు తెలుగుపత్రికలకన్న, ఉర్దూ, ఇంగ్లీషు పత్రికలే యెక్కువగా చదువుచున్నారు. హైద్రాబాదులోని 20 ఉర్దూ దినపత్రికలను పోషించుటలో మనవారు చాలావరకు తోడ్పడుచున్నారు. మారిన పరిస్థితులలో వారు తమ అలవాటులనుగూడా మార్చుకోవలసి యున్నది.

అనేక తెలుగుపత్రికలు ఆరంభమైన కొద్దిరోజులలోనే అంతమొందుట మనము చూస్తూ

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో., రాజమండ్రి

కొండపల్లి

శ్రీ వసంతరావు రామకృష్ణరావు

విజయవాడకు సమీపంగా నైజాము రైలు మార్గంలో కొండపల్లి ఉన్నది. ఈ గ్రామం చారిత్రకంగా ప్రాముఖ్య మైనది. దీని చుట్టుప్రక్కల ఎటు చూచినా కొండలే. అందువల్లనే కొండపల్లి అని పేరు వచ్చింది.

కొండపల్లిఊరు కొండల పంక్తిలోనే ఉన్నది. ఈ కొండలలో ఒక శిఖరంమీద పెద్ద కోట చూడ్డానికి గంభీరంగా అగుపిస్తుంది. కొండపల్లిగ్రామానికి ఇటు ఉత్తరంవైపూ, అటు దక్షిణంవైపూ, కొండలుఆనుకున్నాయి. అయితే కొండశిఖరంమీద ఉన్న ఆ పెద్దకోట వినోదయాత్ర చేసేవారిని మొదట ఆకర్షిస్తుంది.

నేనూ, నావెంట వచ్చిన మరో మిత్రుడూ చెట్టుపట్టాలు వేసికొని కొండ ఎక్కడం ప్రారంభించా లనుకొన్నాం. అది మార్గశిరమాసం. చలికాలం. కొంచెం చలిగాలి వీస్తూంది. దీర్ఘంగా ఉన్న ఆ కొండబాటమీదుగా ఆ బురుజు చేరుకోవాలంటే కొండపల్లిఊరు దాటాలి.

ఉదయం ఎనిమిదిగంట లయింది. కొండల పంక్తి వెనుకతట్టునుండి వెచ్చని సూర్యకిరణాలు శరీరానికి వెచ్చదనమూ, ఉత్సాహమూ ప్రసాదిస్తున్నాయి. ఊరు చూడడానికి పెద్దది కాదు. కాని కొండపల్లిలో జీవనం సాగిస్తున్న వారిని గురించి తెలిసికోవా లని కుతూహలం కలిగింది.

అట్లా రోడ్డుమీదుగా వెడుతూంటే కొండపల్లిబొమ్మల మాట జ్ఞప్తికి వచ్చింది. తెలుగు దేశంలోకల్లా చక్కని ఆటబొమ్మలు తయారు చేసే ఊరు కొండపల్లి అని గుర్తుకు తెచ్చుకున్నాను. కొండపల్లిశిధిలాలగురించీ, కోటబురుజులగురించీ, కొండబాటలగురించీ తెలిసికోవడానికి ముందుగా కొండపల్లిబొమ్మలు తయారయే విధానం తెలిసికోవా లనిపించింది.

అట్లా వెడుతూండగా ఒక ఇంటిగుమ్మంమీద బొమ్మలు తయారుచేస్తున్నారు కొందరు. వాళ్ళ చేతుల్లో కర్రముక్కలూ, రెండుమూడు ఇనుప పనిముట్లూ అవుపించాయి. వాళ్ళు ఆ పనిముట్లతో కర్రను నేర్పుతో తొలుస్తూ చూస్తూండగానే దానికి బొమ్మఆకారం తీసికొనివస్తారు. ఈ పనివాళ్ళను నకాసీ లని అంటారు వారికి బొమ్మలు తయారుచేసికోవడం, వాటిని అమ్మి జీవనం సాగించడం, వంశపారంపర్యంగా వస్తూన్న వృత్తి. పనివాళ్లు బొమ్మలు తయారుచేస్తున్నపుడు ప్రదర్శించే హస్తలాఘవం, శిల్పనైపుణ్యం చూసితీరాలి మెత్తని ఆటబొమ్మలు తయారుచేసికోడానికి పనికివచ్చే సున్నితమైన కర్ర గ్రామంలోనూ, కొండలపంక్తిలోనూ విస్తారంగా దొరుకుతుంది.

కొండపల్లిశిధిలాలగురించి తెలిసికోవడం ఒక ఎత్తు; కొండపల్లిశిల్పాలగురించి తెలిసికోవడం మరో ఎత్తు. చారిత్రకవిషయాలదృష్ట్యా పరిశీలిస్తే క్రీస్తుశకానికి పూర్వమునుండీ కొండపల్లి శిల్పకళాప్రాభవం గడించుకొన్నట్లు తెలుస్తుంది. కాని ఆటబొమ్మల తయారీ ఎప్పుడు ప్రారంభమైనదో మనకు తెలియదు.

కొండపల్లిబొమ్మలగురించి అనుశ్రుతంగా వస్తూన్న పూర్వగాథ ఒకటి ఉన్నది. హిందూ మతిసంప్రదాయానికి అనుగుణమైన విగ్రహాలను దేవతాస్వరూపంలో తయారుచేసి, దేవాలయాల వంటి పవిత్రప్రదేశాలలో ఆ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించడం హిందువుల ఆచారం. భగవత్స్వరూపానికి ప్రతిరూపంగా విగ్రహాలను (బొమ్మలు) ఆనాటి కొండపలిశిల్పులు తయారుచేసారు. అప్పటి ఆచారాన్ని అనుసరించి, మొదటిసారిగా వినాయకుడి విగ్రహం తయారుచేసి, విఘ్నం రాకుండా వెంటవెంటనే సరస్వతి, విష్ణువు, మొదలయిన దేవతా విగ్రహాలను చక్కని రూపంతో తయారుచేసారు. రాను రాను, కాలక్రమంలో, ఈ శిల్పం అనేకరూపాలలో, అపురూపమైన ఆకారాలలో అవతరించి, నేటికీ శిల్పకళాపరిమళాన్ని నలుదిక్కులా వెదజల్లుతూందిట!

దసరాఉత్సవాలకు ఆంధ్రుల ఇండ్లలో చక్కని బొమ్మలకొలువులు తీర్చి, నవరాత్రులూ వైభవంగా దసరాపండుగను ఆనందంతో జరుపుతారు. ఆటబొమ్మలు అనేకమైన అందమైన రూపాలలో కొండపల్లిలో తయారై తెలుగుసీమ అంతటా అమ్మడవుతాయి. నేటికీ కొండపల్లి బొమ్మల శిల్పంలో చక్కని విన్యాసం నిలిచిఉంది!

కొండపల్లి బొమ్మల పనివాళ్ల జీవనం నిరాడంబర మైనది. వారి కళోపాసన, ఆ సక్తి, బొమ్మల రూపంలో నిత్యమూ అభివృద్ధి అవుతూంది!

మెల్లగా ఊరు దాటాం. వంకరటింకరగా సుడులు తిరుగుతూ ఉన్న మార్గంగుండా, చెట్ల జీమూతంలో పడి కొండ ఎక్కుతున్నాం. కొండమార్గంలో ద్వారాలు, చిన్న కుటీరాలు శిథిలావస్థలో కనపించాయి. అక్కడక్కడ వర్తులాకారంలో ఏవో కట్టడాలు కనపించాయి. కొండపల్లి బొమ్మల శిల్పంలాగు, కట్టడాలు, స్తంభాలు మొదలైనవాటిమీద శిల్పకళ కనిపించింది. కొండ ఎక్కి, పైగా ఉన్న మైదానం గుండా వెడుతూంటే పాడుపడిపోయినా, ఎత్తుగా, గంభీరంగా ఉన్న గోడలు అవుపించినై కొండ ఎక్కి మీంకు వెడుతున్నకొద్దీ, కొండలోయ లోతుగా, పాయ పాయలుగా విడిపోయినట్లు అందంగా కనిపించింది.

కొండపల్లి కోటలూ, కొండబాటలూ బురుజులూ, వీటిగురించి కొంచంగా తెలిసికొన్నాం. కొండపల్లికి వినోదయాత్ర చేసిన వాళ్లు ఎంతోమంది, ఆ కోటగోడలమీద తమ ఆగమనవిశేషాలు గురించి వ్రాశారు. కొండపల్లి శిదిల చరిత్రకు జీవం వచ్చే దెప్పుడా అనిపించింది

ఆ కొండమీదనే బంగళా ఉన్నది. దూరంగా ఒక పాడుపడిన ఫిరంగి, సైనికుడు నిలబడేరాతి స్తంభం ఇవి చూస్తే చరిత్రకారులు కొండపల్లి సంగ్రామ చరిత్రను ఊహిస్తారనుకుంటాను! కొండపల్లి గ్రామం రెడ్డి రాజులు కట్టించినట్లు అక్కడివాళ్లు చెప్పారు. ఇది ఒక సైనిక స్థావరం దూరంనుండి వస్తూన్న శత్రుసైన్యాలను గమనించడానికీ, సైనిక బలాన్ని నిరోధించడానికీ, తగిన కట్టుదిట్టాలతో, కోటగోడలతో, బురుజులతో, ప్రాకారాలతో, కొండల పంక్తితో, పరివేష్టింపబడి కొండపల్లి గ్రామం శత్రువులకు అభేద్యంగా ఉండే దన్న విషయం తెలుస్తుంది.

యున్నాము. పత్రికలు ఆరంభం చేయుటకు ముందు గట్టి పునాదులు వేసుకొనుట అత్యవసరము.

ఈ ప్రాంతపు పత్రికలు తెలంగాణములో వ్యాప్తిలో నున్నట్లు, తెలంగాణా పత్రికలు ఈ ప్రాంతంలో వ్యాప్తిలో లేవు. అన్ని ప్రాంతాలవారు యితరుల అభిప్రాయాలను దెలిసికొనుటకు ఆ ప్రాంతాల పత్రికలు చదువుట అవసరము.

నేను తెలంగాణావాసుల అభిప్రాయాలను మీకు తెలియజేయుటకు ప్రయత్నించితిని. తామందరూ యీ విషయాలనుగూర్చి ఆలోచిస్తారని విశ్వసిస్తున్నాను.

నాకబలి

(5-వ పేజీ తరువాయి)

పోయింది. అతని భీరుత్వం అంతా హాస్యాస్పదంగానే ఆమె మనస్సుకు తట్టుతోంది.

ఆమె అపహాస్యానికి తానుపాత్రమైనందుకు, అధికంగా చిరాకూ కోపమూవచ్చాయి. ఆమె మాత్రం భయపడలేదా? తనకన్న భీరు వైపోలేదా! ఇంతలో ఇంత ఆదమరుపు—ఇంత క్షణక్షణంగా ఇంతమార్పు!

"ఎవరూ"

"ఎవరూ లేరు."

పిట్టగోడమీదుగా అతన్ని పైకి చేరుకొంటూ వెన్ను నిమురుతూ వంటింట్లోకినడిపిస్తోంది. ఆ చేతలన్నీ తన్ను అసమర్థునికింద లెక్కవేస్తూం దన్న ఉక్రోషంలో, నరాలను మండిస్తూనే ఉన్నాయి.

విలాసంగా చెపుతూంది: "ప్రక్క ఇంటివారి పిల్ల క్రోషాన్లాదిక నివచ్చింది"

పూర్తిగా గుండె తేరుకొంటూంది. "మరి ఇంతసేపు జేశావేం?"

కళ్ళు చికిలించి వెక్కిరిస్తూంది. "ఏం, చేస్తే!—" అతని ముఖకవళిక చూసి మాట మార్చుకొంది. అనునయంగా అంటూంది: "ఇగరు పోగును మంచిమాటగా నెమ్మదిగా వదుల్చుకోక అడావుడి జేసి పొమ్మంటే, అనుమానం కల్గదూ?"

లోకజ్ఞానమే! నిజమే! అంత అమాయకపు పల్లెటిపిల్లగా కనబడిన స్త్రీకి సద్యస్స్ఫురితంగా ఉన్న ఇంగితజ్ఞానం, ఆమెకన్నా ఎంతో తెలివైనవాడిని, చదువుకొన్నవాడిని అన్న తనకు లేదు.

"నే వెళ్లివస్తా.!"

ఆమె వారించింది. "కాఫీ ఇస్తా నన్నాను. ఆశ పెట్టి మానిస్తే ఆ శకునపులు శేస్తాయి-అయిపోయిందిగా, తాగి వెళ్లు"

ఆకర్షణ ఇంకా అల్లాగే మిగిలి ఉంది. చికాకు దాచుకొంటున్నాడు.

ఆమె ఒయ్యారంగా కాఫీ అందిచ్చింది. ఒక కప్పులోనే ఇద్దరిచేతాసంగులుగా తాగిస్తూంది

కాఫీకి రుచి ఆమె చేతిగుంచి తాగిన గుచి లేదు. రేపు రమ్మన్న ఆమెమాటకు ఊకొట్టి నెమ్మదిగా మెట్లు దిగివచ్చాడు.

వీధిగుమ్మంలో ఎవరూ లేరు. మెట్లగది వెనుకగా క్రింది ఇంటిలోకి ఉన్న గుమ్మం ఎప్పుడూ వేసే ఉంటుంది. ఎవ్వరి సవ్వడీ లేదు. మేడ దిగినట్లు కాకుండా ఆగుమ్మంలోంచే వస్తున్నట్లుగా, వాకిలిగుమ్మంలో ఇటూఅటూ చూసినట్లుగానే సర్వసాధారణంగా వస్తున్న నటనలో బైటసందులో పడ్డాడు. సందుకూడా మాగుసూల సందు. ఎక్కడో సందుముందు పులోగా నిమను ష్య సంచారం లేదు.

ఒకమూ సందు గోడ నానుకొని అవతల వైపుకు చూస్తూ నిల్చున్నాడు ఈ దోవ కన్నా దొడ్డిదోవసరిగా తెలుసుకోటం నయమేమో! కాని బాహాటంగా ఇటు రావటంలోనే, అసామాన్యం ఏదీ కనుపించని రక్షఉంది

"ఏదైనా ఇకముందు జాగ్రత్తగాఉండాలి!" సంగుమాలు పు తిరిగాడు.

"అసలు ఇంతతో స్వస్తి చెప్పుకోవాలి" మన స్సుదాలి గుంటల పక్కలు వేస్తూంది. కోర్కెలు సన్నగా విలపించాయి. "ఏమైనా రేపు—ఇప్పుడు, మళ్ళీ ఇటు రాకూడదు" అనే నిర్ధారణ చేసికొన్నాడు. కోర్కెలు ఆమాత్రం అవకాశమే చాలు నను కొన్నాయి.

"యేల్" విశ్వవిద్యాలయం

(16-వ పేజీ తరువాయి)

అందుచేత న్యూయార్కు పట్టణానికి, అంటే ప్రొఫెసర్ నాటకరంగానికి, బహు సమీపంలో ఉండటంవల్ల, యేల్ విశ్వవిద్యాలయ నాటకశాఖకు తక్కిన విశ్వవిద్యాలయాల నాటకశాఖలకన్నా, అధికంగా కళాశిక్షణకు అవకాశం కల్గింది. నాటకరంగంలోని, ప్రముఖులలో చాలామందిని వివిధ విధాలలో, విద్యార్థుల శిక్షణకై, యేల్ విశ్వవిద్యాలయం ఉపయోగించుకొంటూంది. ఆయా నటకావతంసులు, నాటకచక్రవర్తులు అతిథులుగా యేల్ విశ్వవిద్యాలయానికి నిత్యం వస్తూ ఉంటారు. న్యూయార్కునుంచి గంటసేపటిలో రైలుమీద హేవిన్‌కు రాగల సౌకర్యం ఉండటంవల్ల, అమెరికన్ నాటకరంగంలోని ప్రముఖులతో ఇక్కడి విద్యార్థులకు నిత్యపరిచయం ఉంటుంది. విద్యార్థులుకూడా బ్రాడ్వేలో వేస్తున్న సరికొత్త నాటకాలన్నిటినీ ఎప్పటికప్పుడు వెళ్లి చూస్తూ కొత్తలు నేర్చుకొనేందుకు కూడా, యేల్ విశ్వవిద్యాలయం, న్యూయార్కు దగ్గిరలో ఉండటంవల్ల, నేర్చు అవకాశాలు ఎక్కువ ఉన్నాయి.

యేల్ విశ్వవిద్యాలయంలో "నాటకరచన", నాటకరంగాని కంతకూ కీలకమని, విద్యార్థుల ప్రతిభ "నాటకరచనలో" ఎక్కువగా వర్ధిల్లడి అయేందుకే ఎక్కువ ప్రాముఖ్య మిస్తారు. నాటకాలు వ్రాసిన విద్యార్థులకు సరియైన అవకాశాలిచ్చేందుకు, మళ్లీ నాటకాల ప్రదర్శనంలో ఎల్లా ఉంటాయో చూపి చెప్పేందుకు, ప్రొఫెషనల్ డైరెక్టర్ల ఆజమాయిషి క్రిందనే, ఆ నాటక ప్రదర్శనాలు ఇప్పిస్తారు. విద్యార్థి నటకులకు, ప్రదర్శనశిక్ష అందుతున్న విద్యార్థులకూకూడా, ఈవిధానం చాలా ప్రయోజనకరంగా, జీవితవృత్తికి అంతర్భాగంగా, వృత్తికి ఉపోద్ఘాతంగా ఉంటుంది.

ఎడ్వర్డ్ రీపూ అనే సుప్రసిద్ధ బ్రాడ్వే నాటక దర్శకుడు, చాలా సంగీతనాటకాలు మొదలైన ఎన్నోరకాల నాటకాలకు దర్శకుడుగా, న్యూయార్కులో ప్రసిద్ధిచెందాడు. అతను యేల్ విశ్వవిద్యాలయ విద్యార్థుల నాటకప్రదర్శనాలకు ఈమధ్య చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. ఆ వృత్తిలో ఉన్న నటకులతో సంచరించే విధానానికి, విద్యార్థి నటకులతో సంచరించే విధానానికి, అతనేమీ భేదా కన్పరచడు వీళ్లకూ వృత్తిలో ఉన్న వాళ్లకు లాగే గూసి శిక్షణ ఇస్తాడు. అయితే "విద్యార్థి రచయిత" పట్ల మాత్రం అతి సుహృద్భావంతో సంచరిస్తాడు.

"కంపానియన్సు ఆఫ్ లెఫ్ట్ హాండ్" అనే నవలను నాటకంగా వ్రాశాడు. ఒక విద్యార్థి ఇటాలియన్ సముద్రతీరం పల్లెలో, మిత్రసైన్యాలు దిగటం పురస్కరించుకొని వ్రాసిన నాటకం నవలలో సైకాలజీయే నాటకం రచనలో ఎక్కువ ప్రదర్శిత మయింది. రివ్యూముందు రచయితను నిరుత్సాహ పరచలేదు. కథా ఘట్టాలలో ముఖ్యమైనవన్నీ తెరవెనుక జరుగేవిగానే ప్రదర్శనం రిహార్సల్సులో కనబడ్డాక తప్ప, రచయితకు నాటకంలోని లోట్లు గోచరం కాలేదు. సన్నాహాలన్నీ అయిపోయి ఉండటం వల్ల నాటకం అల్లా వెయ్యక తప్పక వచ్చింది.

ఆ నాటకాన్నే కొద్దికొద్ది చిన్నమార్పులతో రంగురంగుల సీనులూ, రంగవాతావరణమూ, నటులలో అధికంగా హావభావవిలాసాలూ, ఇప్పిస్తూ రివ్యూ నాటకాన్ని రక్తి కట్టించగలిగే టప్పటికి ప్రదర్శనాచాతుర్యంలోని, మెళుకువలుకూడా, రచయితకూ తక్కిన విద్యార్థులకూ కూడా సుబోధకమయాయి.

రివ్యూతో కలిసి పనిచేయటంతో బ్రాడ్వే నాటకాలలోకూడా పనిచేయగల అవకాశం విద్యార్థులకు కలిగింది. పెద్ద పెద్ద థియేటర్లలో పెద్ద నాటకాలమధ్య ఈ విద్యార్థుల నాటకాలనుకూడా, విద్యార్థులచేత ప్రదర్శనాదిక సర్వస్వమూ చేయిస్తూ, రివ్యూ వేయించసాగాడు. నాటకరంగంలో అన్ని శాఖలలోనూ, వృత్తిలో ఉంటే వచ్చే ప్రత్యక్ష అనుభవాలుకూడా ఈ విద్యార్థులకు వృత్తిలో చేరకముందే స్వానుభవంలోకి వచ్చాయి. "నాటకవిద్య"ను వృత్తికి తగిన విద్యగా నేర్పటం ఎల్లాగో యేల్ విశ్వవిద్యాలయం, ప్రత్యక్షంగా, అనేకఏండ్ల అనుభవంతో సాధిస్తూ వస్తూంది.

కుష్ఠు * బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయివ్యాధులకు, గ్యారంటీచికిత్స. క్యాటలాగుఉచితం. జి. వి. రెడ్డి, ప్రొప్రయిటరు. బి. రెడ్డి & కో. (రిజస్టర్డు) గోపాలపురం, తూ॥గో॥జిల్లా.

నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము. నిక్కాక. నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును కాంతిని వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెని. పెరిదేపి-నెల్లూరు జిల్లా

బ్రాంచి: 7 సీను మొదలివీధి మద్రాసు



సాళువ గోవిందరాయలు

(19-వ పేజీ తరువాయి)

బడసెను. నరసరాయనికి నాగాంబయనిన ప్రేమ యధికము. కాగా దిప్పాంబ తన కుమారునకు బట్టము గట్టదేమో యని యోజనాపరంపరలకుం జిక్కి యెట్టకేలకు దన సవతిబిడ్డడగు శ్రీకృష్ణదేవరాయల జంపించినచో దన పని గట్టెక్కు నని తలచి తత్ప్రయత్నముల నిమగ్న యయ్యెను. ఇప్పని నెట్లో గ్రహించి మహామాత్యుడు గోవిందరాయలతో యోజించి విద్య జెప్పుదు నను వ్యాజమున గృష్ణదేవరాయలకు దనయింటికి జేర్చి యొరులకు దెలియకుండగ సంరక్షణ మొనర్చెను. అందులకయియే మహామాత్యుని 'అప్పాజీ' యని నోరార బిలచుచు గృష్ణరాయలు విద్యల నన్నిటి నాతనిమ్రోల నేర్చికొనుచుండెను. మహామాత్యులు రాజ్యసంరక్షకులు, రాజప్రాణసంరక్షకులు నయిరి.

ఇటుల గొన్నాళ్లు కడచన్న పిదప నరసరాయలకు శరీరస్వాస్థ్యము దప్పి నాడునాటికి గృశింపజొచ్చెను. ప్రాణోత్క్రమణ స్థితి దటసించి మహామాత్యులవారిం బిలువం బనిచి "రాజ్యప్రదాతా! రాజ్యసంరక్షకా! మీ రాజనీతివైతృత్వమున సాళ్వనరసింహరాజు కర్ణాటకాంధ్రసామ్రాజ్యమునకు నధిపతి యయ్యె. మీ ప్రజ్ఞాతిశయమున దుళువవంశ స్థుడనగు నేనీ సామ్రాజ్యమున కధినేత నయితిని. నీ నేర్పు ననుసరించి నాయనంతర మెవడు ఈ మహాసామ్రాజ్యమునకు పట్టాభిషిక్తు డగునో! మహామాత్యా! నాకొమారులు వీరు. వీరిని సంరక్షించు భారము మీది. సాళ్వవంశజులవలన నెట్టి ముప్పును రాకుండ జూచి యీ మహాసామ్రాజ్యాధిపత్యము నాకొమాళ్లకు జెందించి మహామాత్యులగు చిటిగంగనభావపరంపరలు గొనసాగునట్లు నూడవలసిన విధి మీయది"—అని వేడికొని కొమాళ్ల నాతని కప్పగించి నిశ్చింతగా గ్రీ. శ. 1503 వ సంవత్సరమున స్వర్గీయు డయ్యెను. కాగా, భర్తృమరణబాధకంటె దన కొమారుడైన వీరనరసింహరాయని పట్టాభిషేకవిచారబాధయే తిప్పాంబను బాధింప జొగెను. మహామాత్యుండగు తిమ్మరుసు దూరమాలోచించి వీరనరసింహరాయనికే పట్టము గట్టెను. ఇప్పని సాళ్వవంశజులకు దదభిమానులకు గష్టముగా నున్నను మహామాత్యుని బ్రచ్ఛింపం దగు శక్తియుక్తులు లేకుండుటచే దూష్ణీంభావము వహించిరి.

నగరాధ్యక్షుడయిన గోవిందరాయలు సాళ్వవంశాభిమానుల గనిపట్టి, తగినట్టు శిక్షించి, కట్టుదిట్టము లొనర్చెను. ఈ కట్టుదిట్టముతో దుళువవంశాధికారము కుదుటవడియెను. ఆవల దిమ్మరుసుమహామాత్యుని యోజనముం బట్టి వీరనరసింహరాయలు దీర్థయాత్రావ్యాజమున బహుళ సైన్యనివహంబులతో గదలి సామ్రాజ్యమందంతను సంచరించి యెదుర్కొనిన సామంత నృపాలుర నదిమి కప్పముల గొని నెలకొలుపుటయే గాక 'భుజబలవీరనరసింహరాయ'డని ప్రసిద్ధి గాంచెను. ఆ సమయముననే శ్రీకృష్ణదేవరాయలు దక్షిణకర్ణాటరాష్ట్రములపై దండెత్తి యుమ్మత్తూరు, శివసముద్రము లోనగు దుర్గముల వశపఱచికొని యా రాజ్యమున కంతకును 'శ్రీరంగపట్టణము' రాజధానీనగరముగా నేర్పాటుసేసి యచట దన ధ్వజమును బ్రతిష్ఠించెను. ఆ తరుణముననే యచ్యుతరాయ శ్రీరంగరాయలు 'కొంకణము'పైకి బోయి యా రాజన్యుల గెలిచి యందలి పాళెగాండ్రను లోబఱచుకొని తమ ప్రభుత్వము నెలకొల్పిరి. ఇవ్విజయముల నన్నిట శ్రీకృష్ణదేవరాయల విజయములే యతిశయము లగుటచే సామ్రాజ్యమందంతట నాతని పేరే యతిశయించి యుండెను. ఈరీతి సామ్రాజ్యము కుదుటబడిన తర్వాత దిమ్మమంత్రి బహమనీసులతానుల, గజపతిచక్రవర్తుల గెలుపొందుటకు దగు ప్రయత్నములు సాగింప నారంభించెను.

ఇట్టి ప్రయత్నపరంపరలు సాగుచున్న యపుడు వీర నరసింహరాయలకు 'నంజు'వ్యాధి పొడమి, ప్రబలమై యౌషధసేవవలని ప్రయోజన మగుపడక, మరణ మాసన్నమైన దని తోచి మహామాత్యుడు సామ్రాజ్యభారవహుండు నగు తిమ్మమంత్రిని రావించి "మంత్రిశేఖరా! గజపతులను బహుమనీసులతానులను గెలుపొందు యశస్సు నాకు లేదు. నాతర్వాత గృష్ణరాయలకే పట్టణము గట్టుదు వని నాకు దెలియకపోలేదు. అయినను గృష్ణరాయలకంటె నా కొమారుడే మీకు వలంతుడు. కాబట్టి నాయందు విశ్వాసము గలవాడవు గావున నాయనంతర మీసామ్రాజ్యపీఠమున నాకొమారునే యుంచవలసిన దని తుదిసారి ప్రార్థనము. వల్లె యనినను విశ్వసించను. కృష్ణరాయలు బ్రదికియుండగనే కన్నుల దీయించి నాకు జూపిన నిశ్చింతగా బ్రాణముల విడతు"నని యన దిమ్మసచివశేఖరు డాతనిదుర్బుద్ధికి మిపుల నొచ్చుకొని 'సామ్రాజ్యరక్షామర్యాదల బాటింపు'మను చిట్టిగంగనామాత్యుని యుపదేశరహస్యము శ్రవణపుటంబుల సోకి వీరనరసింహరాయల సంతృప్తికయి మేకకన్నుల బెఱికించి తెప్పించి చూపగా, వీరనరసింహరాయలు నిజముగా దన సోదరుడే సమిపోయినా డని నమ్మి క్రీ. శ. 1509 దవ సంవత్సరమున నిశ్చింతతో బ్రాణముల విడచెను.

ఆవల గ్రీస్తుశకము 1509 దవ సంవత్సరము ఫెబ్రవరి 4 తేదీన గృష్ణరాయలకే పట్టము గట్టి భద్రసింహాసనమున గూరుచుండక పూర్వ మవలకుం బిలచి మహామాత్యుడు కృష్ణరాయల చెంప ఫెళ్ అనిపించెను. ఆ దెబ్బతో రాయలచెంప అరుణరేఖయై గ్రుడ్లు కన్నీటిధారతో నింపబడగా, మహామాత్యు డాతని జేరదీసి యనునయించి 'బిడ్డా! ఇంతవఱకు విద్యల నభ్యసించితివి గాని దండపారుష్యము నెఱుంగవు. దానిం దెలియుటకే నిన్నీపని జేసితిని. అన్యథా తలంపవలదు. దండించుపట్ల న్యాయాన్యాయముల, సత్యాసత్యముల నెఱింగి ప్రజల గన్నబిడ్డలపగిది నేలుము. బిడ్డల కష్టసుఖములకు దలిదండ్రు లెటుల బాధ్యులో యట్లె నీవును బ్రజలకు బాధ్యుడవు. నీబాధ్యతను నీ వెఱింగి రాజ్య మనుభవింపు"మని హిత వొనర్చిన తర్వాత సామంతమాండలికులు కానుకల దెచ్చి యర్పింప నందికొని దర్శనీయమైన యమ్మహోత్సవమును దర్శించుచుండెను.

"ప్రణుతింప నతడు తోరణగట్టు పరసీమ
లను రీతి నూత్న తోరణము లెసగ
రిపుల ఖండించి సత్కృప దక్షుణ్ణులనిల్పు
నట్ల ద్వారములందు ననట లలర
విలిఖించు నతడు దిక్కుల జయస్తంభాళి
ననుమాడ్కి జిత్తర్వు హర్వు లలర
వెలయు నిట్లతని కీర్తులు దిక్తటుల నన్న
సరణి ముత్తెపుమ్రుగ్గు జగ్గు లమర
నభినవాలంకృతిస్ఫూర్తి నతిశయించె
నప్పురీరత్న మపుడు మహాద్భుతముగ
బ్రకటమహిమల శ్రీకృష్ణరాయనృపతి
శ్రీకరంబైన పట్టాభిషేక వేళ."

అను గుమారధూర్జటిపద్య మీ పట్టాభిషేకము స్పష్టపఱచుచున్నది. ఈ మహోత్సవము శా. శ. 1431 శుక్ల సంవత్సర మాఘ బ 14 లు నాడు జరిగిన దని హంపియందలి శ్రీవిరూపాక్షదేవునాలయప్రాంగణమున గల కన్నడశాసన మొకటి తెలుపుచున్నది.

ఆవల గొన్నాళులకు దిగ్విజయయాత్ర సాగింపవలసిన దని రాయలను మహామాత్యుడు ప్రోత్సాహింపగా నతడు పూర్వదిగ్విజయయాత్రకు బయల్దేఱి గజపతుల యధీనమం దున్న పూర్వాంధ్రసామ్రాజ్యమును జయింప నిశ్చయించి మున్ముందుగ 'నుదయగిరి'దుర్గమును బట్టికొని యావల శత్రుదుర్భేద్య మనదగు కొండవీటి దుర్గమును ముట్టడించి వీరభద్రగజపతి పరిపాలనమున నున్న యద్దంకి, వినుకొండ, బెల్లముకొండ నాగార్జున కొండ, తంగేడు, కేతవరము, లోనగు దుర్గముల క్రీ. శ. 1515 సం. రము జూన్ 23 న లోగొనెను. ఇవ్విషయ మెఱింగి రాజమహేంద్రవరమును బరిపాలించుచున్న ప్రతాపరుద్ర గజపతికొమారు డెంత ప్రతిఘటించినను బ్రయోజనము లేకయ యవలీంగైకొనబడియెను. దీనితో జిట్టి గంగనామాత్యుని కోర్కి ఫలించిన దన్నమాట! అంతతో దనివోక ముందుకు దృష్టి పారించి రహితాపురము, పొట్టునూరు, వడ్డాది, లోనగు మన్నెరాజ్యముల జయించి చివఱకు గటకమును ముట్టడించెను. గజపతుల బలము నాడు నాటికి వృద్ధమై యోటమి కలుగునేమో యనున ట్లుండుటను గమనించి తిమ్మసచివాగ్రణి బుద్ధిమదగ్రగణ్యు డగుటచే యోజించి గజపతికిని, బ్రాతసామంతాదినృపాలురకును భేదోపాయముల గల్పించి మించుటవలన గళింగదేశాధీశుడు సంధి కొడంబడి తచ్చిహ్నముగ దన కుమార్తె రుచీదేవిని రాయల కొసగి యుద్వాహ మొనర్చుటచే నుభయుల మధ్య సంబంధబాంధవ్యములు ముప్పిరిగొన్నవి. ఆవల గ్రీ. శ. 1556 వ సంవత్సరమున 'ముదిగల్లు' దుర్గమునుగూడ ముట్టడించి విజయపతాక నెగురవైచెను. దీన నాంధ్రసామ్రాజ్య స్థాపనాచార్య బిరుదు మహామాత్యుడగు తిమ్మరుసునకు లభించను. దాన గంగనామాత్యుని కోర్కియు ఫలించెను. ఈ కోర్కి నెఱవేఱుటకు నన్నివిధముల నన్నకు దోడ్పడిన వాడు గోవిందరాయలు. ఇవ్విధముగ దిమ్మరుసు మహామాత్యుడు నలుబదేడులు మహామాత్యాది బిరుదచిహ్నములతో రంగరంగవైభోగములతో విద్వాంసుడై శౌర్యధనుడై యజరామరమగు కీర్తి నార్జించినవాడు. అతని తమ్ముడును బ్రచండదళవాయియై కొండవీటి నగరప్రతిష్ఠ నిలిపి నల్దెసల యశోవిరాజితు డయినాడు.

ఇమ్మహనీయమూర్తులకు నమోవాకములు.

కమ్యూనిస్టు చైనా

(6-వ పేజీ తరువాయి)

స్వాతంత్ర్యమును కోరుట రష్యా కెంత అయిష్టమో మంచూరియాకు రష్యా బానిసత్వ మంతే యిష్టమయింది.

నేటి పరిస్థితుల నవగాహన చేసికొంటే ఇంక చైనాకమ్యూనిస్టులకూ రష్యనులకూ మధ్య ఏర్పడిన మనఃక్లేశము తీరనేలే దని చెప్పవచ్చును. 850,000,000 డాలర్లు విలువగల్గిన మంచూరియన్ మెషీన్ స్టోరులను, మందు గుండు సామానులను రష్యా దోపిడి చేసిన విషయము చైనా ఇంకా మరచిపోలేదు. చైనాకమ్యూనిస్టులు తమ జీవితములో ఎరుగని వర్గవైషమ్యములు రష్యనులలో కన్పడడం వారి కసహ్యం గల్గించింది.

సహాయ అధికారము గల సంస్థ లన్నిటిని మాలో విరోధులతో నింపడం వారి మనస్పర్ధ లధికమవడానికి వేరొక కారణము కావచ్చును. మాలోని బహిష్కారానికై తంటాలుపడి అనేక మార్లు విజయము పొందినవి లీసాన్ (*Lilisan*) తిరిగి హార్బిన్ (*Harbin*) నగరానికి రష్యా ప్రతినిధిగా పంపడం దీనికి ఒక నిదర్శనము.

ఏదేమైనా, చైనాకమ్యూనిస్టులు విజయం పొందారు. తక్కిన చరిత్రంతా చైనానుండి మంచూరియాను విడగొట్టడానికి చేసే ప్రయత్నాలపై నాధారపడి వుంటుంది. చైనాకమ్యూనిస్టులు, తూర్పు సోషలిస్టు రాజ్యా లన్నిటికి నాయకత్వా న్నాశిస్తూ యు. ఎస్. ఎస్. అర్. (*U. S. S R.*) తో సమాన హోదాను కోరుతున్నారు. రష్యనుల కిది ఎంతమాత్రము యిష్టం లేదు. అయినను వా రింతటిలో ప్రత్యక్ష వైరధ్యాన్ని వహింపజాలరు.

చైనా బద్ధవిరోధి ఇప్పుడు అమెరికాయే. విప్లవముద్వారా సాధించబడిన స్వాతంత్ర్యాన్ని నిలుపుకోవాలంటె వారు చేసిన ప్రతిజ్ఞలను చైనాకమ్యూనిస్టులు నిలుపుకోవలసి ఉంటుంది. చైనావిషయాల్లో దేనినైనా రష్యాకు వప్పచెప్పితే ఈ స్వాతంత్ర్యం కాస్తా ఊడిపోతుంది. అందువలననే ఈ నూతన ప్రభుత్వము చైనాను త్వరితగతిని పారిశ్రామికంగా చేయడానికి పబ్లిక్ వర్క్సు రహదారీమార్గాలద్వారా పెంపొందించడానికి వ్యవసాయపద్ధతుల నవీన మార్గములలోనికి మార్చడానికి అన్నివిధాల దేశాభ్యుదయానికి తోడ్పడడానికి ప్రయత్నించక తప్పదు. కాని నేటి చైనా దారిద్ర్యములో మునిగి ఉంది. ఆ మెనగరాలన్నీ శిథిలాలయాయి. రైల్వేలన్నీ నాశనము గాబడ్డాయి, యంత్రసామగ్రి అంతా పురాతనమైపోయాయి. దేశంలోని నీటి సరఫరాపద్ధతు లన్నీ చెడిపోయాయి. ఈ దేశాభ్యుదయమునకై కమ్యూనిస్టులు ముమ్మందివన్నీ బాగుచేయడానికై పాటుపడాలి. ఇన్ని వ్యవహారములకు బాధ్యత వహించుచు చైనా యుద్ధము ప్రారంభించడానికి గాని, రష్యా అమెరికాలకు జరిగే యుద్ధములో చైనా రష్యా స్థానంగా మార్చడానికిగాని సంసిద్ధులు కావడానికి, అంతటి బుద్ధిహీనులు కారు.

18 సం॥ యుద్ధపడితులైన చైనావారు శాంతిని కోరుతున్నారు. మాలో తలంచుతున్న అభ్యుదయ ప్లాను లన్నింటికి మూలధనము అప్పులు కావాలి. మాలో అతిని అనుచరులుగూడ తమ కోర్కెలను అవసరాలను రష్యా తీర్పలేదని తెలుసుకున్నారు. అందుకైన అమెరికాతో వ్యవహారబాంధవ్యమైనా నిలుపుకొనక తప్పదు. దానితో బాటు అమెరికాయెడల ద్వేషం కూడ తగ్గిపోవచ్చు.

చైనా జాతీయవాదానికి రష్యా అంతర్జాతీయతకి చాల నేటా లున్నాయి చైనాకి రష్యాకి స్పర్థ లున్నాయి. అందుచే చైనా జాతీయవాంఛలను రష్యా ప్రాబల్యానికి బానిసగా మాత్రం వీరు వదలజాల రని నమ్మవచ్చును. చైనా రష్యా ప్రాబల్యానికి లొంగని మొదటి విదేశం కాగలదు. ఇదే నూతన ఆశియాకు ఒక ఆశాజ్యోతి.

పీపింగ్ నగరము (*Peiping*) ఆసియాకు ముస్కో కావచ్చు, పీపింగ్ నుండి ఆసియా, మార్క్సిజము వెల్వడవచ్చును. దానితో ఆశియాలో యూరోపియన్ ధర్మకర్తృత్వ దారుణాలకి స్వస్తి చెప్పబడును. రష్యన్ జాతీయవాదంతో విజృంభించే రష్యన్ కమ్యూనిజానికి ఇది అడ్డు కావచ్చును.

ఆసియామధ్యలో స్వతంత్రచైనా ప్రపంచ శాంతికి తోడ్పడగలదు. సరియైన దోహదమే కలుగజేస్తే రష్యా అమెరికా ప్రాబల్యానికి వ్యతిరేకంగా తులతూగే మరియొక బలభారంగా ఆసియారాజ్యా లేర్పడవచ్చును. 'ఆసియా ఆశియావాసులది. ఆసియాప్రభుత్వము ఆసియావాసులకోసమే ఆసియావాసులచే చేయబడాలి' అనే జపాన్ ఉద్బోధ ఈవిధంగా నిజమాతుంది.

లేఖ:

సూచనలు చాలవు!


ఆర్యా,

ప్రస్తుతము ఎక్కడ చూచినా వీధులు, రోడ్లు, కట్టడాలు, పార్కులకు గాంధీజీ పేరు పెట్టడం ఎక్కువైందనీ, మహాత్ముని స్మరించుటకు, గౌరవించుటకు మనము చేయవలసినది ఇద్ది కాదని, కావున మునిసిపాలిటీలు, జిల్లా బోర్డులు పైన పేర్కొన్న వాటికి ఇప్పుడుండే పేర్లు మార్చి గాంధీజీ పేరు పెట్టడం మాని వేయుట మంచిదని చెన్నరాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థానిక సంస్థలకు సూచించింది. దేశశ్రేయస్సు దృష్ట్యా గొప్పగొప్ప త్యాగములు చేసిన మహాపురుషుల సంస్మరణార్థము వీధులకు, రోడ్లకు, పార్కులకు, భవనములకు, వారి పేర్లు పెట్టుట ప్రపంచములోని అన్ని దేశములకు క్రమముగా వచ్చుచున్న ఆచారము. మనదేశములోకూడ ఆ ఆచారమే ఎప్పటి నుండియో వచ్చుచున్నది. దానికి నిదర్శనముగా తిలక్ ఘాట్, మాళవీయ ఉద్యాన్, శివాజీ పార్కు, ప్రకాశం రోడ్డు, చిత్తరంజన్ బజారు మొదలగునవెన్నియో పలు ప్రాంతములలో ఇప్పటికీ వాడుకలో నున్నవి. అంతేకాక మన దేశపు ముఖ్య నగరమునకు గాంధీనగర్ అనిపేరు పెట్టవలెనని రాజ్యాంగ పరిషత్తుచే తీర్మానించ బడినది.

ఐతే నాగరికత, విద్యావ్యాప్తి చెందు చున్నవని తలచు చున్నకొలది బుద్ధి విపరీతముగా పని చేయుచున్నది. కనుకనే నేడు బీడీలకు, మంగలిషాపులకు, ఎంగిలి హోటళ్ళకు, నల్లమందు షాపులకు—ఒకటేమిటి కూడని వాటికన్నిటికో సర్వసంగ పరిత్యాగులైన నాయకుల పేర్లు పెట్టబడు చున్నవి.

కనుక ప్రభుత్వము ముఖ్యముగా ఈ సంస్థలకే గాంధీ పేరు పెట్టబడకుండ చూచుట భావ్యమేమో? అంతేకాని భవనములకు, పార్కులకు, బజారులకు, ప్రనూతినిలయములకు గాంధీజీ పేరు పెట్టవద్దని సూచించుట అర్థరహితంగా లేదూ? పైగా ఒక గాంధీజీ పేరు మాత్రమే పెట్ట కూడదా? లేక ఏ మహా నాయకుని పేరూ పెట్టగూడదా? అలాగైతే ప్రభుత్వము ఒక్క గాంధీగారి పేరునే సూచించిందేం? తిలక్ మార్కు ఇంగువ, నెహ్రూ మంగలిషాపు, నేతాజీ కాఫీ, మొదలైనవాటి సంగతి ఏమి? మద్యపాన నిషేధమును పెట్టి త్రాగిన వారిని కఠినముగా శిక్షుస్తుంటేనే లెక్క చేయని స్వతంత్ర పౌరులు సూచనలతో మాట వింటారా? దీని విషయమై ప్రభుత్వం విస్పష్ట ప్రకటన చేయటం సమంజస మని నా హృదాభిప్రాయము.

గణపతి రాధాకృష్ణమూర్తి.




బీదరు అరణ్యప్రదేశాలలో చెల్లాచెదరయ్యి దొరికిన అస్థికలు
రోవాను కళేబరాని వని నిర్ణయింపబడినవి.



సిడ్నీ కాటన్ వ్యాపారసంస్థలో ఇంజనీరుగా వ్యవహరించిన దురదృష్టవంతుడు
మిస్టర్ రోవాన్



అలియాబాదు గ్రామస్థుడు హత్యానంతరం కనుగొన్న
రోవాను భౌతిక శేషాలు.



బారీదుషాగోరీ—దాని ప్రక్కన చెట్టుక్రింద రాతిబండపై కూర్చుండబెట్టి
రోవానును నిజాం సైనికులు కాల్చి హత్య గావించారు.

రోవాన్ హత్య

సిడ్నీ కాటన్‌తో చేరిన పాపానికి విశ్వాసహీనుల చేతుల్లో దుర్మరణం

1948 జూను నెలలో కరాచీలో ఉన్న సిడ్నీ కాటను సంస్థలో రోవాన్ గ్రౌండ్ ఇంజనీరుగా ఉండేవాడు. అతనికి 57 సంవత్సరాల వయస్సు. ఆనాటికే రాయల్ విమానశాఖలో ఉద్యోగంచేసి కీర్తి నార్జించినవాడు. పింఛను పుచ్చుకుంటుండేవాడు. ఇంజనీరియల్ ఎయిర్ వేసులో డివిజనల్ ఇంజనీరుగా యుద్ధసమయంలో పనిచేశాడు. ఢిల్లీలో కేంద్రప్రభుత్వ కార్యాలయంలో సైనికేతర వైమానికులకు పర్మిట్లిస్తూ మూడేళ్ళపాటు ఉద్యోగంచేశాడు. రోవానుకు ఆప్తబంధు వొకడు సిమ్లాలో ఎకౌంటెంటు జనరల్ కార్యాలయోద్యోగి. అతనికి సూరత్‌లో స్వగృహ మున్నది. రోవానుకు భార్య కలదు. ఆమె రాచపుండుతో బాధపడుతూండేది. ఇద్దరు కొమార్తెలున్నారతనికి. అతన్ని కేవలం మోసగించి కరాచీనుంచి హైదరాబాదుకు తీసుకువచ్చారు. హైదరాబాద్‌కు రహస్యంగా ఆయుధాలు సరఫరా వ్యాపారం కాటన్ సాగించటం ప్రారంభించేటప్పటికి, యథార్థాలు రోవాన్‌కు తెలియవు. జైలులో కమాండరు నికల్సురు రోవాన్‌కు అభిప్రాయభేదాలు వచ్చాయి. రోవాన్ రహస్యం బైటపెడతా డేమోనని, హైదరాబాద్‌కు అనుమానం తగలని విధంలో పంపించి, అక్కడ అతణ్ణి అదుపులో ఉంచేందుకు అధికారులు పన్నాగం పన్నారు.

1948 సెప్టెంబరు 13 న హైదరాబాద్‌పై పోలీసుచర్య ప్రారంభమయింది. శత్రువు బీదరులో ప్రవేశించేటట్టయితే తమ గుట్టు రోవాన్ ద్వారా బైలుపడకుండేందుకు రోవాన్‌ను హతమార్చాలని, అతని విషయం కావలాదారైన కమాండింగ్ ఆఫీసరు మేజరు జయిదీ ఆలోచించాడు. ఒకసారి విమానంలో కరాచీ పంపేద్దామని హైదరాబాద్ దాకా రోవాన్‌ను పంపారుగాని, విమానం రానందువల్ల తిరిగి బీదరు తీసుకురావలసి వచ్చింది. బీదరు సైనికాగారంలో ఉండగానే, గార్డు, కమాండర్ గులాం మొహిద్దీన్‌తో, శత్రువు సమీపించేటట్లయితే, బంధితుణ్ణి పరిసమాప్తం చేయుమని ఆజ్ఞ యిచ్చాడు. హవల్దారు రోవాన్‌కు గార్డుగా వున్నవాడికి ఆ ఆజ్ఞ అప్పచెప్పాడు.

15 న శత్రుసైన్యాలు సమీపిస్తూంటే, గార్డు భయపడి రోవాన్‌ను సజీవంగా హైదరాబాద్ చేరుద్దామని బయలుదేరాడు. మార్గంలో కెప్టెన్ కాజిమ్ వెనక్కుపొమ్మని ఆజ్ఞఇచ్చాడు. ఆ రాత్రికి దగ్గరలో ఉన్న దర్గావద్దనే రోవాన్‌తో వాళ్ళు ఆగారు. సెప్టెంబరు 16 న బారీషాహీ గోరీవద్దకు రోవాన్‌ను తీసుకొనిపోయి, సిపాయి రహీందార్‌ఖాన్ రోవాన్‌ను 15 గజాల దూరంనుంచి తుపాకితో కాల్చిచంపాడు.

ఇండియన్ విమానాల బాంబులవల్లనే రోవాన్ చనిపోయాడని ముందు హంతకులు బుకాయించారు. తరువాత రోవాన్ డైరీలు కాగితాలు, తదితర విశేషాలవల్ల, హత్యకుట్ర అంతా బయల్పడింది.

Regd. No. M. 4479

ఉత్తమ శైవమత గ్రంథము

పండితారాధ్యచరిత్ర

వెల రు 5-0-0 లు.

ప్యాకింగు పోస్టేజి రూ, 1—4—0.

పాల్కురికి సోమనాథకవి రచించిన ఉత్తమ ద్విపద కావ్యము. డా॥ చిలుకూరి నారాయణరావుగారిచే పరిష్కరింపబడినది. దీక్షా, పురాతన, వాద, మహిమ, పర్వతము లను అయిదు ప్రకరణములును ఒకే సంపుటమున గలవు. ఇంత నిర్దుష్టముగ ఈ గ్రంథము నిదివర కెవ్వరును ప్రచురించి యుండలేదు. నారాయణరావుగారు రచించిన అమూల్యమైన పీఠికకూడ కలదు.

ఆంధ్రగ్రంథమాల, పోస్టు బాక్సు నెం. 212, మదరాసు 1.

శ్రీమద్భగవద్గీత

సంస్కృత మూలము, తెలుగున టీకాతాత్పర్య విశేషార్థ వివరణములు గల 400 పుటల గ్రంథము. గీతాధ్యయన పరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.

ఖద్దరు బైండు.

వెల రు 4-0-0 లు.

తపాలా ఖర్చు అ. 0-9-0.

ఆంధ్రగ్రంథమాల

పోస్టుబాక్సు 212 మదరాసు 1.

తెలుగు మెఱుగులు

గ్రంథకర్త: వేటూరి ప్రభాకరశాస్త్రిగారు

తెలుగుదనము, తెలుగుసంప్రదాయాలు, తెలుగుభాష అవతరించిన విధము, తెలుగు తేటదనము, తెలుగు కవితా పారమ్యము, ప్రాచీన గ్రంథాల పలుకుబడికి మనపై చెల్లుబడి, లక్షణమైన మన అరసున్న చరిత్ర, వింత వింత నిఘంటువులు, మన గ్రంథాలలో గ్రంథులు, అవీ ఇవీ, ఇంకా తెలుగులో ఉన్న ఎన్నో మెఱుగులను చూపెట్టుచున్న వ్యాసముల సంపుటి. శాస్త్రిగారి పాతిక ముప్ఫయి సంవత్సరాల సాహిత్య కృషి ఇందులో మూర్తీభవించియున్నది. ఆంధ్రాభిమానముగల వారందరు అవశ్యము చదువవలసిన గ్రంథము. ప్రతులకు త్వరపడవలెను.

వెల ౨ రూ. తపాలాఖర్చులు ౭ అణాలు.

ఆంధ్ర గ్రంథమాల, పోస్టుబాక్సు నెం. 212, మదరాసు.

కళాప్రపూర్ణ కీ॥ శే॥ కాశీనాథుని నాగేశ్వరరావుగారి

ఉత్కృష్టరచన

ఆంధ్రవాఙ్మయ చరిత్ర



సరికొత్తపద్ధతిని, సంగ్రహరూపంలో నడిచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల వాఙ్మయచరిత్రకు విశుద్ధదర్పణం. పాతచరిత్రలనన్నిటిని అవలోడన చేసి, సమన్వయించి క్రోడీకరించిన సిసలయిన చరిత్ర. శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండి ఉండి, నన్నయధర్మమా అని ఒక్క-ఊపున దివ్యాకారంతో బైటపడి, నానాటికి నవనవోజ్జ్వలంగా వికసించిన మన వాఙ్మయం పోయిన పలుపోకడలను పోడిమితో చూపెట్టజాలిన ఉత్తమ గ్రంథం.

వెల రు 2-0-0 లు, తపాలాఖర్చు 0-7-0 ఆంధ్రగ్రంథమాల, పో. బా. 212, మద్రాసు.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras 1.